www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 36 పుటలు : 52

# జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు ఆషాఢ శుద్ధ పంచమి
30 జూన్ - 6 జులై 2025
వెల : ₹20/-



# మధ్య ప్రాచ్యంలో మంటలు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక




## 145 సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాల

# మనోరంజితం విద్యాలయం పునరుద్ధరణ

**భాగ్యనగర్:** విద్యార్థులకు విద్యా విజ్ఞానాలతోపాటు సాంస్కృతిక, నైతిక విలువలను ప్రబోధించి, వారిని దేశభక్తులుగా, సమాజ సేవకులుగా తీర్చిదిద్దడం విద్యాలయాల లక్ష్యం కావాలని హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి, కేశవ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అన్నారు.

జూన్ 18న భాగ్యనగర్, తిలక్‌రోడ్‌లో కేశవమెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 145 సంవత్సరాల నాటి మనోరంజితం మెమోరియల్ హైస్కూలులో ఇంగ్లీషు మీడియం తరగతులను ప్రారంభిస్తూ విద్య, వైద్యం ఈ రెండూ వ్యాపారంలా మారకూడదని, విలువలను, సేవాభావాన్ని పెంపొందించే విధంగా ఆ వ్యవస్థలు పనిచేయాలని చెప్తూ 1940లో ప్రారంభమైన కేశవ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అటువంటి విలువలకే కట్టుబడి ఉందని అందుకే 1883లో ప్రారంభమైన మనోరంజితం ఎడ్యుకేషనల్ సొసైటీ నడిపిస్తున్న తెలుగు మీడియం పాఠశాల మూతబడే స్థితికి వచ్చిన సందర్భంలో ఆ సమితివారు ఈ పాఠశాలను కేశవమెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీకి అప్పగించారని, ఇది ఎంతో శుభపరిణామ మని, విద్యారంగంలో పనిచేస్తున్న ఈ సంస్థకిది ఒక చారిత్రాత్మక ఘట్టమని నరసింహారెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా పాల్గొన్న గోషామహల్ ఎం.ఎల్.ఏ రాజాసింగ్ మాట్లాడుతూ నా నియోజకవర్గంలో సేవా దృక్పథం గలిగిన ఒక గొప్ప విద్యా సంస్థ ఈ విద్యాలయాన్ని నడపడం నాకెంతో గర్వకారణంగా ఉందని, పేద ప్రజానీకం నేటి కార్పొరేట్ విద్యాలయాల్లో ఫీజులు చెల్లించుకోలేక నానా ఇబ్బందులు పడుతున్న వారందరికీ తక్కువ ఫీజుతోనే మెరుగైన విద్యను అందించడానికి ముందుకు వచ్చిన కేశవ మెమోరియల్ సొసైటీని మనసారా అభినందిస్తున్నానని అన్నారు.

మనోరంజితం విద్యాలయాన్ని రాజాకిషన్ ప్రసాద్ 1883లో ప్రారంభించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, శ్రీమతి ఇందిరాగాంధీ, ఆంధ్రప్రదేశ్ మాజీ గవర్నర్ కుముద్‌బెన్‌జోషి, దామోదరం సంజీవయ్య మొదలుగు ప్రముఖులెందరో ఈ పాఠశాల కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన కేశవ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీకి కేశవ మెమోరియల్ విద్యాసంస్థలు తెలంగాణ ప్రాంతంలోనే ఒక రికార్డును సృష్టిస్తున్నాయి. సంస్కృతి, విలువలతో కూడిన విద్యను బోధించడమే లక్ష్యంగా నడుస్తున్నాయి. మనోరంజితం పాఠశాలను కూడా ఆ దిశలోనే నడిపిస్తామనే విశ్వాసాన్ని సొసైటి అధ్యక్షులు వ్యక్తపరిచారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ డా. సురేఖ, సొసైటీ కార్యదర్శి డా.అన్నదానం సుబ్రహ్మణ్యం ఉపాధ్యక్షులు జె.నరసింహారావు, సొసైటీ సహ కార్యదర్శి శ్రీధరరెడ్డి, మనోరంజితం మెమోరియల్ హైస్కూలు అధ్యక్షులు శ్యాంరాజ్, కరస్పాండెంట్ జ్యోతి, ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సంఘచాలక్ సుందర్‌రెడ్డి, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



# జాగృతి చదువుదాం.. చదివిద్దాం..

ఆసక్తి కలిగించే విశ్లేషణలు..
జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు..
స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.

రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి. లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఒక సంవత్సర చందా రూ.850/-
http://payit.cc/S18970

ఐదు సంవత్సరాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను రిజిస్టర్డ్ పార్సిల్ (మ్యాగజైన్ పోస్టు) ద్వారా అందుకోవడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/-
+ మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ.624/-)

సం.ర చందా మ్యాగ్జిన్ పోస్టు
వెల : రూ.1474/-
https://payit.cc/S32796

విడి ప్రతి
రూ.20/-

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

వివరాలకు సంప్రదించండి సర్క్యులేషన్ మేనేజర్ : 040-2756 1453, 99599 97013

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 | సంవత్సర చందా రూ.850

**బ్యాంకు ఖాతా వివరాలు**

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

కాదేది కవిత కనర్హం..అన్నట్లు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రతి అంశమూ విమర్శనార్హం, అభ్యంతరకరమే. తమకు నచ్చని ప్రభుత్వ పెద్దలు, ఇతర ప్రముఖుల ప్రతి ప్రకటనలోనూ పెడర్థాలు,విపరీతార్థాలు వెదకి రచ్చచేయడం ఆయన ప్రత్యేకత. మంచిని మంచిగా, చెడును చెడుగా పరిగణించి ఆమోదించడం ఆయన నిఘంటువులో లేదని అనేక సందర్భాలు రుజువు చేశాయి. తన స్పందన సమాజ హితమా? హేతుబద్ధమా? పదుగురికి పని కొచ్చేదా? లాంటి ప్రశ్నలు అసంగతం. మనసుకు తోచింది అనేయడమే ప్రధానం. ఆంగ్లం దేశంలో అనివార్యంగా రాజ్యమేలుతున్న సంగతి తెలిసిందే. అవసరార్థం ఆ భాషను ఆమోదిస్తూనే, దేశీయ/మాతృభాషలను ఆదరించాలని అనేకులు ఆది నుంచి చెబుతున్నదే. ఆ పంథాలోనే 'మన సంస్కృతికి మాతృభాషలే రత్నాలు. అవి లేకపోయినా, వాటిని ఆదరించకపోయినా భారతీయులం అనిపించుకోలేం. మన సంస్కృతి, చరిత్ర లాంటి అంశాల అధ్యయనానికి అమ్మ భాషలు మించినవి లేవు.అరకొరగా నేర్చిన విదేశీ భాషలతో పరిపూర్ణత సాధించలేం.కనుక ఆంగ్లం మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు రావడానికి ఎంతో దూరం లేదు' అని దేశంలోని భాషలప్రాముఖ్యం, వాటి వారసత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు రాహుల్‌కు అభ్యంతరకరమనిపించాయి.

విశ్రాంత ఐఏఎస్ అధికారి అశుతోష్ అగ్నిహోత్రి రాసిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి జూన్ 19న హాజరైన అమిత్ షా, దేశీయ భాషల ప్రాధాన్యతను వివరించే క్రమంలో... విదేశీ భాషను వదిలించుకోవడం అంత తేలికకాదన్న సంగతి తెలుసునని, అయినా భారతీయులు స్వభాషలకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. దానికే విపక్షనేత స్పందించి, 'ఆంగ్ల భాష మాట్లాడడం సిగ్గు చేటు కాదు...విద్యార్థుల ఉన్నతికి ఊతం' అని సెలవిచ్చేశారు. పేదలు ఉన్నత విద్యను అభ్యసించడం భారతీయ జనతాపార్టీకి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు ఇష్టం లేదని కూడా ఆక్రోశించారు.

ఆంగ్ల భాష అనవసరమన్న భావన ఎవరికీ లేదు, ఉండనవసరం లేదు కూడా. 'భుక్తికి ఆంగ్లం.. జీవన రక్తికి అమ్మభాష' అని అనేకులు వ్యాఖ్యానించే ఉన్నారు.

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు ఆషాఢ శుద్ధ పంచమి**

## లోపలి పేజీలలో...




6లో

ముఖపత్ర కథనం

**మధ్య ప్రాచ్యంలో మంటలు**

ఆంధ్రప్రదేశ్

**ప్రపంచ ఐక్యతా సారం 'యోగా'**



18లో

ప్రత్యేక వ్యాసం

**పుణ్యప్రదాయిని తొలి ఏకాదశి**



26లో

# జాగృతి

## సంపాదకీయం

ప్రపంచ దేశాలకు ఆంగ్లం అనుసంధాన భాషని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఆ భాషా పరిజ్ఞానం వల్ల ఒనగూరే ప్రయోజనాలతోనూ విభేదించనక్కర్లేదు. ఆంగ్లం అంటే ఒకప్పుడు వ్యామోహమైతే, ఇప్పుడు అవసరమనడంలో భిన్నాభిప్రాయం ఉండబోదు. ఆ భాషలో రాయడం, చదవడం, మాట్లాడడం వంటి నైపుణ్యాలు ఆహ్వానించదగినవే. అదే సమయలో బాల బాలికలను ప్రాథమిక విద్య నుంచే తల్లి భాషకు దూరం చేసే తీరు అభ్యంత రకరం. పరభాషా మోజులో ప్రాంతీయ భాషల అస్తిత్వానికి ముప్పు ముంచుకొస్తోందని చాలా

# విమర్శే ప్రధానమా?

ఏళ్లుగా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఆరు వేలకు పైగా భాషలు ఉన్నాయని, జీవన వైవిధ్యానికి, మానవ వికాసానికి ఇవి ప్రతీకలని ఐక్యరాజ్య సమితి సాంస్కృతిక విభాగం (యునెస్కో) దాదాపు పాతికేళ్ల క్రితమే పేర్కొంది. కొన్ని వేలమంది మాత్రమే మాట్లాడే భాషలు మనుగడ కోల్పోతుండగా, లక్షల, కోట్ల సంఖ్యలో ప్రజలు మాట్లాడే భాషలు కూడా కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నాయని భాషావేత్తలు, భాషా పరిరక్షణ ఉద్యమ నేతలు, మేధావులు ఆందోళన చెందుతున్నారు. తెలుగు భాషా పరంగానే ఆలోచిస్తే...పిల్లల్లో, యువతరంలో తెలుగు భాష వ్యవహారం తగ్గిపోతుండడం పట్ల కలత చెందుతున్నారు. అందుకే ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలని, అదే శాస్త్రీయ విధానమని నినదిస్తున్నారు.

అమ్మ భాషలో చదువుల కారణంగా విద్యార్థుల్లో విశ్లేషణ, పరిశోధన సామర్థ్యాలు వెల్లివిరుస్తాయన్నది అక్షరసత్యం. అనేక దేశాలు దీనిని రుజువు చేస్తున్నాయి కూడా. రష్యా, చైనా, జర్మనీ, జపాన్ లాంటి ఎన్నో దేశాలు కేజీ నుంచి పీజీ వరకు సొంత భాషలోనే బోధిస్తున్నాయి. విజ్ఞాన సముపార్జనలో తిరుగులేని శక్తులుగా వర్ధిల్లుతున్నాయి. ఆయా దేశాల స్ఫూర్తితో.. ఆంగ్లభాష, ఆంగ్ల మాధ్యమాలే సర్వరోగ నివారిణి అనే భ్రమ నుంచి బయటపడాలనే సంగతి ప్రపంచ దేశాలు చుట్టి వచ్చే రాహుల్‌కు తెలియదనుకోలేం. ఎక్కడో దాకా ఎందుకు? కన్నడంలో మాట్లాడే వారే కర్ణాటకలో ఉండాలని అక్కడ ఏలికలు అంటున్నట్లు వచ్చిన వార్తలను ఖండించి, అక్కడ ఆంగ్లంను నిర్బంధం చేయగలరా?

అపరిచిత బోధనా మాధ్యమంలో విద్యాభ్యాసం, ప్రజ్ఞాపాటవాల వికాసానికి గొడ్డలిపెట్టుగా పరిణమిస్తుందని ప్రపంచవ్యాప్త అధ్యయనాలు, యునెస్కో లాంటి సంస్థలు హెచ్చరించాయి. విజ్ఞానశాస్త్ర మథనంలో భారతీయుల భాగస్వామ్యం ఇనుమడించేందుకు సైన్స్‌ను మాతృభాషలో బోధించాలని నోబెల్ పురస్కార గ్రహీత సీవీ రామన్ ఎన్నడో ఉద్ఘాటించారు.

ఉద్యోగ ఉపాధి అవకాశాలను ఇతోధికంగా అందిపుచ్చుకునేందుకు అవసరపడుతుందనే ఉద్దేశంతోనే కన్నవారు తమ బిడ్డలను ఆంగ్ల మాధ్యమంలో చేరుస్తున్నారని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. స్థితిమంతులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో చదివిస్తున్నప్పుడు తమ చిన్నారులను మాతృ(తెలుగు) మాధ్యమానికే ఎందుకు పరిమితం చేయాలనే ప్రశ్న దిగువ ఆదాయ వర్గాలనుంచి ఎదురవుతోంది. అన్ని విద్యాసంస్థల్లో ప్రాథమిక విద్యా మాధ్యమంగా మాతృభాషే ఉంటే ఈ ప్రశ్నకు ఆస్కారమే ఉండదు. అమ్మభాషలో చదివిన వారికి బతుకుతెరువుకు ఢోకా ఉండదనే భరోసా కల్పించగలిగిన నాడు, నేతలు తమకు నచ్చని ప్రతి అంశాన్ని భూతద్దంలో చూపి భయపెట్టని నాడు స్వదేశీ భాషల్లోనే అభ్యాసం వైపు మొగ్గు చూపవచ్చు. ★

30 జూన్ 2025, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**ధర్మజ గీత**

– విహారి





| | | |
|---|---|---|
| 'వాణిజ్య' ప్రభుత్వాలు (తెలంగాణ) | - | 16 |
| విదేశీ పర్యటనపై మోదీ ముద్ర (అంతర్జాతీయం) | - | 20 |
| దౌత్యయాత్ర దిగ్విజయం (జాతీయం) | - | 23 |
| అంతరిక్ష యాత్రకు రెండో భారతీయుడు.. (రోదసి) | - | 25 |
| 'వర'పుత్రికలు (మహిళ) | - | 28 |
| జాతిపై నీతి వెన్నెల వెలుగు.. (గళమెత్తిన గతం) | - | 30 |
| ట్రంప్ అబద్ధాల ఆట (అంతర్జాతీయం-1) | - | 32 |
| ...జాతీయ సమైక్యతా దీపం (ప్రత్యేక వ్యాసం) | - | 34 |
| విశ్వక్రికెట్లో 'వికసిత' భారత్! (క్రీడ) | - | 43 |
| ఎటు నుంచి ఎటో వెళ్లిన కుబేర! (సినిమా) | - | 50 |

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నంతపని చేశారు. అణు ఒప్పందంపై అమెరికాతో చర్చలకు, ఇజ్రాయెల్ ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరిట చేస్తున్న వైమానిక దాడులకు ముడిపెడుతూ తాత్సారం చేస్తున్న ఇరాన్‌పైన ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్ పేరిట భీకరమైన దాడికి ఉపక్రమించారు. మూడు అణు కేంద్రాలను ధ్వంసం చేశారు. జూన్ 13 నుంచి ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పరం చేసుకుంటున్న దాడులను కొత్త మలుపు తిప్పారు. శక్తి ప్రదర్శనతోనే శాంతి నెలకొల్పడం సాధ్యమవుతుందనే సరికొత్త నినాదాన్ని భుజానికి ఎత్తుకున్నారు. యావత్ ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తున్నట్టుగా, ఇరాన్ అణు కార్యక్రమానికి ముగింపు పలుకుతున్నట్టుగా అమెరికా ఇరాన్ అణుకేంద్రాలపై జూన్ 22, తెల్లవారుజామున వైమానిక దాడులు చేసింది. ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్‌లో భాగంగా అమెరికా లోని మిస్సోరి నుంచి 125 యుద్ధ విమానాలు, బంకర్-బస్టర్ బాంబులతో ఆరంభించిన ఈ భీకరదాడులు ఇరాన్ గడ్డపై కేవలం 25 నిమిషాల్లోనే పూర్తికావడం విశేషం. అయితే ఇంత పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నప్పటికీ ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు దాడిలో పాలుపంచుకున్న అమెరికా యుద్ధ విమానాలను, క్షిపణులను అడ్డుకోలేక పోవడం గమనార్హం. ఈ మొత్తం ఆపరేషన్‌లో 14 బంకర్-బస్టర్ బాంబులు, రెండు డజన్లకు పైగా టోమాహాక్ క్షిపణులు, 125కు పైగా సైనిక యుద్ధ విమానాలు పాల్గొన్నాయి. వీటిలో ఏడు స్టెల్త్ బీ-2 బాంబర్లు కూడా ఉన్నాయి. అమెరికా ఇరాన్‌పైకి ఇంత భారీ ఎత్తున దాడి చేయడం ఇదే మొదటిసారి. అమెరికాలోని మిస్సోరిలో




# మధ్య ప్రా

వైమానిక స్థావరం నుంచి చెరి ఇద్దరు సిబ్బందితో కూడిన ఏడు బీ-2 స్పిరిట్ బాంబర్లతో కూడిన ప్రధానంగా దాడి చేసే బృందం మార్గమధ్యంలో ఇంధనాన్ని నింపుకుంటూ తూర్పు దిశగా 18 గంటలపాటు ప్రయాణించింది. బృందంలో ఒక భాగం శత్రువును ఏమారుస్తున్నట్టుగా పశ్చిమదిశగా ప్రయాణించి పసిఫిక్ ద్వీపం గోమ్‌కు చేరుకుంది. ఈ ఏమార్చే కార్యక్రమం భారత కాలమానం ప్రకారం జూన్ 21, సాయంత్రం నుంచి జూన్ 21, 22 అర్ధరాత్రి సంధి కాలంలో జరిగింది. అర్ధరాత్రి దాదాపు 12.30 గంటలకు ఇరాన్‌లోని ఇస్ఫహన్ అణు కేంద్రం వద్ద కీలకమైన




# చ్యంలో మంటలు

లక్ష్యాలపైకి రెండు డజన్లకుపైగా టోమాహాక్ క్రూయిజ్ క్షిపణులను అమెరికా జలాంతర్గామి ప్రయోగించింది. ఇరాన్ కాలమానం ప్రకారం జూన్ 22 తెల్లవారుజామున 2.10 గంటలకు అంటే భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 4.10 గంటలకు కీలకమైన బీ-2 బాంబర్ రెండు పెద్ద బంకర్-బస్టర్ బాంబులను ఇరాన్‌లోని ఫోర్డో అణు కేంద్రంపైకి జారవిడిచింది. 25 నిమిషాల్లో మిగిలిన నతాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై దాడులు జరిగాయి. ఈ మొత్తం ఆపరేషన్‌కు ముక్తాయింపు అన్నట్టుగా టోమాహాక్ క్షిపణి ఇస్ఫహాన్‌పైకి బాంబులతో దాడి చేసింది. బాంబర్లు ఒక్కొక్కటి దాదాపు 13,608 కేజీల బరువున్న డజనుకుపైగా అతిపెద్ద ఆర్డ్‌నెన్స్ పెనెట్రేటర్ బాంబులను ఫోర్డో, నతాంజ్ కేంద్రాలపైకి జారవిడిచాయి. మొత్తం బృందం తెల్లవారు జామున 4.35 గంటలకు ఇరాన్ నుంచి నిష్క్రమించింది.

# దారికి రాకుంటే మళ్లీ దాడులు చేస్తాం: ట్రంప్

ఇరాన్‌లో ఫోర్డో, నటాంజ్, ఎస్‌ఫహాన్ అణు కేంద్రాలపై దాడులను విజయవంతంగా పూర్తి చేసినట్టు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో చేసిన పోస్టులో "ఇరాన్‌లో మూడు అణు కేంద్రాలపై మా దాడులను విజయవంతంగా పూర్తి చేశాం. కీలకమైన ఫోర్డో కేంద్రంపై పెద్ద ఎత్తున బాంబులతో దాడులు చేశాం. అన్ని విమానాలూ సురక్షితంగా తిరుగుముఖం పట్టాయి.

మన ఘనత వహించిన అమెరికా యోధులకు అభినందనలు. ప్రపంచంలో మరే ఇతర మిలటరీ కూడా ఇంతటి ఘన కార్యాన్ని సాధించలేదు. శాంతికి సమయం ఆసన్నమైంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలకు, ఇజ్రాయెల్‌కు, యావత్ ప్రపంచానికి ఇది ఒక చరిత్రాత్మకమైన విజయం. ఇరాన్ ఈ యుద్ధానికి ముగింపు పలకడానికి ఇప్పుడు అంగీకరించి తీరాలి" అని అన్నారు. అమెరికా అధ్యక్షుడు అనంతరం మీడియాతో మాట్లాడుతూ "ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ధన్యవాదాలు, అభినందనలు తెలుపుకుంటున్నాను. గతంలో మరే ఇతర బృందం చేయని విధంగా మేం కలసికట్టుగా పనిచేశాం. మేం ఇజ్రాయెల్‌కు ఈ భయానకమైన ముప్పును తొలగించడానికి చాలా దూరం వెళ్లాం. ఈ సందర్భంగా అద్భుతంగా పనిచేసిన ఇజ్రాయెల్ మిలటరీకి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను" అని అన్నారు. ఇరాన్ గురించి మాట్లాడుతూ "ఇరాన్ శాంతి లేదా విషాదం ఈ రెండింట్లో ఏదో ఒకదాన్ని మాత్రమే ఎంచుకోవాలి. గడచిన ఎనిమిది రోజుల్లో అనుకున్నదానికన్నా మించినదానికి సాక్షిగా నిలిచాం. (దాడి చేయడానికి) మరిన్ని లక్ష్యాలు మిగిలి పోయాయని గుర్తుంచుకోండి. నేటిరాత్రి వారికి అత్యంత దుర్భరమైన, ప్రాణాంతకమైన రాత్రిగా మారింది. కానీ ఈ ప్రాంతంలో వెంటనే శాంతి నెలకొనని పక్షంలో మేం మిగిలిన లక్ష్యాలపై అత్యంత వేగంగా, కచ్చితంగా, నైపుణ్యంతో దాడి చేస్తాం" అని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ అణుశుద్ధి సామర్థ్యాన్ని దెబ్బ తీయడం లక్ష్యంగా దాడులు చేసినట్టు తెలిపారు. అదే సమయంలో ప్రపంచంపైకి ఉగ్రవాదాన్ని ఉసిగొల్పడంలో ముందుండే దేశం (ఇరాన్) నుంచి అణ్వస్త్రాల ముప్పును తప్పించడానికి కూడా దాడులు చేసినట్టు చెప్పారు.

## హొర్ముజ్ జల

మూడు అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో ఇరాన్ కఠిన చర్యలకు సిద్ధమైంది. అమెరికా, ఇజ్రాయెల్‌పై అంతర్జాతీయంగా ఒత్తిడి తెచ్చేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. కీలకమైన హొర్ముజ్ జలసంధిని మూసివేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయానికి ఇరాన్ పార్లమెంట్ ఆమోదం తెలిపిందని పార్లమెంట్ సభ్యుడు ఇస్మాయిల్ కొసరి టెహ్రాన్ తెలిపారు. అయితే దీనిపై సుప్రీం సెక్యూరిటీ కౌన్సిల్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు.

ప్రపంచంలో చమురు రవాణాకు హొర్ముజ్ జలసంధి కీలకమైంది. దీని ద్వారా ప్రపంచం చమురు సరఫరాలో దాదాపు 30 శాతం రవాణా అవుతుంది. భారత్ చమురు దిగుమతులకు సైతం ఈ జలసంధి కీలకమైనది. ఇది పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రం, హిందూ మహా సముద్రంతో కలుపుతుంది. దాదాపు 33కి.మీ.ల వెడల్పు ఉన్న దీని గుండా ప్రతి నిత్యం 2 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు వేర్వేరు దేశాలకు రవాణా అవుతుంది. ప్రపంచదేశాలకు ముడి చమురు ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతుంది. ఈ జలసంధి లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్–ఎల్ఎన్‌జీ రవాణాకు కూడా కీలకమైనది. దీని ద్వారానే ప్రపంచానికి మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ రవాణా అవుతుంది. ఈ జలసంధిని మూసివేసిన పక్షంలో అది అంతర్జాతీయ మార్కెట్‌పైన పెను ప్రభావాన్ని చూపించే అవకాశం ఉంది. భారత్‌పైనా ఆ ప్రభావం ఉంటుంది. ఎందుకంటే భారత్ తన అవసరాల కోసమని 90 శాతం ముడి చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. అందులో 40 శాతం హొర్ముజ్ జలసంధి ద్వారానే భారత్‌కు చేరుతుంది. చమురుతో వచ్చే నౌకలు ఒమన్, ఇరాన్ సముద్ర మార్గంలో ఉన్న ఈ జలసంధి మీదుగా



## లైవ్‌లో టీవీ యాంకర్ పరార్




జూన్ 16, సాయంత్రం.. ముఖానికి ముసుగు లేకుండా బురఖా వేసుకున్న ఓ టీవీ న్యూస్ చానెల్ యాంకర్ ఎదురుగా ఉన్న మానిటర్‌ను, కెమెరాను సీరియస్‌గా చూస్తూ లైవ్‌లో వార్తలు చెబుతోంది. ఇరాన్ చేతిలో ఇజ్రాయెల్ చావు దెబ్బలు తింటోందని చేతులు తిప్పుతూ మరీ వివరిస్తోంది. ఈలోపల పెద్ద చప్పుడు వినిపించింది. ఒక్క క్షణం వార్తలు చెప్పడం ఆపింది. మళ్లీ తన పని మొదలుపెట్టింది. అలా మొదలుపెట్టిందో లేదో పై నుంచి స్టూడియో పైకప్పు పెచ్చులు వచ్చి మీద పడ్డాయి. వెనక్కి తల తిప్పి చూసింది. పెచ్చులు పడుతూనే ఉన్నాయి.

వెంటనే వార్తలు చెప్పడం ఆపేసి అక్కడ్నుంచి పరుగులు తీసింది. వార్తలు చూస్తున్న వీక్షకులకు టీవీ తెర అంతా దట్టమైన దుమ్మూ ధూళితో అలముకున్నట్టుగా కనిపించింది. కాసేపటికి ఇరాన్ ప్రభుత్వ టీవీ, రేడియో చానెల్– ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్ ప్రధాన కార్యాలయం ఇజ్రాయెల్ క్షిపణి దాడుల్లో ధ్వంసమైపోయింది.

# సంధి మూసివేతకు రంగం సిద్ధం



ప్రయాణిస్తూ మనదేశానికి చేరుకుంటాయి. ఇరాన్ నిర్ణయం నేపథ్యంలో చమురు ధరలు పెరిగే అవకాశం ఉందనేది అంతర్జాతీయ విశ్లేషకుల అభిప్రాయం.

**భారత్ ముందుచూపు**

మనదేశం ప్రపంచ చమురు మార్కెట్ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ముందు చూపుతో వ్యవహరిస్తోంది. ఆ దిశగా ప్రత్యేక వ్యూహాన్ని రూపొందించింది. చమురు దిగుమతుల్లో పెను మార్పులు చేసింది. గల్ఫ్ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుంటోంది. రష్యా, అమెరికా నుంచి దిగుమతులను భారీగా పెంచింది. ప్రపంచ వాణిజ్య విశ్లేషణ సంస్థ క్యాప్లర్ ప్రకారం భారత్ జూన్ నెలలో రష్యా నుంచి రోజుకు 20 నుంచి 22 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంది. ఇది గత రెండేళ్లలోనే అత్యధికం. మే నెలలో చమురు దిగుమతి 11 లక్షల బ్యారెళ్లుగా ఉంది. గతంలో భారత్‌కు రష్యా నుంచి చమురు దిగుమతులు మొత్తం దిగుమతుల్లో ఒక శాతం ఉండగా ప్రస్తుతం 40 శాతం నుంచి 44శాతం మధ్యలో ఉంది.

మనదేశం అమెరికా, లాటిన్ అమెరికా దేశాల నుంచి కూడా చమురు దిగుమతి చేసుకుంటోంది. భారత్ జూన్ నెలలో అమెరికా నుంచి రోజుకు 4.39 లక్షల బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసింది. గతంలో కన్నా ఇది రెండింతలు పెరిగింది. మన దేశం ప్రతిరోజూ 51 లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకుంటోంది.



# మధ్య ప్రాచ్యానికి మంచిరోజులు:

## ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

ఇరాన్‌లో కీలకమైన అణు కేంద్రాలపై వైమానిక దాడులు చేయించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కొనియాడారు. అమెరికా సైనిక చర్యను మధ్యప్రాచ్యం భవిష్యత్తుకు కొత్త రూపాన్ని ఇచ్చే ఒక సాహసోపేతమైన చర్యగా వర్ణించారు. ఈ మేరకు ఒక వీడియో సందేశంలో “శక్తి ప్రదర్శనతోనే శాంతి నెలకొంటుంది. మొదట శక్తి ప్రదర్శన జరుగుతుంది. ఆ తర్వాత శాంతి నెలకొంటుంది. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అపరిమితమైన శక్తిని ప్రదర్శించారు. ఇది ఒక నిర్ణయాత్మకమైన, సాహసోపేతమైన చర్య. చరిత్రలో చిరస్మరణీయమవుతుంది. ” అని అన్నారు. అమెరికా అధ్యక్షుడికి ఆయన అభినందనలు తెలిపారు.

ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలను ఆర్జించుకోవాలనుకునే అత్యంత ప్రమాదకరమైన ఏలుబడిని ఈ చర్య తిరస్కరించిందని అన్నారు. ప్రాంతంలో ముప్పులను దీటుగా ఎదుర్కోవడంలో ఇజ్రాయెల్ పాత్రను నెతన్యాహు ప్రముఖంగా ప్రస్తావించారు. అయితే మరే ఇతర దేశమూ చేయలేనివిధంగా అమెరికా ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్ చేపట్టిందని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు కేవలం అమెరికా భద్రత కోసమే కాకుండా యావత్ ప్రపంచం భద్రత కోసం సైనిక చర్యకు పూనుకున్నారని చెప్పారు. ట్రంప్ లాంటి స్నేహితుడు మరొకరు ఉండరని, అణు ముప్పును తొలగించడంలో ఇజ్రాయెల్ పౌరులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని ఆయన అన్నారు.

# అమెరికాలో భద్రత కట్టుదిట్టం

అణు కేంద్రాలపై వైమానిక దాడులకు అమెరికా తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు అని ఇరాన్ హెచ్చరించిన నేపథ్యంలో అమెరికాలో న్యూయార్క్, వాషింగ్టన్, లాస్ ఏంజెలెస్ సహా పలు నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మత, సాంస్కృతిక, దౌత్యపరమైన ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్టు న్యూయార్క్ భద్రత అధికారులు తెలిపారు. అయితే ఇప్పటివరకు నిర్దిష్టమైన లేదా నమ్మదగిన ఎలాంటి బెదిరింపులు రాలేదని, పరిస్థితులను ఎప్పటికప్పుడు మదింపు వేస్తూ చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్టు లాస్ ఏంజెలెస్ మేయర్ కరెన్ బాస్ తెలిపారు.






# ఆదిలో మిత్రులు.. ఆనక శత్రువులు

మే 14, 1948న ఇజ్రాయెల్‌ను స్వతంత్ర సార్వభౌమ దేశంగా జియోనిస్టు నేత డేవిడ్ బెన్ గురియన్ టెల్ అవివ్‌లో ప్రకటించారు. అయితే ముస్లిం దేశాలలో అత్యధికం ఇజ్రాయెల్‌ను ఒక దేశంగా గుర్తించడానికి మొగ్గు చూపలేదు. కానీ షియా ముస్లింల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఇరాన్, టర్కీ దేశాలు ఇజ్రాయెల్‌ను గుర్తించాయి. అమెరికా తోడ్పాటుతో ఈ మూడూ మిత్రదేశాలుగా జట్టు కట్టాయి. రష్యా, అమెరికా దేశాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తున్నప్పుడు అప్పటి ఇరాన్ అధినేత మహమ్మద్ రెజా పహల్వీ అమెరికా వైపు మొగ్గు చూపారు. ప్రాంతీయంగా పట్టు సాధించడానికి పశ్చిమ దేశాలతో చేతులు కలిపారు. రెండు దశాబ్దాల తర్వాత అప్పటి ఇజ్రాయెల్ ప్రధాని డేవిడ్ బెన్ గురియన్ ఏలుబడిలో అరబ్‌యేతర దేశాలతో మైత్రికి ప్రాధాన్యం ఇచ్చారు. ఇరాన్, టర్కీ, ఇథియో పియా, ఇజ్రాయెల్ దేశాలు కలసిమెలసి పనిచేశాయి. ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్, ఇరాన్ నిఘా సంస్థ సావక్ మధ్య సమాచారం, ఆయుధాలు ఇచ్చి పుచ్చుకునేంతగా సంబంధాలు నెలకొన్నాయి. ఇరుదేశాలూ బలపడిన వాణిజ్య సంబంధాలతో అభివృద్ధిని సాధించాయి.

1979లో ఇరాన్‌లో చోటు చేసుకున్న తిరుగుబాటుతో మొహమ్మద్ రెజా షా పహ్లవీ నేతృత్వంలోని సామ్యవాదం ముసుగు తొడుకున్న రాచరిక ప్రభుత్వం కుప్పకూలిపోయింది. అయతొల్లా రహెుల్లా ఖొమేని ఆధ్వర్యంలో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ఆవిర్భవించింది. తిరుగుబాటుకు తోడ్పడిన ఇతర భావజాలాలను, వాటిని భుజానికి ఎత్తుకున్న వారిని ఖొమేని ఏలుబడి మట్టుపెట్టడం మొదలుపెట్టింది. దీనికి హ్యాంగింగ్ జడ్జి–ఉరిశిక్షలు విధించే న్యాయమూర్తిగా పేరొందిన కరుడుగట్టిన ఇస్లాం మతోన్మాది అయతొల్లా సాదెఖ్ ఖల్‌ఖలీ వత్తాసు పలికాడు.

1979 చివరకు వచ్చేసరికి దాదాపు 4,500 మంది ఇస్లామేతరులను ఉరి తీశారు. 1980కి వచ్చేసరికి 10 వేల మందిని చంపేశారు. 1988లో ఖొమేని స్వయంగా ఇచ్చిన ఆదేశాలకు లోబడి మరో 4,000 మందిని జైళ్లలో నిర్బంధించారు. ఆ తర్వాత వారందర్నీ ఉరి తీశారు. ఖొమేని జులై 20, 1988న చేసిన ఒక ప్రకటనలో ఇస్లామ్ ఏలుబడిని విస్తరింపజేయడానికి ప్రపంచంలో జియోనిజమ్, కేపిటలిజమ్, కమ్యూనిజమ్ మూలాలను కూకటివేళ్లతో సహా పెకలించివేస్తాం అని అన్నారు. మతోన్మాదం తలకెక్కించుకొని ఆయన ఈ మాట మూడు రోజుల తర్వాత ది న్యూయార్క్ టైమ్స్‌లో ప్రచురితమైంది. ఇరాన్‌లో షరియాను అనుసరించి మహిళా హక్కులను కాలరాచారు. నైతిక పోలీసుల ద్వారా తొమ్మిదేళ్ల వయస్సు నుంచే బాలికలకు హిజాబ్ చట్టాలను వర్తింపజేశారు. మీడియాపై ఆంక్షలు విధించారు. స్వతంత్ర పాత్రికేయమనేది నేరంగా మారిపోయింది. 1979 నుంచి 2009 మధ్య కాలంలో కనీసం 860 మంది జర్నలిస్టులను జైల్లో పెట్టడం లేదా ఉరితీయడం చేశారు. ప్రతీ జైలూ పాలకుల క్రూరత్వానికి ఓ సంకేతంగా మిగిలిపోయింది. మూడు దశాబ్దాల కాలంలో ఇంచుమించు 17 లక్షల మంది జైళ్లలో ఊచలు లెక్కపెట్టారు. అదే సమయంలో ఇరాన్ తన భావజాలాన్ని టెర్రరిజమ్, పరోక్ష యుద్ధం రూపేణా బాహ్య ప్రపంచానికి బట్వాడా చేసింది. దీనికి నాంది పలుకుతున్నట్టుగా 1979లో అమెరికా ఎంబసీని తన గుప్పిట పెట్టుకుంది. 52 మంది అమెరికన్లను 444 రోజుల పాటు నిర్బంధంలో ఉంచింది. ఇరాన్ అండ చూసుకొని హెజ్‌బొల్లా ఉగ్రమూక 1983లో బీరూట్‌లో అమెరికా మెరైన్ బారాక్‌లపై బాంబులతో దాడి చేసింది. 241 మంది అమెరికన్లను పొట్టనపెట్టుకుంది. అదే ఉగ్రమూక 1982 నుంచి 1992 మధ్యకాలంలో లెబనాన్‌లో 25 మంది అమెరికన్లను కిడ్నాప్ చేసింది. వారిలో ఐదుగురిని హత్య చేసింది.

1979లో ఇరాన్‌లో తిరుగుబాటు ఇజ్రాయెల్‌పై దుష్ప్రభావాన్ని చూపింది. ఇరుదేశాల మధ్య దూరం పెరిగింది. ఇజ్రాయెల్ పాస్‌పోర్టులు ఉన్నవారిని పాలస్తీనాలోకి అనుమతించని పరిస్థితి ఏర్పడింది. 1980, 90 దశకాల్లో ఇరాన్ పాలస్తీనాతో పాటుగా హెజ్‌బొల్లా, హౌతీ, హమాస్ వంటి ఉగ్రమూకలకు నిధులు , ఆయుధాలు సమకూర్చడం, వాటితో కలిసి దురాక్రమణలు పాల్పడటంతో ఇజ్రాయెల్ రగిలిపోయింది. కొద్దికాలానికే ఇరుదేశాలూ ఆగర్భశత్రువులుగా మారిపోయాయి. డిసెంబర్, 2000లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేని ఇజ్రాయెల్‌ను కేన్సర్ కణితితో పోల్చారు. ఆ తర్వాత యురేనియం శుద్ధి, అణ్వాయుధాల తయారీపై ఇరాన్ పూర్తిగా దృష్టి పెట్టింది. అది తన అస్తిత్వానికి ముప్పుగా ఇజ్రాయెల్ భావించింది. దాంతో జూన్ 13, తెల్లవారుజామున ఆపరేషన్ రైజింగ్ లయన పేరిట ఇరాన్‌పై వైమానిక దాడులకు దిగింది. ఇరాన్ అదేరోజు సాయంత్రం ఆపరేషన్ ఆనెస్ట్ ప్రామిస్–3 పేరిట ఇజ్రాయెల్‌పై దాడులు చేసింది.

శ్రీ ఆంజనేయ స్మాల్ అగ్రి టూల్స్
కలుపు పరికరాలు, కూరగాయల పంటలు, టెర్రస్ గార్డెన్‌లో వాడే పరికరాలు
1) అయ్యన్న వీడర్ రూ.1200/- 2) అన్నమయ్య వీడర్ రూ. 2000/-
3) ఒంగోలు గీత్త ప్లోయింగ్ వీడర్ రూ. 3000/- 4) రామయ్య వీడర్ రూ. 1500/-

Visit Youtube Link:
• Agriculture Implements at low cost - Rythu Nestham
• Low Cost agriculture machines to farmers - HMTV
Contact Number : 9849140465

# అమెరికా నిర్ణయాల వెనుక కీలకమైన గది



ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కెనడాలో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సు నుంచి జూన్ 17న అర్థంతరంగా స్వదేశానికి తిరుగుముఖం పట్టారు. ఆయన వెళుతూ తన కోసం శ్వేత సౌధంలోని సిచువేషన్ రూమ్ వద్ద వేచి ఉండాలని జాతీయ భద్రతా మండలిని ఆదేశించారు. ట్రంప్ సిచువేషన్ రూమ్‌లో మండలి అధికారులతో సమావేశమైన తర్వాతనే అణు కార్యక్రమాలు పక్కన పెట్టి ఎలాంటి షరతులు లేకుండా లొంగిపోవాలంటూ ఇరాన్ అధినేత ఖమేనీని హెచ్చరించారు. ఈ గది నుంచే ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్‌కు శ్రీకారం చుట్టారు. ఆపరేషన్‌ను ఉపాధ్యక్షుడు వాన్స్‌తో కలిసి ఇక్కడి నుంచే పర్యవేక్షించారు. ఇంతటి కీలకమైన సిచువేషన్ రూమ్‌ను అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ 1961లో ప్రారంభించారు. తొలిసారిగా ఈ గదిని క్యూబాలో ఫిడెల్ కాస్ట్రో ప్రభుత్వాన్ని పడగొట్టడానికి వాడారు.

సెప్టెంబర్ 11, 2001న అమెరికాలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు వాటిపై ఎలా స్పందించాలనే ప్రణాళిక తయారైంది కూడా ఈ గదిలోనే. 2011లో అంతర్జాతీయ ఉగ్రవాది ఒసామాబిన్ లాడెన్‌ను అమెరికా నావికాదళానికి చెందిన ప్రత్యేక బలగాలు పాకిస్తాన్‌లో మట్టు పెట్టాయి. అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈ గదిలో నుంచే లాడెన్‌ను మట్టుపెడుతున్న వైనాన్ని స్వయంగా పర్యవేక్షించారు. 1991లో అప్పటి దేశాధ్యక్షుడు బిల్ క్లింటన్ బోస్నియా విషయమై భద్రతా మండలితో ఇదే గదిలో చర్చించారు. ఇప్పటి అధ్యక్షుడు ట్రంప్‌కు ఈ గదితో ఇంతకుమునుపే పరిచయం ఉంది. తొలిసారిగా అమెరికా అధ్యక్షుడు అయినప్పుడు ఆయన 2020లో ఐసిస్ ఉగ్రవాది అబు బకర్ అల్ బగ్దాదీని అమెరికా దళాలు సిరియాలో అంతం చేసిన ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షించారు. పేరుకు సిచువేషన్ రూమ్ అన్న మాటే గానీ 5,525 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న ఈ గదిలో ఒక సమావేశ మందిరం, నిఘా నిర్వహణా కేంద్రమూ ఉన్నాయి.

## భూగర్భంలో ఇరాన్ అగ్రనేత

ఇరాన్ అగ్రనేత అయతుల్లా అలీ ఖమేని సురక్షితమైన భూగర్భ బంకర్‌లో తలదాచుకున్నారని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఆయన అన్ని రకాల ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్లకు దూరంగా ఉంటున్నారు. ఖమేని హత్యకు కుట్రలు జరుగుతున్నాయనే సమాచారంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన కీలకమైన వారితో వ్యక్తిగతమైన సంభాషణలకే పరిమితమైపోయారు. ఇరాన్ కార్యాచరణపై బంకర్ నుంచే సూచనలు చేస్తున్నారు. తన తదనంతరం అగ్రనేతను ఎంపిక చేసే విషయంలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఇరాన్ సైన్యంలో కీలకమైన పదవుల్లో నియమించాల్సిన కమాండర్ల పేర్లను ఆయన ప్రకటించారు. సాధారణంగా ఇరాన్‌కు అగ్రనేతను నియమించే ప్రక్రియ నెలల పర్యంతం కొనసాగుతుంది.

అయితే పరిస్థితులు ఉద్రిక్తంగా ఉండటంతో తన వారసుడి ఎంపిక కోసమని ముగ్గురిని ఆయన ఎంచుకున్నారు. ఇరాన్‌లోని మతాధికారులు ఆయన ప్రతిపాదించిన పేర్లను పరిశీలించి వారిలో ఒకరిని ఎంపిక చేస్తారు. కానీ ఖమేని ప్రతిపాదించిన జాబితాలో ఆయన కుమారుడు మోజ్తాబా ఖమేని పేరు కూడా ఉన్నట్టు న్యూయార్క్‌టైమ్స్ పేర్కొంది.అయితే అలాంటిదేమీ లేదని ఇరాన్ అధికారులు స్పష్టం చేశారు.



ఖమేని

## అమెరికా నావికాదళంపై దాడి చేస్తాం

అణు కేంద్రాలపై దాడికి ప్రతిగా బహ్రెయిన్‌లో అమెరికా నావికాదళంపై క్షిపణులతో దాడి చేస్తామని ఇరాన్ కీలక నేత అలీ ఖమేని హెచ్చరించారు. హెూర్ముజ్ జలసంధిలోకి అమెరికా, బ్రిటీష్, జర్మనీ,ఫ్రాన్సు దేశాలకు చెందిన నౌకలను అనుమతించేదిలేదని స్పష్టం చేశారు. ఇప్పుడిక మావంతు వచ్చింది. అమెరికా దాడులకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అని హెచ్చరించారు. అమెరికా ఆరంభించిన యుద్ధానికి తాము ముగింపు పలుకుతామని అన్నారు. ఇదే విషయమై ఆ దేశ విదేశాంగ మంత్రిత్వశాఖ విడుదల చేసిన ఒక ప్రకటనలో ఇరాన్ శాంతి అవసరాల కోసం ఏర్పాటు చేసిన అణు కేంద్రాలపై అమెరికా మిలటరీ దారుణంగా వైమానిక దాడులు చేయడాన్ని ఇరాన్ తీవ్రంగా ఖండిస్తోంది. అమెరికా దాడులతో ఐక్యరాజ్యసమితి–ఐరాస చార్టర్‌లో మౌలిక సూత్రాలను, అంతర్జాతీయ చట్టంలో నియమాలను ఉల్లంఘించింది. ఈ ఘోరమైన నేరం యుద్ధపిపాసి, చట్టాలను ఉల్లంఘించే అమెరికా ప్రభుత్వం బాధ్యత వహించాలి అని పేర్కొంది. దీనిపై ఐరాస భద్రతామండలిని అత్యవసరంగా సమావేశపరచాలని కోరింది. అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ–ఐఏఈఏ అణుకేంద్రాలపై అమెరికా దాడులను తీవ్రంగా పరిగణించాలని విజ్ఞప్తి చేసింది.



# ఇరాన్ ఒంటరి పోరాటం

ఇరాన్ మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ దేశాల పలుకుబడికి నిలువునా పాతరేసి యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్ పేరిట లెబనాన్, పాలస్తీనా, యెమెన్, ఇరాక్ దేశాల్లో తనకు తొత్తులైన ఉగ్రమూకలతో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించుకున్న కూటమి ప్రస్తుత కష్టకాలంలో ఆ దేశానికి ఎందుకూ పనికిరాకుండా పోయింది. ఒక విధంగా చెప్పాలంటే ఇజ్రాయెల్, అమెరికా దేశాలతో ఇరాన్ ఒంటరి పోరాటం చేస్తోంది. లెబనాన్‌లో హెజ్‌బొల్లా, పాలస్తీనాలో హమాస్, యెమెన్‌లో హౌతీలు, ఇరాక్‌లో షియా మిలీషియాలు కనీసం మాట సాయం కూడా చేయలేని పరిస్థితిలో ఉన్నాయి. లెబనాన్‌లో షియా పారామిలటరీ గ్రూప్ అయిన హెజ్‌బొల్లా ఇరాన్‌కు ఎంతో నమ్మకంగా ఉండేది. కానీ ఇరాన్ భూభాగం పైకి ఇజ్రాయెల్, అమెరికా దేశాలు వైమానిక దాడులు చేస్తున్నప్పటికీ ఇరాన్‌కు మద్దతుగా హెజ్‌బొల్లా ఎలాంటి చర్యకు దిగలేదు. అదే ఏడాది క్రితం చూస్తే హెజ్‌బొల్లా పరిస్థితి ఎంతో గొప్పగా ఉండేది. 2023 నుంచి ఇజ్రాయెల్ అదేపనిగా చేస్తున్న దాడులతో ఈ ఉగ్రమూక కుదేలైపోయింది. దాని సుదీర్ఘకాలపు నేత హస్సన్ నస్రుల్లా ఇజ్రాయెల్ గురిపెట్టి చేసిన దాడిలో హతమైపోయాడు. దాంతో హెజ్‌బొల్లా చప్పబడిపోయింది.

హమాస్ గాజాలో పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్‌గా ఉంది. ఇజ్రాయెల్, హమాస్ మధ్య దాదాపు రెండేళ్లుగా జరుగుతున్న పోరాటంతో గాజా శిథిలావస్థకు చేరుకుంది. హమాస్ అగ్ర నేతలు ఇస్మాయిల్ హనియే, యహ్యా సిన్వార్ సహా చాలా పెద్ద తలకాయలు రాలిపోయాయి. మిగిలిన ఏకైక నేత ఖలేద్ మషాల్ ఏం చేయాలా అని ఖతార్‌లో తలపట్టుకొని కూర్చొని ఉన్నాడు. ఇజ్రాయెల్ వరుసదాడుల్లో గాజాలో హమాస్ కష్టపడి కట్టుకున్న సొరంగాలు, కమాండ్ సెంటర్లు, రాకెట్ ఫ్యాక్టరీలు నామరూపాల్లేకుండా పోయాయి. ఇక ఇరాక్ విషయానికి వస్తే ఒకప్పుడు అక్కడ షియా మిలీషియాలంటే హడల్. అమెరికా బలగాలను ఓ ఆట ఆడుకునేవారు. ఇరాన్ పలుకుబడిని బాగ్దాద్‌లో బాగా పెంచేవారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇరాన్ గడ్డపైకి ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులతో మిలీషియాలు బాగా దెబ్బతిన్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ

# ఇజ్రాయెల్‌కు అణు ప్రాణం




అణ్వాయుధాలను అభివృద్ధి చేస్తుందనే కారణంతో ఇరాన్‌పై వైమానిక దాడులు చేస్తున్న ఇజ్రాయెల్‌కు డిమోనా పట్టణానికి దగ్గర్లో అణు కార్యక్రమాలకు సంబంధించిన కేంద్రం ఉందని ది న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. ఈ కేంద్రం డిమోనా పట్టణానికి 13 కి.మీ.ల దూరంలో, మృత సముద్రానికి దాదాపు 30 కి.మీ.ల దూరంలోని నెగెవ్ ఎడారిలో ఉంది. అధికారికంగా దాన్ని నెగెవ్ అణు పరిశోధన కేంద్రం అని పిలుస్తారు. ఇజ్రాయెల్ దాన్ని ఒక పరిశోధనా కేంద్రంగా చెప్పుకుంటున్నప్పటికీ అది దేశ అణ్వాయుధ కార్యక్రమాలకు గుండెకాయ లాంటిదనే అభిప్రాయం బలంగా ఏర్పడిపోయింది. ఇజ్రాయెల్ అణు కార్యక్రమానికి సుదీర్ఘమైన, రహస్య చరిత్ర ఉంది. ఇజ్రాయెల్ ఈ కేంద్రానికి 1958లో పునాదిరాయి వేసింది.



డిమోనా కాంప్లెక్స్‌లో అణ్వాయుధాల తయారీలో కీలకమైన ప్లుటోనియంను ఉత్పత్తి చేసే రీప్రాసెసింగ్ ప్లాంట్ ఉందని డిసెంబర్, 1960లో అమెరికా నిఘా వ్యవస్థ ఒక నివేదికలో వెల్లడించింది. 1973నాటికి ఇజ్రాయెల్ అణ్వాయుధాలు తయారు చేస్తున్నదని అమెరికా నిర్ధారించుకున్నది.

అందుకనే ఇజ్రాయెల్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం పెట్టలేదనే మాట ఇరాన్‌లో వినిపిస్తోంది. దీనికి బలం చేకూరుస్తున్నట్టుగా అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ–ఐఏయీఏ డిమోనా కాంప్లెక్స్‌ను ఇప్పటివరకు తనిఖీ చేయలేదు అనేది ఇజ్రాయెల్ ప్రత్యర్థుల వాదన. అదే సమయంలో ఇజ్రాయెల్ దగ్గర కనీసం 90 అణ్వాయుధాలు ఉంటాయని ది స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది.

జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. అయినప్పటికీ ఇరాన్–ఇజ్రాయెల్ –అమెరికా గొడవల్లో తలదూర్చవద్దని మిలీషియా కమాండర్లను ఇరాక్ ప్రధాని మహమ్మద్ అల్ సదానీ హెచ్చరించారు.

యెమెన్‌లో హౌతీలు ఈ ఏడాది మార్చి వరకు మంచి జోరు మీద ఉన్నారు. ఇరాన్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై వైమానిక దాడులు జరిపారు. అమెరికా, ఇజ్రాయెల్ దేశాల పట్ల వ్యతిరేకతను బహిరంగంగా వ్యక్తం చేశారు. అయితే ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో అమెరికా వైమానిక దాడులతో హౌతీల క్షిపణి స్థావరాలపై విరుచుకుపడింది. దీంతో హౌతీలు చేతుల్లో క్షిపణులు లేక చేష్టలుడిగిపోయారు. ఎటు నుంచి ఏదొచ్చి మీద పడుతుందోనని అప్రమత్తంగా ఉంటున్నారు.



# ఇరాన్‌పై ఆపరేషన్ రైజింగ్ లయన్ 200 యుద్ధవిమానాలతో ఇజ్రాయెల్ భీకరదాడి

**జూ**న్ 13, తెల్లవారకముందే ఇరాన్‌లోని అణు కేంద్రాలు, మిలటరీ స్థావరాలపై 200 యుద్ధవిమానాలతో ఇజ్రాయెల్ భీకరమైన దాడి చేసింది. నతాంజ్‌లోని అణు కేంద్రం ధ్వంసమై పోయింది. అక్కడి నుంచి దట్టమైన పొగ గంటలసేపు ఆకాశాన్ని అలముకుంది. ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరిట ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అధినేత మేజర్ జనరల్ హొస్సెయిన్ సలామీ అమరులైనారని ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. ఆయన్ను జియోనిస్టు బలగాలు నేరుగా హత్య చేశాయని ఆరోపించింది. సలామీ ఇరాన్ సైనిక వ్యూహానికి కీలకమైన వ్యక్తిగా వ్యవహరించారు. లెబనాన్, సిరియా, ఇరాక్, యెమెన్ దేశాల్లో ఇరాన్ పరోక్ష యుద్ధానికి సూత్రధారిగా వ్యవహరించారని తెలిపింది. దాడుల్లో మరికొందరు సీనియర్ కమాండర్లు, అణు శాస్త్రవేత్తలు అమరులైనారని వెల్లడించింది. ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైపోయిన నతాంజ్‌లోని అణు కేంద్రం మధ్య ఇరాన్‌లోని ఇస్ఫాహన్ ప్రావిన్సులో ఉన్న ఎడారి ప్రాంతంలోని భూగర్భంలో ఒక లక్ష చదరపు మీటర్ల మేర వ్యాపించి ఉంది. వేలాది అణు శుద్ధి కేంద్రాలకు నతాంజ్ ఆవాసంగా ఉంది. అణ్వాయుధాలపై ఇరాన్ పెట్టుకున్న ఆశలకు, పాశ్చాత్య దేశాలు, ఇజ్రాయెల్ భయాందోళనలకు కేంద్రంగా మారింది. ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసిన చిత్రాల ప్రకారం నతాంజ్ కేంద్రంలో భూమిపైన పైలెట్ ఇంధన శుద్ధి కేంద్రం వద్ద మంటలు కనిపించాయి. భూగర్భంలో ఉన్న ఇంధన శుద్ధి కేంద్రం ఏమేరకు దెబ్బతిన్నదీ తెలియరాలేదు. అయితే భూమిపై చోటు చేసుకున్న విధ్వంసంతో ఇరాన్‌కు అత్యంత కీలకమైన అణు కేంద్రం వద్ద కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నతాంజ్ అణు కేంద్రం ధ్వంసమైన వైనాన్ని అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ–ఐఏఈఏ నిర్ధారించింది.

పేలుళ్ల శబ్దాలు, వైమానిక దాడిని హెచ్చరించే సైరన్ల మోతల మధ్య ఇరాన్ రాజధాని టెహ్రాన్‌వాసులు




జూన్ 13, ఉదయం నిద్ర లేచారు. 78 మంది మరణించారు. టెహ్రాన్‌కు పశ్చిమంగా చిట్‌గర్ జిల్లాలో ఎలాంటి అణుకేంద్రం లేకపోయినప్పటికీ వైమానిక దాడుల కారణంగా దట్టమైన పొగ ఆకాశాన్ని అలముకుంది. దాడులు జరిగిన కొద్ది గంటల్లోనే దేశ గగనతలాన్ని మూసివేస్తున్నట్టు ఇరాన్ పౌరవిమానయాన శాఖ ప్రకటించింది. ఇజ్రాయెల్ సైతం అంతే స్థాయిలో గగనతల లాక్‌డౌన్‌ను ప్రకటించింది. ఇరాన్‌పై ఆపరేషన్ రైజింగ్ లయన్ ఆరంభించినట్టు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు జూన్ 13న ప్రకటించారు. ఇజ్రాయెల్ మనుగడకే ముప్పుగా పరిణమించిన అణు కార్యక్రమాన్ని ఇరాన్ విరమించుకునేంతవరకు ఆ దేశంలోని లక్ష్యాలపై దాడులు చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఇరాన్ గతేడాది ఇజ్రాయెల్‌పై 300 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఒక్కొక్క క్షిపణి వందలాది ప్రజలకు ముప్పు తెచ్చేలా ఒక టన్ను పేలుడు పదార్థాలను మోసుకొచ్చి, జనావాసాలమీదకు జారవిడుస్తుందని తెలిపారు. ఇరాన్ వచ్చే మూడేళ్లలో ఇలాంటి 10వేల క్షిపణులను తయారు చేసుకోవడానికి రంగం సిద్ధం చేసుకుంటోందని ఆరోపించారు. ఇదే విషయమై ఆయన మాట్లాడుతూ "పరిమాణంలో న్యూజెర్సీ అంత ఉన్న మా దేశంపైకి 10 వేల టన్నుల పదార్థం పడితే ఎలా ఉంటుందో ఇప్పుడు ఒక్కసారి ఊహించుకోండి. ఇది ఏమాత్రం సహించలేని ముప్పు. దీన్ని ఆపి తీరాలి" అని అన్నారు.

# అంతర్జాతీయ స్పందన

అమెరికా ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్ పేరిట ఇరాన్‌పై వైమానిక దాడుల చేయడం పట్ల అంతర్జాతీయ సమాజం స్పందించింది.

ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగడం ఆందోళనకు గురి చేసింది. ఈ దాడి అంతర్జాతీయ శాంతి, భద్రతకు పెనుముప్పుగా భావిస్తున్నాం. ఉద్రిక్తతల తగ్గింపునకు ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు కృషి చేయాలి. యూఎన్ చార్టర్, అంతర్జాతీయ చట్ట నియమాల ప్రకారం సభ్యదేశాలు ఉద్రిక్తతలను తగ్గించుకోవాలి. వారి బాధ్యతలను నిలబెట్టుకోవాలని పిలుపునిస్తున్నాను. సైనిక చర్యతో ఉద్రిక్తతలకు పరిష్కారం దొరకదు. దౌత్య మార్గం ఒక్కటే పరిష్కారం చూపిస్తుంది. ఈ వివాదం అదుపు తప్పే ప్రమాదం ఉంది. ప్రపంచం విపత్కర పరిణామాలను చవిచూడాల్సి వస్తుంది **- ఐక్యరాజ్యసమితి**

-------------------------------

ఇరాన్‌పై అమెరికా దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఒక సార్వభౌమ రాజ్యం భూభాగాన్ని క్షిపణి, బాంబు దాడులకు గురిచేయడం ఒక బాధ్యతాయుతమైన నిర్ణయం. అది అంతర్జాతీయ చట్టాన్ని, ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను ఉల్లంఘిస్తుంది. దురాక్రమణకు ముగింపు పలకాలి. పరిస్థితిని రాజకీయ,దౌత్యపరమైన పట్టాల మీదకు తీసుకొనిరావాలి **- రష్యా**

-------------------------------

ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. అమెరికా అంతర్జాతీయ చట్టాలన్నింటినీ ఉల్లంఘించింది. ఐక్యరాజ్యసమితి చార్టర్ ప్రకారం ఇరాన్‌కు తనను తాను రక్షించుకునే హక్కు ఉంది. మధ్యప్రాచ్యంలో ప్రస్తుత పరిస్థితిపై తీవ్రమైన ఆందోళనతో ఉన్నాం. సైనిక చర్యలు వద్దు. శాంతికి దౌత్యమే ఏకైక మార్గం **- పాకిస్తాన్**

-------------------------------

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సభ్యత్వాన్ని కలిగి ఉన్న అమెరికా ఇరాన్ అణు స్థావరాలపై దాడి చేయడం ద్వారా ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టం, అణువ్యాప్తి నిరోధక ఒప్పందాన్ని ఉల్లంఘించింది **-ఇరాన్**

-------------------------------

ఇరాన్‌పై అమెరికా దురాక్రమణ దాడి అత్యంత ప్రమాదకరమైనది. అమెరికా అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడం స్పష్టంగా కనిపిస్తోంది. ఇరాన్ నాయకత్వానికి, అక్కడి ప్రజలకు మా సంఘీభావాన్ని ప్రకటిస్తున్నాము. ఇరాన్ తన సార్వభౌమత్వాన్ని కాపాడుకునే సామర్థ్యంపైన మాకు పూర్తి నమ్మకం ఉంది **- హమాస్**

-------------------------------

ఇరాన్ అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులను,

ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడాను. ప్రస్తుత పరిస్థితిపై వివరంగా చర్చించాము. సైనిక చర్యపై తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేశాను. ఉద్రిక్తతలను తగ్గించుకొని శాంతిని నెలకొల్పాలని పిలుపునిచ్చాను. ప్రాంతీయ శాంతి, భద్రత, సుస్థిరతను త్వరగా పునరుద్ధరించాలి **– మోదీ**



## అమెరికా

ఇరాన్‌తో అణు కార్యక్రమాన్ని విరమింప జేయడానికి ఇజ్రాయెల్ జూన్ 13న ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరిట వైమానిక దాడులను ఆరంభించింది. అణు కేంద్రాలు లక్ష్యంగా దాడులు చేసింది. ఇందుకు ప్రతిగా ఇరాన్ ఇజ్రాయెల్‌లో జనావాసాలపైకి దాడులకు దిగింది. ఇరుపక్షాలు హోరాహోరీగా పరస్పర దాడులు చేసుకోవడంతో మధ్యప్రాచ్యం రణరంగాన్ని తలపించింది. అయితే నంటాజ్, ఫోర్డో అణు కేంద్రాలు ఇరాన్‌కు పెట్టని కోటలాంటివి. ఇవి ఎత్తయిన పర్వతాల దిగువన, లోతైన సొరంగాల్లో ఉన్నాయి. ఫోర్డో అణు కేంద్రంలో యురేనియం శుద్ధి 60 శాతానికి చేరుకుంది. అది 90 శాతం దాటితే అణ్వస్త్రాలను తయారుచేసుకునే సామర్థ్యం ఇరాన్ సొంతమవుతుంది. కాగా 2023లో అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ పరిశీలనల్లో నంటాజ్ కేంద్రంలో యురేనియం శుద్ధి 83.7 శాతానికి చేరిందని తేలింది.



దీంతో అప్రమత్తమైన ఇజ్రాయెల్ దాడులకు దిగింది. ఆ దాడుల్లో ఫోర్డో కేంద్రంలో కేవలం 1,500 సెంట్రిక్ ఫ్యూజ్‌లు మాత్రమే దెబ్బతిన్నాయి. అక్కడ మొత్తం 3,000 సెంట్రిక్ ఫ్యూజ్‌లు ఉన్నట్టు సమాచారం.

దాడుల్లో పెద్ద నష్టమేమీ జరగలేదు. చివరకు విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోలేదు. ఈ శత్రు దుర్భేద్యమైన అణు కేంద్రాలను ధ్వంసం చేయగల శక్తియుక్తులు అమెరికా దగ్గర మాత్రమే ఉన్నాయి. అమెరికా అమ్ములపొదిలోని జీబీయూ–57 బంకర్–బస్టర్ బాంబులు భూగర్భంలోని అణుకేంద్రాలను నామరూపాల్లేకుండా చేయగలవు. ఈ బాంబులు 20 అడుగుల పొడవు, 13 వేల కిలోల బరువు ఉంటాయి. వాటిని ప్రయోగించడానికి అవసరమైన బీ–2 స్పిరిట్ బాంబర్లు అమెరికా దగ్గర మాత్రమే ఉన్నాయి. అయితే ఇరాన్ అణ్వాయుధాలు తయారుచేసుకోవడానికి కనీసం మూడేళ్లయినా పడుతుందని అమెరికా భావించింది. అందుకనే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పోరాటం కొనసాగుతుండగానే, ఇప్పటికైనా మించిపోయింది లేదు మాతో వచ్చి అణు ఒప్పందం కోసమని చర్చలు జరుపు

ఇరాన్‌లో జరుగుతున్న పరిణామాలను చాలా ఆందోళనతో గమనిస్తున్నాము. సంక్షోభానికి రాజకీయ పరిష్కారాన్ని కనుక్కోవాలి **- సౌదీ అరేబియా**

---

ఇరాన్ అణు కేంద్రాలపై దాడి చేయడంతో అమెరికా తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ప్రమాదకరమైన ఉద్రిక్తతలు ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో విపత్కర పరిణామాలకు దారి తీయవచ్చు. వివేకంతో సంయమనాన్ని పాటించడం ద్వారా అన్ని పక్షాలు ఉద్రిక్తతలను నివారించాలి **- ఖతార్**

---

ఇరాన్‌పై అమెరికా దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. అనంతరం నెలకొన్న ఉద్రిక్తతలపైన ఆందోళన చెందుతున్నాం **- ఒమన్**

---

ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులతో మధ్యప్రాచ్యంలో శాంతి, సుస్థిరతలకు, భద్రతకు ముప్పు ఏర్పడుతుంది. **- ఇరాక్**

---

ఇరాన్ అణు కార్యక్రమం అంతర్జాతీయ భద్రతకు పెను ముప్పు. ఇరాన్ అణ్వాయుధాన్ని అభివృద్ధి చేయడానికి మేం ఎప్పటికీ అనుమతించము. ఈ ముప్పును నివారించడానికే అమెరికా వైమానిక దాడులకు పాల్పడింది **- ఇంగ్లండ్**

---

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు నివారించడానికి ఇరుపక్షాలు చర్చలకు రావాలి

**- ఐరోపా యూనియన్**

---

ఇరాన్ దౌత్యపరమైన పరిష్కారం కోసం అమెరికాతో వెంటనే అణు ఒప్పందంపై చర్చలు జరపాలి **- జర్మనీ**

---

అన్ని పక్షాలు సంయమనం పాటించాలి. వెంటనే దౌత్య చర్చలు చేపట్టాలి **- స్విట్జర్లాండ్**

---



# ఎందుకు ప్రవేశించింది?

అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు సూచించారు. అణు ఒప్పందం కుదుర్చుకో వాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే ఇజ్రాయెల్ దాడులు ఆపితేనే చర్చలకు వస్తానని ఇరాన్ బదులిచ్చింది.

ఈలోగా ఇజ్రాయెల్ దగ్గర ఆయుధాలు నిండు కుంటున్నాయనే వార్త దావాలనం వ్యాపించింది. ఇజ్రాయెల్ గగన రక్షణ వ్యవస్థకు అవసరమైన క్షిపణులు, మందుగుండు సామాగ్రి 10 రోజులకు సరిపడ మాత్రమే ఉన్నాయనే సమాచారం గుప్పుమంది. ఇరాన్ క్షిపణి దాడుల్లో టెల్ అవివ్, జెరూసలెమ్‌లో ఉన్న అమెరికా దౌత్యకార్యాలయాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఏ క్షణంలోనైనా అమెరికా ఇరాన్‌పైకి దాడి చేయవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. దీనికి ఊతమిస్తున్నట్టుగా కెనడాలో జీ-7 శిఖరాగ్ర సదస్సుకు హాజరైన ట్రంప్ అర్ధంతరంగా సదస్సును ముగించుకొని అమెరికా దారిపట్టారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ, శాంతి ఒప్పందం కోసం తాను వెనుదిరగ లేదని సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

అయితే ఇరుదేశాల మధ్య శాంతి ఒప్పందాన్ని కుదుర్చడానికే ట్రంప్ అర్థంతరంగా బయలుదేరారని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. శాంతి ఒప్పందం కోసం తాను చూడటంలేదని, శాశ్వతమైన ముగింపు కోసం చూస్తున్నానని అన్నారు. అసలు ఇరాన్ దగ్గర ఎప్పటికీ అణ్వస్త్రాలు ఉండరాదని స్పష్టం చేశారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని స్వయంగా విజ్ఞప్తి చేశారు. స్వదేశానికి చేరుకోగానే జాతీయ భద్రతా మండలి అధికారులతో సమావేశమయ్యారు. ఇరాన్ సైనిక, అణు కార్యక్రమాలకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో చేరాలా? వద్దా? అని అమెరికా అధ్యక్షుడు రెండు వారాల్లో నిర్ణయిస్తారని వైట్ హౌస్ ప్రకటించింది.

అయితే అమెరికా అధ్యక్షుడు అవునన్నా, కాదన్నా ఇరాన్‌పై దాడులు ఆపేదిలేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు. అమెరికా రెండు వారాల గడువు ఇరాన్‌ను గందరగోళంలో పడేసింది. అయితే ట్రంప్ మాటలకు, చేతలకు పొంతన లేకుండా ఉన్నది. ఈ రెండు వారాల గడువు అనే పదాన్ని ఆయన అధ్యక్షుడిగా మొదటిసారి ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి పదేపదే ప్రస్తావిస్తూ వస్తున్నారు. అలాగే గత రెండు నెలల్లో డజనుసార్లు రెండు వారాల్లో చర్యలు తీసుకుంటాననే మాట చెప్తూ వచ్చారు. 2017లో పన్ను సవరణ ప్రణాళికల సమయంలో రెండు వారాల గడువు అని చెప్పారు. టారిఫ్ రేట్లను నిర్ణయించడానికి రెండు వారాల సమయం, ఆరోగ్య సంరక్షణ, మౌలికసదుపాయాలపై రాబోయే చర్యల కాలపరిమితి విషయంలో రెండు వారాలు, ఔషధ కంపెనీలపై సుంకాలు విధించడానికి రెండువారాలు, ఉక్రెయిన్‌కు నిరంతర సహాయంపై నిర్ణయం తీసుకోవడానికి రెండువారాలు, పుతిన్‌ను కలిసి యుద్ధాన్ని ముగించడానికి రెండు వారాలు, చైనాతో వాణిజ్య ఒప్పందానికి రెండు వారాల సమయం, కెనడాతో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయడానికి రెండు వారాలు, ఇరాన్‌పై దాడి చేయాలా వద్దా అని నిర్ణయించుకోవడానికి రెండు వారాలు, ఇలా అనేక సందర్భాల్లో ఆయన రెండువారాల గడువును ప్రస్తావించారు. అయితే ఇజ్రాయెల్ దగ్గర ఆయుధాలు తరిగిపోతున్నాయన్న వార్తలు, ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ చేసిన దాడులు పెద్ద ప్రభావం చూపక పోవడంతో రెండు వారాలు అన్న మాటను అటకెక్కించారు. రెండు రోజుల్లోనే రంగంలోకి దిగారు. మధ్యప్రాచ్యంలో అతి పెద్ద యుద్ధ వాతావరణానికి ట్రంప్ తెరదీశారు.

**- జాగృతి డెస్క్**

**ప్రభుత్వం అంటే అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగించాల్సిన వ్యవస్థ. వ్యాపారాలు, లాభాపేక్ష వంటివి ప్రభుత్వ పాలనలో అస్సలు కనిపించకూడదు. ప్రజాస్వామ్యంలో ఇది ప్రాథమిక నియమం. కానీ, ఇప్పుడు కాలం మారింది. ప్రభుత్వాలను నడిపిస్తోన్న రాజకీయ పార్టీలు సొంత ఎజెండాలు, సొంత నిర్ణయాలు, సొంత వ్యూహాలతో ముందుకెళ్తున్నారు. తమకు నచ్చిన తీరులో సాగుతున్నారు. ఫలితంగా ప్రజలు సందిగ్ధంలో పడిపోతున్నారు. అసలు భవిష్యత్తుకు భరోసా ఎలా? అన్న మీమాంసలో పడిపోతున్నారు. వాస్తవ పరిస్థితులు కూడా ఈ అంచనాలకు తగ్గట్లే ఉంటున్నాయి.**




# 'వాణిజ్య' ప్రభుత్వాలు

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత మొదటి రెండు పర్యాయాలు ప్రభుత్వాన్ని నడిపించిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గానీ, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గానీ రాష్ట్ర ప్రయోజనాలను అస్సలు లెక్క చేయడం లేదన్న సంకేతాలు ఎక్కడ చూసినా, ఏ వ్యవహారాన్ని గమనించినా అర్థమవుతోంది. ఇటు.. ఖాళీ ఖజానా... అటు చూస్తే..రూ. వేల కోట్ల విలువైన పథకాలకు సంబంధించిన హామీలు..వచ్చిన ఆదాయం వచ్చినట్లు ఊడ్చుకుపోతున్న పరిస్థితులు... రేపటి గురించి ఆలోచనే లేని పాలనా పద్ధతులు.. వెరసి ప్రజల భవిష్యత్తును అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్తును గాలిలో దీపంలా మార్చేస్తున్నారు. ఓవైపు.. పాలకులే.. రాష్ట్రం దివాళా తీసిందంటారు. విపక్షాలకు ఉచ్చు బిగించే ప్రయత్నాలు చేస్తారు. కానీ, ఆ ప్రయత్నాలు బెడిసికొట్టినా తమ దారిలో తాము జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తుంటారు.

ఇటీవలి పరిణామాలనే విశ్లేషిస్తే.. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి, అవుతున్న ఖర్చులకు, ఇప్పటికే ఉన్న అప్పులకు వడ్డీలు చెల్లించడానికి ఎక్కడా పొంతన కుదరడం లేదు. అయినప్పటికీ సర్కారు పెద్దలు కొత్త కొత్త పథకాలు ప్రకటిస్తున్నారు. వందలు, వేల కోట్ల రూపాయలు వెచ్చించాల్సిన పథకాలకు రూపకల్పన చేస్తున్నారు. ప్రకటిస్తున్నారు. ఘనంగా శంకుస్థాపనలు చేస్తున్నారు. ఇప్పటికే అమలులో ఉన్న పథకాలు సరేసరి.. దీంతో, ప్రభుత్వం ఉక్కిరి బిక్కిరి అవుతోంది. ఆదాయానికి ఉన్న మార్గాలేంటి? ఖజానాకు రాబడి ఎలా పుట్టించాలి? అన్న ఆలోచనలో ప్రభుత్వ యంత్రాంగం నిండా మునిగిపోతోంది. ఎక్కడ ప్రభుత్వ భూములు ఉంటే అక్కడ అమ్మేస్తోంది.

ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో ఆదాయం ఎలా ఉందో, ఖజానా పరిస్థితి ఏంటో చూస్తే.. తీవ్ర ఆవేదనగా ఉందంటున్నారు విశ్లేషకులు. రోజు రోజుకూ ఆర్థిక ఇబ్బందులు రాష్ట్రాన్ని చుట్టుముడుతున్నాయని, నాన్ టాక్స్ రెవెన్యూ ఏ మాత్రం ఆశాజనకంగా లేదని అంటున్నారు. లాభాల్లో ఉన్న ఖజానా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన నుంచే నష్టాల ఊబిలో కూరుకుపోయింది. ఆర్థిక వ్యవస్థ పూర్తిగా గాడితప్పింది. వచ్చే ఆదాయం, పోయే ఖర్చుకు ఎక్కడా పొంతన కుదరడం లేదు. ఆర్థిక ఇబ్బందులు రోజురోజుకూ తీవ్రంగా పెరిగిపోతున్నాయి. నాన్–ట్యాక్స్ రెవెన్యూ రాబడులను పెంచడంలో అధికార యంత్రాంగం దారుణంగా విఫలమవుతున్నదన్న చర్చ నడుస్తోంది. ఫలితంగా బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం సొంత రాబడులను తీసుకుంటే.. గ్రోత్ 2.2 శాతం మాత్రమే ఉంది. రెవెన్యూ ఆదాయం 2.5 శాతం, మొత్తం ఆదాయం 5.8 శాతం దగ్గరే నిలిచిపోయింది. తెలంగాణ సెక్రెటేరియట్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ క్యాపిటల్ సబ్‌కమిటీ ప్రదర్శించిన తెలంగాణ ఆదాయ గణాంకాల నివేదికలు ఈ వాస్తవాలను బయటపెట్టాయి. దీంతో, నాన్‌టాక్స్ ఇన్‌కమ్‌పై అధికారులు ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రం ఆర్థికంగా బలోపేతం కావాలంటే నాన్–ట్యాక్స్ రెవెన్యూ, కేంద్ర నిధుల సమీకరణ చాలా కీలకం. రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరుల ద్వారా సేకరించే ఆదాయం ప్రధానం. వస్తుసేవల పన్నులో రాష్ట్ర వాటా, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఆస్తి పన్ను, వాహనాల పన్ను, ఎక్సైజ్ డ్యూటీ. నాన్–ట్యాక్స్ రెవెన్యూ అంటే,, లైసెన్స్ ఫీజులు, పరీక్ష ఫీజులు, నీటిపారుదల ఫీజులు వంటి గవర్నమెంట్ సర్వీసుల ద్వారా వచ్చే ఫీజులు. ఈ రాబడులు రాష్ట్ర ఆర్థిక అవసరాలను తీర్చడానికి, అభివృద్ధి ప్రాజెక్టులు, పరిపాలనా ఖర్చులను భరించడానికి ఉపయోగపడతాయి. కానీ, సొంత రాబడిలో ప్రభుత్వం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందంటున్నారు. మొత్తం రెవెన్యూ రశీదుల వృద్ధి కూడా 2024–25లో 5.8 శాతానికే పరిమితమైంది. ఈ గణాంకాలు రాష్ట్ర ఆర్థిక స్థితిపై ఆందోళన రేకెత్తిస్తున్నాయి.

ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయి. బడ్జెట్ గణాంకాలను బట్టి కొన్ని శాఖలకు అధిక నిధులు కేటాయిస్తుండగా, మరికొన్ని శాఖలు నిధుల కొరతతో అల్లాడుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే సూచనలు కనిపించడం లేదు. నిధుల కొరతతో పలు శాఖలు అల్లాడుతున్నాయి. నిధుల లేమి, బడ్జెట్ కేటాయింపుల్లో అసమతౌల్యం, మొత్తంగా తెలంగాణ ఆర్థిక వ్యవస్థ గందరగోళం పరిస్థితిని తలపిస్తున్నట్టు ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా బడ్జెట్ ఖర్చు చేయాలని, ఖర్చులను రేషనలైజ్ చేయాలని సర్కారు సూచించినప్పటికీ, అమలవుతున్న దాఖలాలు కనిపించడం లేదని చెప్తున్నారు.

ఆర్థికంగా రాష్ట్రం తీవ్ర ఒడుదొడుకుల్లో ఉండగా.. ఇప్పటికీ ఇంకా అక్కడక్కడా మిగిలి ఉన్న ప్రభుత్వ భూములను అమ్ముతోంది సర్కారు. అలా భారీగా ఆదాయం సమకూర్చుకుంటోంది. కోట్లలో సమకూరుతున్న ఈ భూములమ్మిన డబ్బులు ఖజానాకు మళ్లిస్తూ.. ఖర్చులను తీర్చుకుంటోంది. పైగా.. రియల్ ఎస్టేట్ సంస్థల మాదిరిగా.. వేలం పాటలో భూములకు భారీగా ధర పలికిందని, ఖజానాకు పెద్ద మొత్తంలో డబ్బులు సమకూరాయంటూ సాక్షాత్తూ ప్రభుత్వమే గొప్పగా ప్రకటించుకుంటోంది.



ఈ పరిణామాలు సర్కారు దుస్థితికి అద్దం పడుతున్నాయి.

ప్రధానంగా హైదరాబాద్ చుట్టు పక్కల ఉన్న ప్రభుత్వ భూముల అమ్మకం.. ఉమ్మడి రాష్ట్రంలోనే ఒక రెండు దశాబ్దాల నుంచి మొదలయ్యింది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా దీన్ని ఆపడం కాకుండా.. కొనసాగిస్తున్నాయి. ఒక రకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలంటూ స్థాయికి మించిన పథకాలను రూపొందిస్తూ.. ప్రకటిస్తూ.. అమలు చేస్తూ, ప్రజలను ఒకరకంగా సోమరిపోతుల్లా మార్చేస్తున్నాయి. జనం కూడా ఏ పథకం వచ్చినా లబ్ది పొందేందుకు పోటీ పడుతున్నారు. ప్రభుత్వం కూడా కొంత కాలంగా తన భూములను అమ్ముతోంది. వేలం పాటలో ప్రైవేటు వ్యక్తుల పరం చేస్తోంది. ఇటీవలే కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన భూముల వేలంలో.. గజం స్థలానికి రూ. 2.98 లక్షలు ధర పలికింది.

తాజాగా గచ్చిబౌలిలో కూడా భూముల వేలం పాట నిర్వహించింది. గచ్చిబౌలిలో 4 ప్లాట్లను అమ్మకానికి పెట్టగా, వేలంలో అన్నీ అమ్ముడయ్యాయి. అలాగే, చింతల్‌లో 10 ప్లాట్లను అమ్మకానికి పెడితే 3 ప్లాట్లను ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేశారు. చింతల్‌లో హౌసింగ్ బోర్డు అధికారులు గజం ధరను రూ. 80 వేలుగా నిర్ణయించగా వేలంలో అత్యధికంగా రూ. 1.14 లక్షలు పలికింది.

ఇక నిజాంపేటలోని అపార్ట్‌మెంట్లలో 413.43 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఉన్న 8 ఫ్లాట్లను వేలం వేశారు హౌజింగ్ బోర్డు అధికారులు. వీటిలో ప్రైవేటు వ్యక్తులు 4 ఫ్లాట్లను కొనుగోలు చేశారు. నిజాంపేటలో ఒక్కో ఫ్లాట్ ధరను హౌసింగ్ బోర్డు అధికారులు రూ. 16.55 లక్షలుగా నిర్ణయించారు. అయితే, అత్యధికంగా ఒక ఫ్లాట్‌కు రూ. 18.21 లక్షలు పలికింది. చింతల్‌లో 10 ఖాళీ స్థలాలకు గాను కేవలం 3 స్థలాలే అమ్ముడు పోయాయి. ప్లాట్లు, ఫ్లాట్ల వేలం ద్వారా ఒకేరోజు మొత్తం రూ. 65,01,91,176 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో గచ్చిబౌలిలో 3271 గజాలు, చింతల్‌లో 799 గజాలు, నిజాంపేటలో 4 ఫ్లాట్లు అమ్మకాలు చేసినట్లు అధికారులు వివరించారు. గచ్చిబౌలిలో గజానికి సగటు ధర రూ. 1.63 లక్షలు, చింతల్‌లో గజానికి రూ. 1.01 లక్షలు వచ్చిందని తెలిపారు. మొత్తం 22 ఆస్తులను వేలం వేయగా.. 11 ఆస్తులు అమ్ముడు పోయాయి.

ప్రభుత్వాలు ప్రకటిస్తున్న పథకాలు అమలు చేయాలంటే కొన్నేళ్లుగా భూముల అమ్మకాలు ప్రధాన ఆదాయ వనరుగా మారిపోయాయి. ఈ తంతు ఇలాగే కొనసాగితే.. కొన్నాళ్లకు భూతద్దం పెట్టి వెతికినా ప్రభుత్వ భూమి అనేది కనిపించకుండ పోయే ప్రమాదం పొంచి ఉందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

**సుజాత గోపగోని**

**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**




## డాక్టర్‌జీని గుర్తుకు తెచ్చే వ్యక్తిత్వం..

**మచిలీపట్నం:** సంఘమే శ్వాసగా జీవించిన చినముత్తేవి సూర్యప్రకాశరావు సంస్మరణసభ జూన్ 18న మచిలీపట్నంలోని వేమూరి వెంకటసుబ్బయ్య కల్యాణ మండపంలో జరిగింది. ఆయన 83 ఏళ్ల జీవితకాలంలో అరవై ఏళ్లకు పైగా స్వయంసేవక్‌గా సేవలు అందించారు. కృష్ణాజిల్లా వ్యవస్థాప్రముఖ్‌గా, విశ్వ హిందూపరిషత్ జిల్లా కార్యదర్శిగా, అనిబిసెంట్ శిశు విద్యామందిర్ పాఠశాల కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

పూజ్య డాక్టర్‌జీ, గురూజీలను స్వయంగా చూడలేని మనలాంటి వారం సూర్యప్రకాశరావు వంటి మహోన్నతులలో వారిని దర్శించగలిగామని పలువురు నివాళులు అర్పించారు.

నగర సంఘచాలక్ డాక్టర్ చిట్టా శ్రీహరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆరోగ్యభారతి అఖిల భారత సహ సంయోజక్ డాక్టర్ ఆర్ మురళీకృష్ణ, విశ్వ హిందుపరిషత్ ఆంధ్రప్రదేశ్ కార్యవర్గసభ్యులు నాయుడు, విజయవాడ విభాగ్ ప్రచారక్ నవీన్, 'ముడా' చైర్మన్ మట్టాప్రసాద్, సంఘకార్యకర్తలు హాజరై సూర్యప్రకాశరావుకు శ్రద్ధాంజలి ఘటించారు.

**యావత్ ప్రపంచాన్ని యోగా ఏకం చేయడం శుభసూచకమని, తనకు ఎంతో సంతోషంగా ఉందని ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జూన్ 21న జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. భారత్‌తో పాటు, యావత్ ప్రపంచ ప్రజలందరికీ అంతర్జాతీయ యోగాదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.**



యోగా 'ఐక్యత' సారమని, అది యావత్ ప్రపంచాన్ని ఇలా ఏకం చేయడం సంతోషంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. గత దశాబ్దకాల యోగా ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ, ఐక్యరాజ్యసమితిలో అంతర్జాతీయ యోగా దినోత్సవ ఆలోచనను భారత్ ప్రతిపాదించిన క్షణాన్ని గుర్తు చేసుకున్నారు. 175 దేశాలు ఈ ప్రతిపాదనకు మద్దతు ఇచ్చాయని, ఇది యావత్ ప్రపంచ ఐక్యతకు అరుదైన సందర్భమని అభివర్ణించారు. ఈ మద్దతు కేవలం ఒక ప్రతిపాదన మాత్రమే కాదని, మానవాళికి మేలు చేసేందుకు ప్రపంచం చేసిన సమష్టి ప్రయత్నాన్ని ఇది సూచిస్తుందన్నారు. "పదకొండు సంవత్సరాల తరువాత, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవనశైలిలో యోగా అంతర్భాగంగా మారింది" అని ఆయన చెప్పారు. దివ్యాంగులు బ్రెయిలీలో యోగా గ్రంథాలను చదవడం, శాస్త్రవేత్తలు అంతరిక్షంలో యోగా సాధన చేయడం గర్వంగా ఉందన్నారు. యోగా ఒలింపియాడ్స్‌లో గ్రామీణ ప్రాంతాల యువత ఉత్సాహంగా పాల్గొనడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. సిడ్నీ ఒపెరా హౌస్ మెట్ల మీదైనా, ఎవరెస్ట్ శిఖరం దగ్గరైనా, విశాలమైన సముద్రపు తీరంలోనైనా, "హద్దులు.. నేపథ్యాలు.. వయస్సు.. సామర్థ్యాలకు అతీతంగా యోగా అందరిదీ" అనే సందేశంలో మార్పు ఉండదని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు.

ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవ ఇతివృత్తమైన "యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్" గురించి ప్రస్తావిస్తూ... ఈ ఇతివృత్తం.. భూమిపై ఉన్న ప్రతి జీవి ఆరోగ్యం పరస్పరం అనుసంధానమై ఉందనే లోతైన సత్యాన్ని ప్రతిబింబిస్తుందని వ్యాఖ్యానించారు. మానవ శ్రేయస్సు.. మనకు అన్నం పెట్టే నేల ఆరోగ్యం, మనకు నీటిని అందించే నదులు, మన పర్యావరణ వ్యవస్థను పంచుకునే జంతువులు, మనల్ని పోషించే మొక్కల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. యోగా మనకు ఈ పరస్పర అనుసంధానాన్ని తెలియజెప్పి, ప్రపంచంతో ఏకమయ్యే దిశగా మార్గనిర్దేశం చేస్తుందని నరేంద్ర మోడీ వివరించారు.

**యోగా విజయవంతంపై సంతృప్తి**

విశాఖపట్నంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ప్రధానమంత్రి.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలను ప్రశంసించారు. కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు అభినందనలు తెలిపారు. వారిద్దరి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ యోగాంధ్ర అభియాన్ పేరుతో ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమ విజయం కోసం మంత్రి నారా లోకేశ్ కృషిని ప్రధాని ప్రత్యేకంగా అభినందిస్తూ, యోగాను నిజమైన సామాజిక వేడుకగా, సమాజంలోని అన్ని వర్గాలను కలిపే వేదికగా చూపడంలో లోకేశ్ విజయవంతం అయ్యారని పేర్కొన్నారు. 'యోగాంధ్ర అభియాన్‌లో రెండు కోట్లకు పైగా ప్రజలు భాగస్వాములయ్యారు. ఇది ప్రజల భాగస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తోంది. ఈ స్ఫూర్తి వికసిత్ భారత్ సాధనకు పునాదిగా నిలుస్తుంది. పౌరులు స్వయంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాని సాధన కోసం చురుగ్గా కృషి చేసినప్పుడు.. చేరుకోలేని లక్ష్యం ఏదీ ఉండదు'అని వ్యాఖ్యానించారు.

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో పెరుగుతున్న ఒత్తిడి, అశాంతి, అస్థిరత నివారణకు, శాంతి స్థాపనకు యోగా మార్గాన్ని సుగమం చేస్తుందని అన్నారు. "మానవాళి గాలి పీల్చుకోవడానికీ, జీవితాన్ని సమతుల్యం చేసుకోవడం ద్వారా తిరిగి పరిపూర్ణులుగా మారేందుకు అవసరమైన పాజ్ బటన్ వంటిదే యోగా అని పేర్కొన్నారు. ఈ యోగా దినోత్సవం ప్రపంచానికి అంతఃశాంతిని ప్రసాదించే మానవత 2.0 ప్రారంభాన్ని సూచించేలా మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎయిమ్స్ వంటి

# ప్రపంచ

సంస్థలు యోగా శాస్త్రీయ పరిశోధనల ద్వారా గుండె, నాడీ, మానసిక ఆరోగ్య సమస్యలకు చికిత్సలో దాని ప్రభావాన్ని నిరూపిస్తున్నాయని, జాతీయ ఆయుష్ మిషన్, డిజిటల్ పోర్టల్స్ ద్వారా యోగా ప్రజా ఉద్యమంగా మారుతోందని చెప్పారు. స్థూలకాయం వంటి సమస్యలను అధిగమించేందుకు నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించాలని, యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవాలని ప్రజలను కోరారు. "హీల్ ఇన్ ఇండియా" కార్యక్రమం ద్వారా భారత్ వైద్య గమ్యస్థానంగా ఆవిర్భవిస్తున్నదని, యోగా ఇందులో కీలకపాత్ర పోషిస్తున్నదని పేర్కొన్నారు. యోగా ప్రామాణీకరణ కోసం సాధారణ ప్రోటోకాల్, 6.5 లక్షల వాలంటీర్ల శిక్షణ, వైద్య కళాశాలల్లో యోగా మాడ్యూల్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో యోగా ఉపాధ్యాయుల నియామకం, ఇ-ఆయుష్ వీసాలతో ప్రపంచానికి ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తున్నామని తెలిపారు.

యోగాను ఒక 'జన ఆందోళన్'..అంటే ఒక ప్రజా ఉద్యమంగా మార్చాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. ప్రపంచాన్ని శాంతి, ఆరోగ్యం, సామరస్యం వైపు నడిపించే ఉద్యమం అవసరమన్నారు. జీవితంలో సమతుల్యతను తీసుకురావడానికి ప్రతి వ్యక్తి యోగాతో తమ రోజును ప్రారంభించాలనీ, ఒత్తిడి లేని జీవితం కోసం ప్రతి సమాజం యోగాను స్వీకరించాలని సూచించారు. "యోగా మానవాళిని ఏకం చేసే



# ఐక్యతా సారం 'యోగా'

మాధ్యమంగా పనిచేయాలి.. యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్ నినాదం ప్రపంచ సంకల్పంగా మారాలి" అని ప్రధానమంత్రి ఆకాంక్షించారు.

**ప్రజాప్రతినిధుల ఉత్సాహం**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు ప్రతాప్‌రావు జాదవ్, రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, భరత్‌జీ వేదికపై ఆశీనులయ్యారు. రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, డోలా బాల వీరాంజనేయస్వామి, బీసీ జనార్దన్ రెడ్డి, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కిందన రెండో కంపార్ట్‌మెంట్‌లో ఆసనాలు వేశారు. విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు తమ నియోజకవర్గాల ప్రజలతో కలిసి కేటాయించిన కంపార్ట్‌మెంట్లలో ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ చేతుల మీదుగా పోస్టల్ స్టాంపు విడుదల చేశారు.

**గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు**

విశాఖ నగరంలో నిర్వహించిన రెండు కార్యక్రమాలకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకూ 30.16 కిలోమీటర్ల మేర 3,03,654 మందితో చేపట్టిన యోగా ప్రదర్శన గిన్నిస్ రికార్డును సొంతం చేసుకుంది. 2023లో గుజరాత్‌లోని సూరత్‌లో 1.47 లక్షల మందితో యోగా నిర్వహించడమే ఇప్పటి వరకూ రికార్డుగా ఉంది. ఇప్పుడు దాన్ని అధిగమించి సరికొత్త రికార్డును సృష్టించినట్టయింది. అలాగే ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 22,122 మంది గిరిజన విద్యార్థులు 108 నిమిషాల్లో 108 సార్లు సూర్యనమస్కారాలు చేశారు. ఈ కార్యక్రమానికి కూడా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ చోటు దక్కింది. ఈ రెండు రికార్డులకు సంబంధించిన పత్రాలను గిన్నిస్ బుక్ ప్రతినిధులు ఆర్కే బీచ్‌రోడ్డులోని యోగా ప్రధాన వేదిక వద్ద అందజేశారు.

**ఘనంగా యోగా కార్యక్రమం**

రాష్ట్ర వ్యాప్తంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వైభవంగా జరిగింది. పెద్దల నుంచి పిన్నల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని 'యోగాంధ్ర'కు వన్నె తెచ్చారు. రాష్ట్రంలోని హైకోర్టు నుంచి పాఠశాలల వరకు, అసెంబ్లీ నుంచి ప్రభుత్వ కార్యాలయాల వరకు 'యోగా ముద్ర'ను సంతరించుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 61,266 ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు దాదాపు 60 లక్షల మంది యోగాసనాలు వేసి రికార్డును నెలకొల్పడంలో భాగమయ్యారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైకోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగాసనాలు వేశారు. హైకోర్టు యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 200 మందికి పైగా ఎస్పీఎఫ్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

విజయనగరంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, జస్టిస్ ఏవీ శేషసాయి పాల్గొన్నారు. జిల్లా న్యాయాధికారి బబిత, ఇతర న్యాయాధికారులు, న్యాయవాదులతో కలిసి యోగాసనాలు వేశారు.

విజయవాడ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో 5 వేల మంది పాల్గొన్నారు. గుంటూరు జిల్లాలో 5125 ప్రాంతాల్లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పది లక్షల మందికి పైగా పాల్గొన్నారు. గుంటూరు జిల్లా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగులు ఆసనాలు వేశారు. అమరావతి సచివాలయ ప్రాంగణంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు యోగాసనాలు వేశారు. శాసనసభ ప్రాంగణంలో సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర ఆధ్వర్యంలో ఉద్యోగులు పలు రకాల ఆసనాలు వేశారు. నెల్లూరులోని ఏసీ స్టేడియంలో యోగా కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు. మంత్రి ఆనం గార్డెన్స్‌లో ఆసనాలు వేశారు. తిరుపతి ఎన్‌సీసీ నగర్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లు గుర్రాలపై కూర్చుని, నిలబడి యోగాసనాలు వేశారు. వారిని కల్నల్ సతీందర్ దహియా ప్రశంసించారు. రాజమండ్రి జైలులో 1300 మంది ఖైదీలు యోగాసనాలు వేశారు.

యోగాంధ్రలో 10.87 లక్షల మంది అనంతపురం జిల్లావాసులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విశాఖలో నిర్వహించిన యోగా వేడుకలను జిల్లాలోని నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎస్పీ జగదీశ్ సహా పలువురు జిల్లా అధికారులు, ప్రజాప్రతిధులు, ప్రజలు యోగాసనాలు వేశారు. జిల్లా వ్యాప్తంగా 6,040 వేదికలలో 10.87 లక్షల మంది యోగాంధ్రలో భాగస్వాములయ్యారు. తూర్పు గోదావరి జిల్లాలో 4,500 వేదికలపై యోగా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. కొవ్వూరులో గోదావరి తీరంలో స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. జిల్లాలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌లో 'మిరాకిల్ వరల్డ్ రికార్డు' దక్కింది. రికార్డుస్థాయిలో 18,662 మంది విద్యార్థులు యోగాంధ్రలో నమోదు చేయించుకున్నారు. జూన్ 18న 16,123 మంది విద్యార్థులతో మెగా యోగాంధ్ర నిర్వహించగా 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్' దీనిని నమోదు చేసింది. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 4,600 కేంద్రాల్లో 8 లక్షల మంది యోగాసనాలు వేశారు. కాకినాడ జిల్లాలో 4,800 కేంద్రాల్లో యోగాసనాలు వేయగా జిల్లా కేంద్రంలో కలెక్టర్ షాన్‌మోహన్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

**ఆపరేషన్ సిందూర్ అనంతరం కెనడా వేదికగా జూన్ 16, 17 తేదీలలో జరిగిన జీ-7 శిఖరాగ్ర సమావేశాలకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ ఆ పర్యటనలో భాగంగా కెనడాతో పాటు సైప్రస్, క్రొయేషియా దేశాల్లో కూడా పర్యటించారు. ఈ మూడు దేశాల పర్యటనను ఆయన ఎంతో వ్యూహాత్మకంగా వినియోగించుకొని తన విదేశాంగ చతురతను చాటుకున్నారు. ఈ విదేశీ పర్యటనపై దేశీయంగా, అంతర్జాతీయంగా సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీనికి ప్రధాన కారణం జీ-7 శిఖరాగ్ర సమావేశాలకు ప్రధాని మోదీ వెళ్లడంపై కొంత గందరగోళం నెలకొంది. ఈ సమావేశాలు కెనడాలో నిర్వహిస్తున్న నేపథ్యంలో మోదీ పర్యటనపై మరింత ఆసక్తి పెరిగింది.**



# విదేశీ పర్య

ఖలిస్తాన్ వేర్పాటువాదులకు స్థావరంగా మారిన కెనడాతో భారత్‌కు కొంత కాలంగా సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో జీ-7 సమావేశాలకు నరేంద్ర మోదీని పిలుస్తారా? అనే సందేహాలు వెలువడ్డాయి. మోదీ రాకను ఖలిస్తాన్ వేర్పాటువాదులు వ్యతిరేకిస్తుండడంతో కెనడా ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో అనే ప్రశ్నలు ఉదయించాయి. ఇందుకు తగ్గట్టుగానే జీ-7 సమావేశాలకు భారతదేశాన్ని ఆహ్వానించడంలో కొంత జాప్యం జరగడంతో కాంగ్రెస్ దాన్ని నరేంద్ర మోదీ సర్కారు విదేశాంగ వైఫల్యంగా ప్రచారం చేసింది.

జీ-7లో భారత్ సభ్యత్వ దేశం కాకపోయినా ఆహ్వానిత దేశంగా ఇప్పటివరకు 12 సార్లు ఆహ్వానం అందింది. 1975లో ఏర్పడిన 'జీ' సమావేశాలకు మొదటిసారిగా 2003లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వానికి ఆహ్వానం అందింది. వాజ్‌పేయి కృషితో ప్రారంభమైన ఈ పరంపర కొనసాగడంతో 2004 నుండి 2009 వరకు మన్మోహన్ సింగ్ కూడా ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. అనంతరం భారత్‌కు ఆహ్వానాలు ఆగిపోయాయి. మళ్లీ మోదీ ప్రభుత్వం కృషితో తిరిగి 2019 నుండి భారత్‌కు జీ-7 సమావేశాలకు ఆహ్వానాలు అందుతున్నాయి. మోదీ వరుసగా 6 సార్లు హాజరయ్యారు. జీ-7 సమావేశాల్లో భారత్ పాల్గొన్న చరిత్రను చూస్తే గత కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యం స్పష్టమవుతోంది. వాస్తవాలు ఇలా ఉండగా కాంగ్రెస్ మాత్రం మోదీ ప్రభుత్వం వైఫల్యంతో మొదటిసారి భారత్‌కు ఆహ్వానం అందలేదని ప్రచారం చేసింది.

మోదీ వ్యతిరేక శక్తుల అంచనాలను పటాపంచలు చేస్తూ కెనడా ప్రధాని మార్క్ కార్నీ 51వ జీ-7 సమావేశాలకు భారత్‌ను ఆహ్వానించడంతో కాంగ్రెస్ నవ్వులపాలైంది. మోదీ జీ-7 సమావేశాలకు ముందు సైప్రస్‌కు, అనంతరం క్రొయేషియాకు వెళ్లారు. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో ఈ మూడు దేశాల పర్యటనలో ప్రతిదీ మన దేశానికి ప్రధానమైందే.

సైప్రస్ దేశం 12 లక్షలలోపు జనాభా ఉన్న ఒక చిన్న ద్వీపం. ఈ చిన్న దేశం భౌగోళికంగా ఆసియాలో ఉన్నా, ఐరోపాకు సింహద్వారంగా ఐరోపా యూనియన్-ఈయూలో ప్రాతినిధ్యాన్ని కలిగి ఉంది. టర్కీ, సిరియా దేశాలతో సరిహద్దును పంచుకుంది. ఇంతకు ముందు ఈ ద్వీపానికి మన దేశ చరిత్రలో రాజకీయంగా ప్రాధాన్యతలేదు. 1982లో ఇందిరాగాంధీ, 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయి సైప్రస్‌లో పర్యటించారు. 23 ఏళ్ల అనంతరం ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ సైప్రస్ పర్యటనలో విశేష ముంది. ఈ పర్యటన వెనుక భౌగోళిక, రాజకీయ అంశాలున్నాయి. సైప్రస్, టర్కీ మధ్య వైరం ఉంది. టర్కీ అక్రమంగా సైప్రస్ భూభాగాన్ని ఆక్రమించడంతో రెండు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ ప్రధాని సైప్రస్ వేదికగా టర్కీకి పరోక్షంగా హెచ్చరిక సందేశం పంపారు.



పాకిస్తాన్ ఇస్లాం దేశమనే ఒకే ఒక కారణంతో పాక్‌కు నిత్యం దన్నుగా నిలిచే టర్కీ ఆపరేషన్ సిందూర్‌లో కూడా భారత్‌కు వ్యతిరేకంగా కుట్రలకు పాల్పడింది. భారత్ సరిహద్దులో సాధారణ ప్రజలపై పాకిస్తాన్ వినియోగించిన డ్రోన్లు టర్కీ దేశం అందించినవే. పర్యాటక రంగంగా టర్కీకి అధికంగా భారత్ నుండే లాభాలొస్తున్నాయి. ఇంతకుముందు సంభవించిన భూకంపంతో అతలాకుతలమైన ఆ దేశానికి భారత్ అన్ని దేశాల కంటే అధికంగా సహాయ సహకారాలు అందించింది. ఇవన్నీ మరిచిన టర్కీ ఉగ్రవాదులను ప్రేరేపిస్తున్న పాకిస్తాన్‌కు అండగా నిలిచింది. పాకిస్తాన్‌కు సాయపడిన ఆ దేశానికి సరైన సమాధానం ఇవ్వాలని నిర్ణయించిన మోదీ సైప్రస్ పర్యటనకు ప్రాముఖ్యతిచ్చారు.

భౌగోళికంగా సంబంధం లేకపోయినా భారత్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ పలుమార్లు చికాకు పరుస్తున్న టర్కీని గత ప్రభుత్వాలు విస్మరించినా ఆ దేశానికి గట్టి బుద్ధి చెప్పాలని ప్రధాని నిర్ణయించారు.

టర్కీ 1974లో కుట్రలకు పాల్పడి సైప్రస్‌లో ప్రభుత్వాన్ని కూలగొట్టి ఆ దేశ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకొని ఇప్పటికీ తన అధీనంలోనే ఉంచుకుంది. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ శక్తి




# ...టనపై మోదీ ముద్ర

సామర్థ్యాలను తెలుసుకున్న సైప్రస్ కూడా మనకు మరింత దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తోంది. మరోవైపు 2026లో ఈయూ సారథ్య బాధ్యతలు కూడా సైప్రస్ చేతికి దక్కుతుండడంతో ఉభయకుశలోపరిగా ఆ దేశానికి సాయం అందిస్తూనే, మన లక్ష్యం కూడా నెరవేర్చుకునేందుకు మోదీ ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించారు.

వ్యూహాత్మకంగా భారత్‌కు కీలకమైన భాగస్వామిగా మారిన సైప్రస్‌కు ఆర్థికంగా, సైనిక పరంగా అండదండలు అందించేందుకు ప్రధాని ముందుకు రావడంతో పరోక్షంగా టర్కీకి హెచ్చరిక జారీ చేసినట్టయ్యింది. అందుకే మోదీ సైప్రస్ పర్యటనలో భాగంగా ఆ దేశ సరిహద్దు వరకు వెళ్లడం కూడా ఆసక్తికరమైన పరిణామమే. సైప్రస్, టర్కీ దేశాల సరిహద్దులో రెండు వైపులా రెండు దేశాల పతాకాలుంటాయి. భారత ప్రధాని సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ వెంట ఆ దేశ సరిహద్దుల వరకు నడుస్తూ టర్కీ జెండాలను తిలకించడం గమనార్హం.

తన సైప్రస్ పర్యటనతో ఆ దేశ ప్రజల్లో భరోసా నింపిన భారత ప్రధానిని ఆ దేశ అత్యున్నతమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ మకారియోస్ 3' పురస్కారంతో సత్కరించారు. మోదీ అనంతరం జీ-7 రెండు రోజుల సమావేశాల కోసం కెనడాలో పర్యటించారు. టెర్రరిజాన్ని సమర్థిస్తున్న దేశాల ద్వంద్వ ప్రమాణాలను జీ-7 సదస్సులో ఆయన ఎండగట్టారు. స్వార్థ ప్రయోజనాల కోసం విష సర్పం లాంటి టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తే ఎప్పటికైనా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సున్నితంగా అగ్రదేశాలను హెచ్చరించారు. ఒక వైపు హడావిడిగా ఆంక్షలు విధిస్తూ, మరోవైపు టెర్రరిజానికి మద్దతిచ్చే దేశాలకు రివార్డులు, రుణాలు ఇస్తున్నారంటూ వ్యాఖ్యానించి ఉగ్రవాదంపై అగ్రరాజ్యాల నిజాయతీని ప్రశ్నించారు. జీ-7 సమావేశాల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కూటమి దేశాల అధినేతలతో ప్రత్యేకంగా సమావేశమై ఉగ్రవాదంతో పాటు టెక్నాలజీ, వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు అంశాలపై చర్చించారు. కెనడా వేదికగా దక్షిణ కొరియా, ఫ్రాన్స్, బ్రిటన్, ఇటలీ, మెక్సికో, జర్మనీ, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ దేశాధినేతలతో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

జీ-7 సమావేశాల్లో భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కలయికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే సమావేశాల మధ్యలోనే ట్రంప్ అమెరికాకు వెనుదిరగడంతో మోదీతో ఆయన చర్చలు జరపలేదు. మోదీని ట్రంప్ కలిసేందుకు ఇష్టపడలేదని, అదే సమయంలో ట్రంప్ మోదీ కంటే పాక్ సైన్యాధిపతి మునీర్‌ను కలుసుకునేందుకే ప్రాధాన్యతిచ్చారని, ఇది భారత్ విదేశాంగా విధాన వైఫల్యమని కాంగ్రెస్ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. మరుసటి రోజే జరిగిన పరిణామాలతో గోబెల్స్ ప్రచారం చేసిన కాంగ్రెస్ ఇంటా బయట నవ్వులపాలైంది.

నరేంద్ర మోదీతో ప్రత్యక్షంగా చర్చించలేకపోయిన ట్రంప్ అమెరికాకు చేరిన తర్వాత ఫోన్‌లో మాట్లాడారు. "భారత్ పాక్ కాల్పుల విరమణలో మీ జోక్యం ఏమాత్రం లేదు. పాక్ కాళ్లబేరానికి రావడంతోనే కాల్పుల విరమణకు అంగీకరించాం, మీతో ఎలాంటి వాణిజ్య ఒప్పందాలూ కుదుర్చుకోలేదు, మీ మధ్యవర్తిత్వం మాకు అవసరం లేదు... " అని మోదీ ట్రంప్ ముఖం మీదనే చెప్పేయడంతో ఇంతకాలం 'నరేందర్.. సరెండర్' అంటూ కాంగ్రెస్ చేసిన తప్పుడు ప్రచారానికి ముగింపు పలికినట్లయ్యింది. తిరుగు ప్రయాణంలో నరేంద్ర మోదీని ట్రంప్ అమెరికాలో పర్యటించాలని కోరినా వారి కుట్రలు, కుతంత్రాలు బాగా తెలిసిన నరేంద్ర మోదీ వారి ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించారు. దీంతో ట్రంప్ పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌తో సమావేశమైన సందర్భంలో భారత్ పాక్ దేశాల మధ్య కాల్పుల విరమణలో తమ జోక్యం ఏమాత్రం లేదనే సత్యాన్ని అంగీకరించాల్సి వచ్చింది.

మోదీ కెనడా పర్యటనను ఖలిస్తాన్ వేర్పాటువాదులను కట్టడి చేయడంలో చక్కగా వినియోగించుకున్నారు. భారత ప్రధాని పర్యటనకు ఖలిస్తాన్ వేర్పాటువాదులు అడ్డంకులు కలిగించవచ్చనే ఆందోళన నేపథ్యంలో ప్రధాని వెనకడుగు వేయకుండా జీ-7కు హాజరయ్యారు. కొంత మంది ఖలిస్తాన్ వేర్పాటువాదులు 'కిల్ మోదీ పాలిటిక్స్, కిల్ ఇండియా పాలిటిక్స్' అంటూ నిరసనలు చేపట్టి భారత పతాకాన్ని అవమానించారు. అయితే మోదీ కెనడా వీడిన మరుసటి రోజునే కెనడా నిఘా సంస్థ తమ దేశం నుంచే ఖలిస్తానీ వేర్పాటువాదులు భారత్‌కు వ్యతిరేకంగా కుట్రలకు పాల్పడుతున్నారని నివేదిక ఇచ్చింది. ఇంతకాలం ఖలిస్తాన్ విషయంలో భారత్‌ను తప్పుపడుతున్న కెనడాలో ఈ మార్పు రావడానికి ప్రధాన కారణం నరేంద్ర మోదీ పర్యటనే.

మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరిగా మోదీ క్రొయేషియాలో పర్యటించారు. ఆ దేశంలో పర్యటించిన మొదటి భారత ప్రధానిగా నిలిచారు. క్రొయేషియా అధ్యక్షుడు జోరాన్ మిలానోవిక్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపిన మోదీ విద్య, ఐటీ, స్టార్టప్‌లు, పునరుత్పాదక శక్తి, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి వంటి రంగాల్లో ఒకరికొకరు సహకరించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆ దేశ విశ్వవిద్యాలయాల్లో హిందీ బోధనపై కూడా ఉభయ దేశాలు చర్చించాయి.

మూడు దేశాల పర్యటనలో మోదీ ముద్ర స్పష్టంగా కనిపించింది. దేశ శత్రువులపై ఎలాంటి ఉదాసీనత కనబర్చకుండా చాకచక్యంగా వ్యవహరించారు. మోదీ తన విదేశీ పర్యటనను వ్యూహాత్మకంగా వినియోగించుకొని దేశ ప్రయోజనాలకు పెద్ద పీట వేయడమే కాకుండా భారత్‌తో చెలగాటమాడే టర్కీ వంటి దేశాలకు, మేము ఏమి మాట్లాడినా చెల్లుబాటు అవుతుందనే అహంకార ధోరణితో వ్యవహరించే ట్రంప్‌నకు, ఖలిస్తాన్ ఉగ్రవాదులకు గట్టి హెచ్చరికలే పంపారు.

**– శ్రీపాద**

**ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం వివిధ పార్టీలతో కూడిన ఏడు ప్రతినిధి బృందాలను 33 దేశాలకు, యూరోపియన్ యూనియన్ దేశాలకు మే 21 నుంచి పంపింది. పాకిస్తాన్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదంపై ప్రపంచ దేశాలకు వివరించడం ఈ ప్రతినిధి బృందాల పర్యటన ప్రధాన లక్ష్యం. ఎందుకంటే ఇప్పటికే చాలా ప్రపంచ దేశాలు భారత్, పాకిస్తాన్‌లను ఒకే విధంగా పరిగణిస్తున్నాయి. నిజానికి పాకిస్తాన్ మతం ఆధారంగా ఏర్పడిన దేశం. అదే భారత్ బహుళ సమాజాన్ని కలిగి, సెక్యులరిజంతో కూడిన ప్రజాస్వామ్యం పరిఢవిల్లే దేశం. పాకిస్తాన్ చేస్తున్న పెహల్గావ్ వంటి అకృత్యాల వల్ల శాంతిని కోరుకునే మన దేశాభివృద్ధి దెబ్బ తింటుంది. ఈ నేపథ్యంలో మన సెక్యులర్, ప్రజాస్వామ్య విలువలను ప్రపంచ దేశాలకు తెలియజేయడమే ఈ ప్రతినిధి బృందాలను పంపడం వెనుక ప్రధాన లక్ష్యం.**



# దౌత్యయాత్ర

ఈ ఏడు బృందాలు మొత్తం 33 దేశాల రాజధానులకు చేరుకొని అక్కడి మేధావులు, మంత్రులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, మీడియాలకు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ సుస్థిర వైఖరిని అర్థమయ్యేలా వివరించాయి. ఉగ్రవాదంపై భారత్ ఎట్టి పరిస్థితుల్లో సహించబోదన్న సత్యాన్ని ఈ దేశాలకు సుస్పష్టంగా అవగతం చేశాయి. పాకిస్తాన్ దుష్కృత్యాలను ఎండగట్టడానికి భారత్ ప్రారంభించిన ఈ దౌత్యపరమైన ప్రక్రియలో భాగంగా భారత్ విదేశాలకు పంపిన ప్రతినిధుల బృందంలో వివిధ పార్టీలకు చెందిన 59 మంది సభ్యులుండగా, వీరిలో వివిధ పార్టీలకు చెందిన మాజీ మంత్రులు, పార్లమెంటేరియన్లు, ఎనిమిదిమంది మాజీ రాయబారులుండటం విశేషం. వీరు సందర్శించిన దేశాల్లో ఐక్యరాజ్య సమితి సభ్యదేశాలు, ఇతర పలుకుబడి కలిగిన దేశాలున్నాయి. మొత్తం పదిరోజుల పాటు సాగిన ఈ మిషన్‌లో పాల్గొన్న ఏడు టీమ్‌లకు శశిథరూర్, రవిశంకర్ ప్రసాద్, సంజయ్‌కుమార్ ఝా, బైజయంత్ పాండా, కనిమొజి కరుణానిధి, సుప్రియా సూలే, శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండేలు నాయకత్వం వహించారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు సమన్వయం చేశారు. ఈ అఖిలపక్ష ప్రతినిధి బృందానికి విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రి వారు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చక్కగా వివరించారు.

**యు.ఎన్.లో పాక్‌కు చెక్ పెట్టే వ్యూహం**

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యురాలిగా పాకిస్తాన్ మరో 17 నెలల పాటు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో ఇందులో ప్రస్తుతం సభ్యులుగా వున్న 15 దేశాలకు మన ప్రతినిధి బృందాలు వెళ్లాయి. అంతేకాదు త్వరలో సభ్యత్వం పొందనున్న మరో ఐదు దేశాలకు కూడా మన ప్రతినిధులు వెళ్లారు. యుఎన్ఎస్‌సీ లో సభ్యురాలిగా పాకిస్తాన్ మనదేశానికి వ్యతిరేకంగా పలు అంశాలు లేవనెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో, దానికి ముకుతాడు వేసే లక్ష్యంతో ఈ సభ్యదేశాలకు మన ప్రతినిధి బృందాలు వెళ్లి మనదేశం ఉగ్రవాదంపై అనుసరిస్తున్న వైఖరిని, పాక్ ఏవిధంగా పెహల్గావ్ దాడికి పాల్పడిందీ వివరించడమే కాదు, ఆయా దేశాలు భారత్ జరుపుతున్న ఉగ్రవాద వ్యతిరేక పోరుకు తమ మద్దతు ప్రకటించేలా చేయడంతో కృతకృత్యం సాధించాయి. భారత్ అనుసరించిన సంయమనం, కఠిన వైఖరి విధానాలు ప్రపంచ వ్యాప్తంగా పరిశీలకుల ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ యుద్ధంగా ప్రజ్వరిల్ల కుండా వ్యవహరించిన తీరు ఆయా దేశాలను ఆకట్టు కుంది. ఒకవైపు ఉగ్రవాదుల పీచమణచడం, మరోవైపు దౌత్యంతో విదేశాలకు తన వైఖరిని స్పష్టం చేయడంలో భారత్ ఒక సరికొత్త శైలికి తెరతీసిందనే చెప్పాలి. ఇది ఇతర దేశాలకు కూడా తప్పనిసరిగా మార్గదర్శకం కాగలదు. భారత్ అత్యంత కచ్చితత్వంతో నిర్వహించిన దాడులు, భారత్ సాధించిన ఆధునిక సాంకేతిక ప్రగతిని ప్రపంచానికి వెల్లడించాయి. అప్పటివరకు ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉన్న పాకిస్తాన్ కూడా కోలుకోలేని రీతిలో దెబ్బతిని మోకాళ్లపై నిలబడే పరిస్థితి ఏర్పడింది. అంతేకాదు ఒకపక్క చైనా, మరోపక్క తుర్కియేల యుద్ధ విమానాలు, రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు మనముందు ఎందుకూ పనికిరావన్నది సుస్పష్టమైంది. ఈ ఆపరేషన్ ద్వారా భారత్, తాను ఉగ్రవాదంపై ఎంత కచ్చితమైన, కఠినమైన చర్యలు తీసుకోగలదో ప్రపంచానికి కళ్లకు కట్టినట్టు చూపింది.

**ప్రతినిధుల ఎంపికలో వ్యూహాత్మకత**

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి విదేశాలకు భారత్ వాదనను వినిపించేందుకు ప్రతినిధుల బృందాన్ని ఎంపిక చేయడంలో ప్రధాని నరేంద్ర మోదీ అద్భుతమైన వ్యూహాత్మక వైఖరిని అవలంబించారనే చెప్పాలి. ఈ ప్రతినిధి బృందం ఎంపికలో ఆయన రాజకీయాలకు అతీతంగా విశ్వసనీయతకు, యోగ్యతకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చి సమర్థులైన వారిని ఎంపిక చేయడం విశేషం. ముఖ్యంగా తనను ఎప్పుడూ విమర్శించే శశిథరూర్, అసదుద్దీన్ ఒవైసీ వంటివారిని ఈ బృందంలో చేర్చడం ద్వారా ఆయన అద్భుతమైన రాజకీయ పరిణితి ప్రదర్శించారనే చెప్పాలి. ఈ విధానానికి పి.వి.నరసింహారావు ఆద్యుడని చెప్పాలి. 1990–96 మధ్యకాలంలో ప్రధానిగా

అంతర్జాతీయంగా దౌత్యపరంగా చేపట్టిన యత్నాలు ఫలించి పాకిస్తాన్ తన సైనిక దళాల ఉపసంహరణకు యు.ఎస్. తదితర దేశాలు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చాయి. ఇప్పుడు ఇదే శైలిని కొనసాగిస్తున్న ప్రధాని మోదీ ఈ విధంగా అఖిలపక్ష సభ్యులతో కూడిన బృందాలను పంపడం ద్వారా కార్పొరేట్ రంగంలో ఛీఫ్ హ్యూమన్ రీసోర్స్ ఆఫీసర్‌గా వ్యవహరించారనే చెప్పాలి. ఇక్కడ భజనపరులెవరూ లేరు. ఉన్నది కేవలం పరస్పర సహకారం అందించు కునే వ్యూహాత్మక ప్రతినిధి బృందం మాత్రమే!

ఉన్న ఆయన పాటించిన విధానాన్నే ప్రస్తుతం నరేంద్రమోదీ అనుసరించారనుకోవాలి. 1994లో ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సదస్సులో పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పేందుకు పంపిన ప్రతినిధి బృందానికి అటల్‌బిహారీ వాజ్‌పేయికి నాయకత్వం అప్పగించారు. తర్వాతి కాలంలో మన్మోహన్ సింగ్ కూడా ఇదేమాదిరి అఖిలపక్ష బృందాలను వివిధ సదస్సులకు పంపడం చరిత్ర! 1999 కార్గిల్ యుద్ధం 2001లో పార్లమెంట్‌పై దాడి, 2008లో ముంబయి దాడుల సమయాల్లో కూడా భారత్ దౌత్యపరంగా పాకిస్తాన్‌ను అంతర్జాతీయ సమాజంలో ఏకాకిని చేయగలిగింది. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం సందర్భంగా భారత్ నియంత్రణ రేఖను



# దిగ్విజయం

దాటకుండా సంయమనం పాటించింది.

అంతర్జాతీయంగా దౌత్యపరంగా చేపట్టిన యత్నాలు ఫలించి పాకిస్తాన్ తన సైనిక దళాల ఉపసంహరణకు యు.ఎస్. తదితర దేశాలు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చాయి. ఇప్పుడు ఇదే శైలిని కొనసాగిస్తున్న ప్రధాని మోదీ ఈ విధంగా అఖిలపక్ష సభ్యులతో కూడిన బృందాలను పంపడం ద్వారా కార్పొరేట్ రంగంలో ఛీఫ్ హ్యూమన్ రీసోర్స్ ఆఫీసర్‌గా వ్యవహరించారనే చెప్పాలి. ఇక్కడ భజనపరులెవరూ లేరు. ఉన్నది కేవలం పరస్పర సహకారం అందించుకునే వ్యూహాత్మక ప్రతినిధి బృందం మాత్రమే!

**మోదీని విమర్శించిన వారే...**

గతంలో అభిషేక్ బెనర్జీ, అసదుద్దీన్ ఒవైసీ, కనిమోజి కరుణానిధి, సుప్రియా సూలేలు ప్రధాని నరేంద్రమోదిని తీవ్రస్థాయిలో వ్యతిరేకించే నాయకులుగా పేరు పడ్డారు. కేంద్ర ప్రభుత్వాన్ని పదునైన విమర్శలతో ఇబ్బంది పెట్టడానికి నిరంతరం యత్నించే నాయకులు వీళ్లు. అయినప్పటికీ ప్రపంచ యవనికపై భారత్ తరపున తమ వాణిని వినిపించడానికి వీరిపైనే మోదీ విశ్వాసం ఉంచారు. ముఖ్యంగా ఈ నాయకులు నాయకత్వం వహించే పార్టీలు, బీజేపీతో తీవ్రస్థాయి సైద్ధాంతిక విభేదాలు కలిగి ఉన్నాయి. అయినప్పటికీ అంతర్జాతీయంగా భారతీయ దౌత్యం మరింత పటిష్టంగా ఉన్నదనడానికి వీలుగా వీరి ఎంపిక జరిగింది. రాజకీయాలకు అతీతంగా ప్రత్యర్థులను విశ్వసించడం అనేది అత్యంత పరిణిత నాయకత్వ ప్రధాన లక్షణం. ఈ బృందంలో శశి థరూర్,సల్మాన్ ఖుర్షీద్, గులాంనబీ ఆజాద్, ఎం.జె. అక్బర్, సయ్యద్ అక్బరుద్దీన్‌లు అంతర్జాతీయ దౌత్యాన్ని నెరపడంలో అత్యంత నిష్ణాతులన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రతినిధులు ఏయే దేశాలకు వెళ్లాలనేది ఆయా దేశాల భౌగోళిక రాజకీయ పరిస్థితులపై వారికున్న అవగాహన ఆధారంగా ఈ ఎంపిక జరిగిందనేది సుస్పష్టం. అందువల్లనే ఈ ప్రతినిధి బృందాలకు ఎంపికైన వారిలో హైప్రొఫైల్ లేనివారు కూడా ఉన్నారు. వీరు కనబరిచిన అత్యంత సమర్థమైన పనితీరు అందరినీ ఆశ్చర్యంలో ముంచె త్తింది. వీరెవ్వరూ ప్రతిపక్షాలకు చెందినవారిలా వ్యవహరించలేదు. దేశంకోసం నిలబడ్డారు. మౌనంగా ఉండటం రాజకీయ పరిణితి కాదు, కానీ దేశం కోసం ఎప్పుడు మాట్లాడాలో తెలియడం రాజకీయ పరిణితి! ఆ విధంగా దేశ ప్రతిష్టను పెంచిన ఈ నాయకుల రాజనీతిజ్ఞతను ఎంతగా ప్రశంసించినా తక్కువే. ఇటువంటి రాజకీయాలే ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యాన్ని నిలిపి ఉంచుతాయి. దేశానికి కావలసింది ఇదే!

**దౌత్య విజయం**

విదేశాలకు వెళ్లిన భారత ప్రతినిధి బృందాలు, పెహల్గావ్ ఉగ్రదాడి తర్వాత తీవ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న వైఖరిని ఆయా దేశాలకు స్పష్టంగా వివరించారు. ఈ ప్రతినిధి బృందాల్లో సభ్యులుగా ఉన్న వివిధ పార్టీలకు చెందిన పార్లమెంటేరియన్లు, మాజీ దౌత్యవేత్తలు, మాజీ మంత్రులు తమ విస్తృత అనుభవాల నేపథ్యంలో పాక్ వైఖరిని ఎండగట్టడమే కాదు ఇక ముందు జరిపే ప్రతి ఉగ్రదాడిని యుద్ధంగానే భారత్ పరిగణిస్తుందన్న అంశాన్ని స్పష్టంగా వివరించగలిగారు. యు.ఎస్, యు.కె, ఇజ్రాయిల్, సౌదీ అరేబియాలు భారత్ వైఖరికి మద్దతు ప్రకటించాయి. అయితే కొలంబియా మాత్రం పాక్ అనుకూల



వైఖరి అవలంబించినప్పటికీ, శశిథరూర్ నేతృత్వం లోని బృందం అక్కడి రాజకీయ నాయకులు, మేధావులు, మీడియాకు ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వాస్తవాలను సాక్ష్యాధారాలతో సహా వెల్లడించడంతో ఆ దేశం తన అభిప్రాయాన్ని మార్చుకోవడం మన ప్రతినిధిబృందం సాధించిన గొప్ప దౌత్య విజయంగా చెప్పకతప్పదు.

నిజానికి పెహల్గావ్ దాడులు జరిగిన వెంటనే మన విదేశాంగశాఖ మంత్రి డా॥జయశంకర్ యు.ఎన్.ఎస్.సి.లోని ఏడు తాత్కాలిక సభ్య దేశాలైన అల్జీరియా, గ్రీస్, గయానా, పనామా, స్లొవేనియా, సిర్రా లియోన్, సోమాలియా విదేశాంగ మంత్రులకు ఫోన్ చేసి విషయం తెలిపారు. అప్పటి నుంచే నేటి విస్తృత దౌత్య ప్రక్రియకు బీజం పడింది. చివరిగా ఇప్పుడు నరేంద్రమోదీ కెనడాలో జీ-7 దేశాల శిఖరాగ్ర సమావేశంలో పాల్గొని సైప్రస్, క్రొయేషియాల్లో కూడా పర్యటించి భారత్ దౌత్యం ఎంతటి పటిష్టంగా ఉంటుందో మరోసారి ప్రపంచానికి తెలియజెప్పారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్తాన్‌కు మద్దతు పలికి డ్రోన్లను సరఫరా చేసిన తుర్కియేకు బుద్ధి చెప్పే ప్రక్రియలో భాగంగా ఆయన సైప్రస్‌లో పర్యటించి, ఆ దేశానికి మద్దతు ప్రకటించడమే కాదు, కొన్ని ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హడావిడిగా అమెరికా వెళ్లిపోవడంతో మన ప్రధాని నరేంద్రమోదీతో భేటీ సాధ్యం కాలేదు. దీంతో ఆయన అమెరికా నుంచే నరేంద్రమోదీకి ఫోన్ చేసి యు.ఎస్.కు ఆహ్వానించగా సున్నితంగా తిరస్కరించి, తన క్రొయేషియా పర్యటన కొనసాగించారు. ఇదే సందర్భంగా భారత్‌లో జరుగబోయే క్వాడ్ సమావేశంలో పాల్గొనాలని ట్రంప్‌ను ఆహ్వానించారు. అంతేకాదు, పాకిస్తాన్ సైన్యం అభ్యర్థనమేరకే ఆపరేషన్ సిందూర్‌ను తాత్కాలికంగా నిలిపామని, ఇందులో



మీ మధ్యవర్తిత్వ ప్రమేయం ఏమీ లేదని కుండబద్దలు కొట్టడం ద్వారా ట్రంప్ చేసుకుంటున్న ప్రచారానికి అడ్డుకట్ట వేసారు.

ఇక జి-7 శిఖరాగ్ర సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉగ్రవాదంపై యూరోపియన్ దేశాల ద్వంద్వ వైఖరిని తీవ్రంగా తప్పుపట్టారు. ఒకవైపు ఉగ్రవాదాన్ని సహించేది లేదంటూనే మరోవైపు వాళ్లతో బేరసారాలు చేయడం మీకే చెల్లిందంటూ జీ-7 దేశాలను దెప్పిపొడిచారు. ఇటువంటి పద్ధతులు నచ్చని నరేంద్రమోదీ జీ-7 సమావేశంలో తనదైన శైలిలో ఈ దేశాల వ్యవహార శైలిని తప్పుపట్టారు. అంతేకాదు, ఆపరేషన్ సిందూర్‌ను తాత్కాలికంగానే నిలిపామని, పాకిస్తాన్ తోకజాడిస్తే ఈసారి చర్యలు మరింత కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఇది రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సమస్య కనుక మరోదేశం ప్రమేయాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు.

**ఉగ్రవాదంపై పోరు గమ్యమెటో?**

సరిగ్గా ఇదే సమయంలో అమెరికాలో అసిమ్ మునీర్‌తో ట్రంప్ డిన్నర్ సమావేశంలో పాల్గొనడం గమనార్హం. ఇజ్రాయిల్‌కు మద్దతుగా అమెరికా ఏ క్షణమైనా ఇరాన్‌పై దాడికి దిగే అవకాశాలున్న తరుణంలో, అసీమ్ మునీర్‌తో జరిపిన ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఏకంగా ఐదురోజుల పాటు అసీమ్ మునీర్ అమెరికా పర్యటన కొనసాగుతోంది. అమెరికా అధ్యక్షుడు, మరో దేశ సైనిక చీఫ్‌తో సమావేశమవడం కొంత విచిత్రంగానే అనిపిస్తుంది. ఎందుకంటే ప్రొటోకాల్ అనేది ఉంటుంది కదా. కానీ ఏ కారణం లేకుండానే ట్రంప్ ఈ పనిచేశారా? అనేది ఇప్పుడు నెలకొన్న సందేహం. అమెరికా లాంటి దేశం అసిమ్ మునీర్‌కు ఇంతటి ప్రాధాన్యత ఇస్తున్నదంటే, ఒకప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌లో యుఎస్ఎస్ఆర్ సైన్యం ప్రవేశించినప్పుడు ఉగ్రవాదుల రూపంలో పాకిస్తాన్ సహాయం తీసుకున్నట్టే ఇరాన్‌ను దెబ్బకొట్టడానికి మళ్లీ ఇప్పుడు మళ్లీ అమెరికా పావులు కదుపుతున్నదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ముఖ్యంగా టెర్రరిస్తాన్ అయిన పాక్ ఉగ్రవాదుల సహాయంతో ఇరాన్ సుప్రీం లీడర్ అయెతుల్లా ఖమేనీని అడ్డు తొలగించే వ్యూహం ఏమైనా జరుగుతున్నదా అనేది విదేశీ మీడియాలో వ్యక్తమవుతున్న సందేహం. ఇజ్రాయిల్ నాయకులు కూడా ఖమేనీని అడ్డు తొలగిస్తే, సమస్యకు పరిష్కారం లభిస్తుందని పదే పదే ప్రకటనలు ఇస్తుండటం గమనార్హం. విచిత్రంగా ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న ఒకప్పటి ఇరాన్ రాజు రాజా పహ్లావీ ఒక ట్వీట్ చేశారు.

దీని ప్రకారం ఇరాన్‌కు త్వరలోనే మంచిరోజులు రాబోతున్నాయని, తాను తిరిగి ఇరాన్ పగ్గాలు చేపడతానంటూ పేర్కొనడం మరిన్ని సందేహాలకు తావిచ్చేదిగా వుంది. ఈ పరిణామాలను పరిశీలిస్తే ఉగ్రవాదానికి, శాంతికి మధ్య అడ్డుగోడ తొలగిపోతున్నదన్న సత్యం స్పష్టమవు తోంది. ఒక ధూర్త దేశ ఆర్మీ చీఫ్‌కు ఇంతటి ప్రాధాన్యం ఇవ్వడం వెనుక అమెరికా గట్టి ప్రణాళిక ఏదో ఉన్నదని చెప్పక తప్పదు. పాక్ సహాయం పొందిన అమెరికా కచ్చితంగా దానికి దన్నుగా ఉండక మానదు. దాని మాట కాదనలేని సహచర దేశాలు కూడా అదే బాట పట్టకమానవు. దీంతో కశ్మీర్‌ను రావణకాష్టంలా మార్చే ప్రక్రియ మళ్లీ మొదలు కావచ్చు. ఈ పరిణామాల నేపథ్యంలో మన ఉగ్రవాదంపై పోరు ఏ గమ్యానికి చేరుతుందో కాలమే నిర్ణయించాలి.






**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్



# అంతరిక్ష యాత్రకు రెండో భారతీయుడు శుభాంశు శుక్లా!

**అతి సాధారణ కుటుంబంలో పుట్టి పెరిగి అద్వితీయమైన ఎత్తుకు ఎదిగిన వ్యక్తి 39 ఏళ్ల శుభాంశు శుక్లా. 'శుక్స్' అని బంధుమిత్రులు ముద్దుగా పిలుచుకునే శుక్లా ప్రస్తుతం భారతీయ వైమానిక దళంలో టెస్ట్ పైలట్‌గా, భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ–ఇస్రోలో రోదసీ శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు. భారతీయ మానవ అంతరిక్ష యాత్ర కార్యక్రమంలో భాగంగా గగన్‌యాన్ పేరుతో ఇస్రో, భారతీయ వైమానిక దళం సంయుక్తంగా చేపడుతున్న ఒక ప్రాజెక్టు కోసం ఎంపిక చేసిన నలుగురిలో శుక్లా ఒకరు. ఆయన ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జన్మించారు. చదువుల్లో దిట్ట, ఏకసంథాగ్రాహి. 2005లో నేషనల్ డిఫెన్స్ అకాడమీలో కంప్యూటర్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ చేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో శిక్షణను పూర్తి చేసి వైమానిక దళంలో ఫైటర్ విమానాలకు పైలట్‌గా చేరారు.**

డోర్నియర్, హాక్, మిగ్–21, మిగ్–29, తదితర యుద్ధ విమానాలను నడిపారు. భారతీయ వైమానిక దళం ఆధ్వర్యంలో పని చేసే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్‌లో చేరారు. ఆ సంస్థ అంతరిక్ష యాత్రికుల బృందానికి శుక్లాను ఎంపిక చేసింది. ఆయన 2020 నుంచి 2021 మధ్యకాలంలో రష్యాలోని యూరీ గగారిన్ అంతరిక్ష పరిశోధన సంస్థలో శిక్షణ పొందారు. ఆ తర్వాత బెంగళూరు వచ్చి అక్కడి అంతరిక్ష యాత్రికుల శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ కాలంలోనే ఆయన బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో టెక్నాలజీలో మాస్టర్స్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 27, 2024న తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌ను సందర్శించారు. ఆ సందర్భంగా గగన్‌యాన్ కార్యక్రమానికి వెళ్లేవారి పేర్లను ప్రకటించారు. వారిలో శుభాంశు శుక్లా పేరు మొదటి స్థానంలో ఉండడం విశేషం.

**అంతర్జాతీయ స్థాయి ఎంపిక**

అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కార్యక్రమం కింద నాసా చేపట్టిన నలుగురు సభ్యుల ఆక్సియమ్ మిషన్‌కు కూడా శుక్లా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమం కోసం అమెరికా దేశంలోని హ్యూస్టన్ నగరంలో ఉన్న నాసా జాన్సన్స్ స్పేస్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ పొందారు. అంతర్జాతీయంగా అంతరిక్ష పరిశోధన కార్యక్రమాన్ని పటిష్టం చేయడానికి పరస్పరం సహకరించుకోవాలన్న ఉద్దేశంతో నాసా, ఇస్రో, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ కలిసి చేపట్టిన ఆక్సియమ్ మిషన్ విజయవంతమైన పక్షంలో శుక్లా అంతరిక్ష యాత్రికుడుగా, పరిశోధకుడిగా గుర్తింపు పొందుతారు. రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన రెండవ భారతీయుడుగా నిలుస్తారు. ఈ అంతరిక్ష యాత్రలో శుక్లాకు మాత్రమే అయ్యే ఖర్చు సుమారు 500 కోట్ల రూపాయలు.




**పాఠశాల సహవిద్యార్థినితో ప్రేమ వివాహం**

స్కూల్లో తనకు సహ విద్యార్థి అయిన కామ్నా మిశ్రాను ఆయన ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆమె దంత వైద్యురాలు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. ఆయన తండ్రి శంభు దయాళ్ శుక్లా ప్రభుత్వోద్యోగి. తల్లి ఆశా శుక్లా సాధారణ గృహిణి. ఆయనకు ఇద్దరు అక్కలున్నారు. శుభాంశు శుక్లా తనకు సమయం దొరికినప్పుడల్లా కొద్దిగా వ్యాయామం చేయడమో, సైన్స్ సంబంధమైన పుస్తకాలను చదవడమో చేస్తుంటారు. అంతరిక్ష పరిశోధనలో, ఖగోళ శాస్త్ర విజ్ఞానంలో నిష్ణాతుడైన ఆయన ఓ హేతువాది. అంతరిక్ష ఫోటోగ్రఫీలో సిద్ధహస్తుడు. విచిత్రంగా, జ్యోతిష శాస్త్ర గ్రంథాలను కూడా చదువుతుంటారు.

**అంతరిక్షంలో వ్యవసాయం**

ఈ ఆక్సియమ్ మిషన్ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహక సంస్థలు శుభాంశు శుక్లాకు కొన్ని ప్రత్యేక బాధ్యతలు అప్పగించాయి. ఈ అంతరిక్ష యాత్ర సందర్భంగా ఆయన రోదసిలో, అతి తక్కువ భూమ్యాకర్షణ శక్తిలో, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం–ఐఎస్ఎస్‌లో మెంతులు, పెసలు, మరి కొన్ని మొక్కలను పెంచాల్సి ఉంటుంది. అంటే, ఆయన రోదసిలో వ్యవసాయం చేస్తారన్న మాట. దీర్ఘకాలం పాటు రోదసిలో గడపాల్సిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు అంతరిక్షంలో తమకు కావలసిన నిత్యావసరాలను పండించుకోవడానికి ఉన్న అవకాశాలను ఆయన ప్రయోగాత్మకంగా పరిశీలిస్తారు. భవిష్యత్తులో భారతీయులు చేపట్టే అంతరిక్ష యాత్రలకు, పరిశోధనలకు ఈ రోదసి వ్యవసాయం ఎంతగానో ఉపకరించే అవకాశం ఉంది. అక్కడ ఆయన పండించే వాటిలో పోషకాలతో పాటు ఔషధ గుణాలు కూడా ఉంటాయి. రోదసిలో పెంచిన మొక్కలను భూమి మీదకు తీసుకువచ్చి, వాటిలో జన్యుపరంగా చోటు చేసుకున్న మార్పులను, చేర్పులను కూడా అధ్యయనం చేయాలని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

శుభాంశు శుక్లాతో పాటు ఈ ఆక్సియమ్ మిషన్‌లో వెళ్లే యాత్రికుల బృందంలో అమెరికా, పోలెండ్, హంగరీ అంతరిక్ష పరిశోధకులున్నారు. ఇది అనేక విధాలుగా రోదసీ పరిశోధనలను మలుపు తిప్పనుంది. ఈ నేపథ్యంలో శుభాంశు శుక్లా యాత్ర విజయవంతం కావాలని, భారత్ అంతరిక్ష రంగంలో సరికొత్త శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షిద్దాం.



**జి.రాజశుక**
సీనియర్ జర్నలిస్ట్

# పుణ్యప్రదా

**తొలి ఏకాదశి నుంచి దక్షిణాయనం, అందులో సనాతన ధర్మంలోని పండుగలు, పర్వదినాల సమాహారం ప్రారంభమవుతుంది. ఈ తిథి నుంచి కార్తిక శుద్ధ ఏకాదశి వరకు శ్రీ మహా విష్ణువు పాలకడలిలో శేషశయ్యపై యోగనిద్రలో ఉంటాడని విష్ణుపురాణం పేర్కొంది. ఇప్పటివరకు ఉత్తర దిక్కుగా ప్రయాణించిన సూర్యుడు, ఆ రోజు నుంచి దక్షిణ దిక్కును అనుసరిస్తాడు. పూర్వకాలంలో ఈ రోజునే సంవత్సరారంభంగా పరిగణించే వారట. ఈ నాలుగు నెలల పాటు వాతావరణంలో మార్పులు అధికంగా సంభవిస్తాయి కనుక, ఆరోగ్య పరిరక్షణ నియమాలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.**

మురాసురుడు అనే రాక్షసుడితో యుద్ధంలో అలసిన శ్రీహరి పాలకడలిలో శేషశయ్యపై శయనిస్తాడు. ఆయన యోగనిద్రను అదునుగా భావించిన దానవులు దేవతలపై విజృంభించారు. పురాణగాథను బట్టి, భీతితో వైకుంఠధామానికి చేరిన సురులను కాపాడేందుకు భగవానుడి శరీరం నుంచి ఉద్భవించిన 'సత్త్వశక్తి ' దానవుల దాష్టీకాన్ని కట్టడి చేసింది. మేల్కొన్న పరంధాముడు ఆ శక్తికి 'ఏకాదశి' అని పేరు పెట్టాడు. ఆమె వీరోచిత పోరాటానికి సంతసించిన స్వామి మూడు వరాలు అనుగ్రహిం చాడు. ఎల్లకాలం హరికి ప్రియమైనదిగా ఉండడం (హరిప్రియ), ఏకాదశికి సర్వ తిథుల్లో ప్రాధాన్యం దక్కి లోకం శిరోధార్యంగా భావించడం (పుణ్యతిథి), ఆనాడు ఉపాసనతో విధులు నిర్వర్తించే వారికి ముక్తి లభించడం (మోక్ష ఏకాదశి). 'వ్రతోత్సం చంద్రిక' ఈ తిథిని 'మహా ఏకాదశి'గా అభివర్ణించింది. దశమితో కూడి ఉన్న ఏకాదశి వ్రతానికి, ఉపవాసానికి పనికిరాదని, ద్వాదశితో కలసి ఉన్న ఏకాదశి భగవంతుడి సాన్నిధ్యాన్ని కలిగి ఉంటుందని, ఆ రోజునే ఏకాదశి వ్రతాన్ని ఆచరించాలన్నది శాస్త్ర వచనం.

ఇతర వ్రతాలను కోర్కెలు సిద్ధించేందుకు ఆచరిస్తుండగా, ఈ ఏకాదశి పరమార్థం మోక్షమే కనుక 'మోక్ష ఏకాదశి' అంటారు. మహావిష్ణువు యోగ నిద్ర నుంచే భక్తులను గమనిస్తూ ఉంటాడు. ఆయన ప్రీతి కోసం ఈ నాలుగు నెలలు వ్రతాదులు నిర్వహిస్తారు. 'సుప్తే త్వయి జగన్నాథ! జతత్సుప్తం భవేదిదం/విబుద్ధే చ విశుద్ధ్యేత ప్రసన్నో మే భవాచ్యుత/ ఇదం వ్రతం మయా దేవ గృహీతం పురతస్తవ/ నిర్విఘ్నం సిద్ధిమయాతు ప్రసాదాత్ తవ కేశవ...' అనే ప్రార్థనతో వ్రతాన్ని ఆరంభించాలి. ఈ వ్రత ఆచరణతో దేహశుద్ధి, కార్యసిద్ధితో పాటు వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని పురాణవచనం. తన రాజ్యంలో అనావృష్టి నెలకొన్నప్పుడు మాంధత చేసిన 'శయనైక ఏకాదశి' వ్రత ఫలితంగా వర్షాలు కురిసి పరిస్థితి చక్కబడిందని గాథలు చెపుతున్నాయి. సూర్యవంశ చక్రవర్తి, సత్యసంధుడు మాంధాత, సతీ సక్కుబాయి ఈ శయన ఏకాదశి నాడే మోక్ష ప్రాప్తి పొందారట. సాధువులు, భక్తజనులు 'ఏకాదశి' వ్రతం ఆచరించి విష్ణు సాయుజ్యం పొందినట్లు పురాణాలు చెబుతున్నాయి. అంబరీషుడు, మాంధాత, తదితర పురాణ పురుషులు ఏకాదశి వ్రతాన్ని ఆచరించారు.

* * *

శ్రీ మహావిష్ణువు యోగనిద్ర కాలంలో యతీశ్వరులు చాతుర్మాస్య దీక్షను ఆచరిస్తారు. గ్రామ పొలిమేర దాటకుండా ఒకేచోట నాలుగు నెలలు ఉండడాన్ని చాతుర్మాస్య వ్రతం అంటారు. నిష్ఠతో తపస్సు, అనుష్ఠానం, వేదాంత అధ్యయనం , ధార్మిక చింతనతో ఈ దీక్ష సాగుతుంది. యతి/సన్యాసి ఏ గ్రామంలోనూ ఒక్క రాత్రికి మించి ఉండకూడదనేది నియమం. అయితే వారి శిష్యుల ద్వారా చేపట్టే దీక్షకు మినహాయింపు ఉంటుంది. తమ గృహంలో ఈ దీక్షను చేపట్టాలన్న శిష్యుని విన్నపాన్ని గురువు మన్నిస్తాడు. శిష్యుడు ఆయనకు శుశ్రూష చేస్తూ ధన్యత పొందినట్లు భావిస్తాడు. దీక్ష ప్రారంభానికి ఏకాదశినాడు వీలు కుదరని వారు మరుసటి తిథి (ద్వాదశి)నాడు లేదా పౌర్ణమి నాడు ఆరంభిస్తారు.

# గురుశిష్య బంధంలో



**భారతీయ సంస్కృతిలో గురుపరంపర అనాదిగా సాగుతూనే ఉంది. గురువును దైవంగా ఆరాధించడం మన దేశ తరతరాల సంప్రదాయం. గురువంటే దార్శనికుడు, పథ నిర్దేశకుడు. లౌకిక జ్ఞానాన్ని భగవత్ శ్శక్తితో అనుసంధానించ కలిగినవాడు. గురువు అంటే కేవలం జ్ఞాన ప్రదాతే కాదు సమర్పణ, త్యాగభావం కలవారు. వృత్తాసుర సంహారానికి అవసరమైన వజ్రాయుధం రూపొందడానికి తన వెన్నెముకను సమర్పించిన దధీచి త్యాగధనుడు.**

జ్ఞానం ప్రచులితమయ్యే చోట గురు దర్శనం అవుతుందని వ్యాస భగవానుడి మాటగా చెబుతారు. పవిత్రాత్మగల గురువులు ఉన్న చోట సర్వ దేవతలు సంచరిస్తుంటారని శాస్త్రవాక్యం. అలాంటి గొప్ప గురువుల ప్రస్తావన పురాణాల్లో, చరిత్రలో కనిపిస్తుంది. కనుకనే అవతార పురుషుల నుంచి కారణజన్ముల దాకా గురుసన్నిధిలో సామాన్యులుగా ప్రవర్తిల్లారు. శిష్యులు గణనీయం గానే ఉంటారు. వారిలో గురుభక్తులు, గురువు పట్ల గురి కలవారు అరుదనే చెప్పాలి.

గురుశిష్య పరంపర వేదకాలం నుంచే ఉండేది. నాటి గురువులు వేదవిద్యను మౌఖికంగా నేర్పేవారు. వారి ఆధ్వర్యంలో నడిచే గురుకులాల్లో రాజు-పేద తేడా లేకుండా అన్ని వర్గాల పిల్లలకు బోధన ఒకే రీతిన ఉండేది. అందుకు శ్రీకృష్ణ కుచేలుదు, ప్రహ్లాద ఇతర దానవ కుమారులే ఉదాహరణ. గురుశిష్యుల అనుబంధానికి సంబంధించిన అనేక గాథలు మన పురాణాల్లో, ఆధ్యాత్మిక గురువుల చరిత్రల్లోనూ కనిపిస్తాయి.

గురుత్వం అంటే ఒక వ్యక్తి రూపం కళ్లలో మెదలినా అందుకే పరిమితం కాదు. ఒక మహాపురుషుడు, ప్రవక్త, ఒక సిద్ధాంతం, ఒక స్ఫూర్తి చిహ్నం, ఒక ప్రతీకం...ఇలా మార్గనిర్దేశనం చేయవచ్చు. ఏకలవ్యుడికి ద్రోణుడు మట్టి బొమ్మగా, శ్రీకృష్ణుడు అర్జునుడికి మిత్రుడిగా, ఆదిశంకరులకు ఎదురైన పరమేశ్వరుడు చండాలుడిగా, లీలా శు కునికి తండ్రి అయిన వ్యాసునిలా, మైత్రేయికి భర్త అయిన యాజ్ఞవల్క్యుడిగా... ఇలా ఏ రూపంలోనైనా ప్రబోధించవచ్చు.



# యిని తొలి ఏకాదశి

('తేనాషాఢ శుక్లైకాదశ్యాం, పౌర్ణమాస్యాంవో ఆరంభః ప్రతివర్షంచ యః కుర్యాదేవం వై సంస్మరన్ హరిమ్'–స్మృతికౌస్తుభం). వాస్తవానికి అన్ని వర్గాలు, చతుర్విధ ఆశ్రమాల వారు ఈ దీక్షను పాటించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. 'కాలమాన పరిస్థితులను బట్టి అందరు ఈ దీక్షను చేయలేకపోవచ్చు. అందుకు బదులుగా దానాది కార్యాలను నిర్వహించడం; దీక్షాపరులు, యతీశ్వరుల, సత్పురుషులతో సాంగత్యంతో అంతకు సమానమైన ఫలాన్ని పొందవచ్చు' అని చెబుతారు. దీక్ష ఎప్పుడు ప్రారంభమైనా కార్తిక శుద్ధ ద్వాదశి నాడే ముగుస్తుంది.

ఈ కాలంలో ఆహార కట్టుబాట్లను అత్యంత ప్రధానంగా చెబుతారు. ఈ నాలుగు నెలలు వర్షాలు కురుస్తూ వాతావరణంలో మార్పులు, వ్యాధి కారక సూక్ష్మక్రిములు వ్యాప్తికి అవకాశం ఉన్నందున, చాతుర్మాస్య వ్రతం పాటించే వారు ఆహార విహారాది నియమాలు పాటించాలని ఆధ్యాత్మిక నిపుణులు సూచిస్తున్నారు. ఈ కాలంలో పేలపు పిండిని తరచూ ఆహారంగా తీసుకుంటారు. ఇందులో ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్య కోణమూ ఇమిడి ఉంది. పేలాల పిండి పితృదేవతలకు ఎంతో ఇష్టమని చెబుతారు. వారి పేరిట నివేదించిన దానిని ప్రసాదంగా తీసుకుంటారు. ఆరోగ్య పరంగా చూస్తే...వర్ష రుతువు ప్రారంభమయ్యే కాలంలో ఉష్ణోగ్రతలను బట్టి శరీరం మార్పులకు లోనవుతుంది. ఈ సమయంలో శరీరానికి పేలాల పిండి వేడిని కలిగిస్తుంది. 'స్వామి కార్యం... స్వకార్యం' అన్నట్లు ఈ తిథినాడు దేవాలయాల్లోనూ, ఇళ్ల వద్దా పేలాల పిండిని ప్రసాదంగా పంచుతారు. ఎలా చూసినా మానవాళి ఆరోగ్య పరిరక్షణకు ఈ ఈ వ్రతదీక్ష ఉత్తమమైనదని పురాణ వాఙ్మయం పేర్కొంటోంది.

పేలాల పిండి పితృదేవతలకు ఎంతో ఇష్టమని చెబుతారు. పూర్వీకులను స్మరించుకుంటూ వారికి నివేదించి , వారి పేరుతో ప్రసాదంగా తీసుకుంటారు. ప్రతి ఆధ్యాత్మిక అంశం వెనుక శాస్త్రీయ కోణం దాగి ఉంటుంది. పేలాల పిండి భుజించడమూ అలాంటిదే. గ్రీష్మ రుతువు ముగిసిన తర్వాత వర్ష రుతువు ప్రారంభమయ్యే కాలం. ఆరోగ్యపరంగానూ, ఉష్ణోగ్రతలను బట్టి శరీరం మార్పులకు లోనవుతుంది. ఈ సమయంలో శరీరానికి పేలాల పిండి వేడిని కలిగిస్తుంది. 'స్వామి కార్యం... స్వకార్యం' అన్నట్లు ఈ తిథినాడు దేవాలయాల్లోనూ, ఇళ్ల వద్దా పేలాల పిండిని ప్రసాదంగా పంచుతారు.



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్

# దివ్యానుభూతి

రామకృష్ణుల వంటి అవతార పురుషులు, ప్రహ్లాద, ఆదిశంకర రామానుజ,మధ్వాచార్యుల వంటి కారణజన్ములు గురుస్థానానికి ఎంతో విలువ ఇచ్చి తరించారు. గురు సంప్రదాయానికి సదాశివుడు (దక్షిణామూర్తి) మూల పురుషుడు. విశ్వామిత్ర, వశిష్ఠుల వద్ద రామలక్ష్మణులు, సాందీపుని వద్ద బలరామకృష్ణులు, పరుశురాముని వద్ద భీష్ముడు, ద్రోణుని వద్ద అర్జునుడు, గోవిందాచార్యుల వద్ద ఆదిశంకరులు, పంచాచార్యుల వద్ద రామానుజుడు, రామకృష్ణ పరమహంస వద్ద వివేకానందుడు..ఇలా ఎందరో గురుకృపతో ధన్యులయ్యారు.

శ్రీరామచంద్రుడు గురువు వశిష్ఠుని పాదతీర్థం సేవించి శిరస్సున చల్లుకొని దివ్యబోధనను (యోగ వాశిష్ఠం) ఆలకించాడు. భావి గీతాశాస్త్ర ప్రవచకుడు, జగద్గురువు కృష్ణ పరమాత్మ సాందీపమునికి శుశ్రూష చేసి చదువు నేర్చాడు. ప్రహ్లాదుడు 'చదివించిరి నను గురువులు...' అంటూ చదువుల సారాన్ని ఏకరవు పెట్టాడు. సృష్టిలోని ఇరవై నాలుగు జీవులు తన గురువులని అనసూయాత్రి పుత్రుడు శ్రీ దత్తుడు వ్యాఖ్యానించి, జ్ఞానబోధ చేశాడు. గురు నామాన్ని మనసులో స్మరించినంతనే అనేక ప్రయోజనాలు చేకూరతాయి. ఏకలవ్యుడు ద్రోణాచార్యుడి ప్రతిమను పూజించి సర్వ విద్యలను నేర్చుకొన్న సంగతి తెలిసిందే. గురువు, గోవిందుడు ఎదుట నిలిచినపుడు గురువుకే ప్రణామం చేస్తానని, గురువు ద్వారానే భగవంతుడిని దర్శించాను అంటారు కబీరు. శొంఠి వెంకట రమణయ్య వద్ద సంగీత విద్యను అభ్యసించిన త్యాగరాజు 'గురులేక ఎటువంటి గురిణి తెలియగ బోదు' అన్నారు.

మన దేశాన్ని ఏలిన చాలా మంది రాజులు, మహనీయులకు వారి గురువుల నుంచి ఉత్తమ సంస్కారం లభించింది. ఒక సద్గురువు నుంచి ఉపదేశాన్ని పొంది జీవితానికి ఒక లక్ష్యాన్ని, ఒక మార్గాన్ని ఏర్పరచుకోవడం హిందూజీవన విధానంలో ప్రత్యేకత. ఈశ్వరాంశగా మన్నన అందుకుంటున్న ఆదిశంకరాచార్యులు గురువు గోవిందాచార్యులు, ఆయన (గోవిందాచార్యులు)తమ గురువు గౌడ పాదులు వద్ద సకల శాస్త్రాలు అభ్యసించారు. ముస్లింలు పరమపవిత్రంగా భావించే ఖురాన్ కానీ, ముస్లిం మహిళలు కాని తన కంటబడితే గ్రంథాన్ని కాపాడి, ఆ మహిళలను సురక్షితంగా గమ్యం చేర్పించే వాడు. 'నాకు శరీరాన్ని ఇచ్చిన తండ్రికి రుణపడి ఉన్నాను.

అయితే సరైన విధంగా జ్ఞానాన్ని ప్రసాదించిన నా గురువుకు ఇంకా రుణపడి ఉన్నాను' అని అలెగ్జాండర్ తన గురువు అరిస్టాటిల్‌ను ఉద్దేశించి అన్నాడు. మొరటు యోధుడిగా పేరు పొందిన అలెగ్జాండర్ తన విజయయాత్ర సందర్భంగా తారసిల్లిన కట్టడాలు, శిల్పాలు, తదితర నిర్మాణాలను ధ్వంసం చేయకపోవడానికి గురుబోధనల వల్ల అబ్బిన సంస్కారం కావచ్చని విశ్లేషకులు అంటారు. వర్తమాన సమాజంలో గురుశిష్య సంబంధాల విషయంలో కొన్ని పెడ పోకడలు కనిపిస్తున్నా వారి మధ్య అనుబంధం భవ్యమైనది. ★



సుగుణమణి

# 'వర'

లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్

ఏమిటిది? ఓ సంస్థ. ఎప్పటిది? ఎనిమిదిన్నర దశాబ్దాల నాటిది. వ్యవస్థాపకులు ఎవరు? సుగుణమణి. ఎవరు ఆమె? సమాజసేవిక. సంఘానికి సేవ చేయాలన్న గట్టి సంకల్పంతో ఆ సంస్థను ప్రారంభించారు. ఇదే సంస్థ వ్యవస్థీకృత రూపు 'ఆంధ్ర మహిళాసభ'. అలా అనగానే దుర్గాబాయి దేశ్‌ముఖ్ తలపులోకి వస్తారు. దుర్గాబాయి, సుగుణమణి.. ఇద్దరిదీ నాయిక, అనుచర అనుబంధం. గురుశిష్యానుబంధమూ. ఈ ఉభయులనీ గుర్తు చేసుకోవాల్సిన సందర్భాలు ఇదే జులైలో! స్వాతంత్ర్య సాధనకు ఉద్యమించిన మహనీయ ఒకరు, వనితా జాగృతి మీద చూపు కేంద్రీకరించిన వారు మరొకరు.

దుర్గాబాయికి 'సోషల్ సర్వీస్' మదర్ పేరు. ఆమె జననం రాజమహేంద్రవరం ప్రాంతంలో. చిన్నప్పటి నుంచీ అద్భుత ప్రతిభ, వయసు పెరిగినకొద్దీ విస్తరించిన దక్షత. చదువు అంటే ఎంతో ఇష్టం. ఎంత అంటే– తనకు తానుగా బాలలను చేరదీసి బోధన చేసేంతగా! రాజనీతిశాస్త్రంలో పోస్టుగ్రాడ్యుయేట్. న్యాయవిద్యలో సైతం ఉన్నతస్థాయి పట్టా స్వీకారం. సుగుణమణిలోనూ ఆమె మాదిరే ప్రతిభా సామర్థ్యాలు విస్తారమయ్యాయి. ఆమె స్వస్థలం కాకినాడ. సోదరీ సోదరుల ప్రేమానుబంధం మధ్య అపురూపంగా కొనసాగింది ఆమె బాల్యమంతా.

మహారాజా కళాశాలలో డిగ్రీ చదువుకున్నారు. తనకు కూడా న్యాయశాస్త్ర సంబంధ అంశాలంటే మక్కువ ఎక్కువ. తోటివారికి ఏదో విధంగా అండగా నిలవాలన్న సేవాభావనా అధికమే.

దుర్గాబాయి పన్నెండేళ్ల ప్రాయంలోనే భారత స్వాతంత్ర్య సమరయాత్రలో భాగస్వామిని అయ్యారు. విరాళాల సమీకరణలో పాల్గొన్నారు. అలా సేకరించిన వాటిని మహాత్మునికి అందజేశారు. తన చేతులకు ఉన్న బంగారు గాజులను ఉద్యమ విరాళంగా అందించారామె. కాకినాడలో ఉద్యమ సభలు జరిగితే, క్రియాశీల కార్యకర్తగా అపార సేవలందించారు. గాంధీజీ హిందీ ప్రసంగాలను తెలుగులోకి అనువదించినవారు దుర్గాబాయే! ధాటి స్వరం ఆమెది.

నియమ, నిబంధనలను తు.చ.తప్పక పాటించారు. వాటి అతిక్రమణను ఏ దశలోనూ భరించేవారు కారు. ఆ నిర్భయత, ప్రస్ఫుట మూర్తిమత్త్వమే జాతీయ నాయకుల దృష్టికి వెళ్లింది. వారు మరీ మరీ ప్రశంసించారు. ఉప్పు సత్యాగ్రహంలో ముందు వరసన నిలిచారు. చెరసాల జీవితం గడిపారు. 'ఉంటే ఉద్యమంలో లేదంటే విద్యా బోధనలో'– ఇదీ ఆమె ఏకైక లక్ష్యం, లక్షణం. న్యాయవాదంలో అందెవేసిన చెయ్యి.

ఇదే విధంగా దుర్గాబాయి శిష్యురాలు సుగుణమణికీ ఉద్యమ నేపథ్యముంది. అది సమాజసేవోద్యమం. అందులోనే ఆమె మమేకమయ్యారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితుల సేవకు ముందడుగు వేశారు. తనూ విరాళాలనేకం సమీకరించారు, సమీకరింపచేశారు. ఇంటింటికీ వెళ్లి, విపత్తులవల్ల బాధితులైన వారి గురించి వివరించి, 'సాటివారు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవాల్సిన బాధ్యత మనకు లేదా' అని సూటిగా ప్రశ్నించేవారు. వస్తు, ధన రూపేణ సేకరించిన అన్నింటినీ తన కళాశాల యాజమాన్యానికి అప్పగించారు సుగుణమణి. అంటే, విద్యార్థి దశ నుంచే ఆమెలోని సమాజసేవానురక్తి అంతటిది.

మాటలు, రాతలు, చేతల్లోనూ మిన్న ఆమె. ఎన్నెన్నో రచనలు చేశారనడానికి అప్పటి 'గృహలక్ష్మి' పత్రికే సాక్ష్యం. అదే విధంగా 'భారతి'లోనూ వ్యాసాల పరంపర. ఆమె కేవలం ప్రసంగాలు, రచనలకే పరిమితం కాలేదు. ఆచరణ లో పెట్టారు. అందులో భాగంగానే 'లిటిల్ లేడీస్' సంస్థాపన! బాలల భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దడమే ప్రధాన ఉద్దేశం.




అందుకోసం ఎన్నెన్నో ప్రణాళికలు. మరికొంతకాలం అయ్యాక, భర్త ఉద్యోగ కారణంగా ఆమె మకాం ఢిల్లీకి మారింది. అక్కడ ఉన్నన్నాళ్లూ సేవ, సహాయ, సహకారం అనే మూడు బాధ్యతలనీ చక్కగా నిర్వహించారు. అందుకు ప్రచార సాధనాలను ఎంచుకున్నారు. ఆ ప్రధాన సాధనమే – ఆకాశవాణి. అంటే ఆమె మొదటి తెలుగు ప్రసంగం దేశ రాజధాని నుంచి అన్న మాట. ఇంకొంత కాలానికి భర్త బదిలీతో మకాం మద్రాసుకు మారింది. సరిగ్గా అప్పుడే అక్కడ దుర్గాబాయమ్మ సందర్శన భాగ్యం! అప్పటికే దుర్గాబాయి పలు సేవా కార్యక్రమాల్లో తలమునకలై ఉన్నారు. అప్పటివరకూ తన నిర్వహణలో ఉంటూ వచ్చిన మాస పత్రిక 'ఆంధ్రమహిళ'ను నడిపే కర్తవ్యాన్ని సుగుణమణికి అప్పగించారు. ఆ సంవత్సరం 1943. అంటే – ఇప్పటికే ఎనిమిది దశాబ్దాల కిందటి జ్ఞాపకం. స్త్రీల కోసం స్త్రీలే స్థాపించి, నిర్వహించి, పర్యవేక్షించిన సంస్థగా అది సుప్రసిద్ధం. అలా 'ఆంధ్రమహిళ– సుగుణమణి' అనే అవినాభావ సంబంధం ఏర్పడింది. ఆ సమయంలో ప్రముఖ సమరయోధులతో పరిచయం ఏర్పడింది.

వేగంగా విస్తరించింది. 'రచనలు చేయడం, సేవల పనులు సాగించడం'అనేది అలవాటుగా మారింది.

***భారతీయ నరనారీ భావాంకిత జయస్ఫూర్తి***
***భవ్యదీక్ష నా జాతికి... భాగ్యరక్ష నా జాతికి!***
***ఔన్నత్యం నా భావం – ఔజ్జ్వల్యం నా జీవం***
***చైతన్యం నా రూపం – స్వాతంత్ర్యం నా ప్రాణం!***

ఇదే ధ్యేయంగా ఆనాడు సాగింది దుర్గాబాయి, సుగుణమణిల ఉద్యమ సరళి.



దుర్గాబాయి

# పుత్రికలు

ఇరువురూ కలసి విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆ రోజుల్లో 'కస్తూరిబా నిధి'ని ఉండేది. ఆ మహోన్నత వనితకు గుర్తుగా రూపొందిన ట్రస్టు. ఆ నిధులతోనే గ్రామ ప్రాంతాల్లోని స్త్రీలు, పిల్లల యోగక్షేమాల కోసం కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల స్థాపన జరిగేది. సూక్ష్మంగా చెప్పాలంటే – కేజీబీవీ. అందరికీ విద్య అందించడం పరమోద్దేశం. చదువుతోనే చైతన్యం, ప్రశ్నించే తత్వం, పెంపొందుతాయి కదా మరి.

ఆ ఇద్దరి నాయకత్వంలో సమీకరించి తెచ్చిన మొత్తం ఎంతో తెలుసా? అప్పట్లోనే అక్షరాలా ఆరు లక్షల రూపాయలు! ఇప్పటి లెక్కల్లో కోట్ల రూపాయలకు పై మాటే. అలా సేకరించిన నిధులతో ఊరువాడా పర్యటించారు ఇరువురూ. కస్తూరిబా సేవా సంఘాలను విరివిగా స్థాపించారు. వాటిల్లో సేవికలను నియమించారు.

సేవికలంటే – సంఘసేవా పరాయణులు. సహాయమే జీవితంగా గల వనితామతల్లులు. ఉభయ నేతల చిత్తశుద్ధి, సంకల్పదీక్షకు అన్ని విధాలా దోహద పడింది 'ఆంధ్రమహిళ' పత్రికే! ఒకరిగా మాలతీ చందూర్ ఉండేవారు. తెలుసు కదా? తెలుగు వారందరికీ సుపరిచితురాలు. మూడు దశాబ్దాలకు పైగా సారస్వత, సమాజసేవిక. సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత. అతివ జీవితాంశాలతో నవలలు వెలయించిన పరిణత మనస్కురాలు. వందలాది పుస్తక సమీక్షలు చేసినవారు. అటువంటి ప్రజ్ఞానిధుల సమన్వయంతో ముందుకు నడిచారు, నడిపించారు దుర్గాబాయమ్మ, సుగుణమణమ్మ. రచనల్లో, సమాజ సేవల పనుల్లో ఇద్దరూ ఇద్దరే. న్యాయం, స్వాతంత్ర్యం, పడతుల పురోగమనాన్ని మనసా వాచా కర్మణా కోరుకున్నవారు. వనితావిద్య, సాధికారత – ఈ రెండూ ఆ ఇద్దరి ప్రధాన ఆశయాలు. క్రియాశీలతకు ఏకైక చిరునామా ఆ ఇద్దరిదే.

ఆంధ్ర మహిళసభ భాగ్యనగరంలో ఆరంభమైంది 1957లో. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దానికి. నగరానికి వచ్చి ప్రారంభించినవారు సుగుణమణే! మహిళసభను నెలకొల్పిన కొత్తలో దుర్గాబాయి, సుగుణమణి ఎన్నెన్నో వ్యయప్రయాసలు భరించారు. ఎన్నోచోట్ల పర్యటించారు, ఎంతో మందితో సంభాషించారు, అనేకమందికి వివరించి చెప్పి వనితాభ్యుదయాన్ని సాకారానికి తేగలిగారు వారు.

ANDHRA MAHILA SABHA COLLEGE OF LAW FOR WOMEN

ఆంధ్ర మహిళాసభ తమిళ, తెలుగు ప్రాంతాలన్నింటా ప్రత్యేకత నిలబెట్టుకుంటూ వస్తోంది. బాలానంద సంఘం పేరు ఎంతోమంది వినే ఉంటారు. ఆ సంఘానికి తొలి నేతృత్వం వహించిందీ సుగుణమణి దీక్షాదక్షతలే. ఆ ప్రజ్ఞావంతురాలి సంస్మృతి జులై ఐదోతేదీన. సేవాసంస్థ రామకృష్ణ మఠం నుంచి జీవన సాఫల్యం పురస్కారాన్ని ఆమెకు ప్రకటించి ఇప్పటికి సరిగ్గా పాతికేళ్లు! అంటే రజతోత్సవ సందర్భమన్న మాట. ఎంతగానో అభినందనీయం.

గురుశిష్య బంధానికి ప్రతీకలు దుర్గాబాయి, సుగుణమణి. వీరు ప్రాతఃస్మరణీయులు. సదా ఆదర్శచరితులు. వీరి జీవితాలు ఫలప్రదాలు.



**జంధ్యాల శరత్‌బాబు**
**సీనియర్ జర్నలిస్ట్**



## పాత్రికేయుల ఆత్మీయ సమావేశం

**నంద్యాల :** దేవర్షి నారద జయంతి సందర్భంగా సాహితీ సుధా ఫౌండేషన్, విహెచ్‌పి ఆధ్వర్యంలో జూన్ 24న నంద్యాలలో జరిగిన పాత్రికేయుల ఆత్మీయ సమావేశంలో సమాజ చైతన్యానికి, అభివృద్ధికి పాటుపడుతున్న పాత్రికేయులను సన్మానించారు. నంద్యాల జిల్లా సంఘచాలక్ చిలుకూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యావేత్తలు రామకృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ విభాగ్ సహ కార్యవాహ రామాంజనేయులు, జిల్లా సహ ప్రచార ప్రముఖ్ శ్రీనివాసులు, పాత్రికేయులు పాల్గొన్నారు.




'పందొమ్మిదవ శతాబ్దిన విలసిల్లిన ప్రసిద్ధ పండితులలో పరవస్తు చిన్నయసూరి ప్రథమగణ్యుడు. ఈతడు రచించిన గ్రంథములలో బాలవ్యాకరణమును, నీతి చంద్రికయు ఇంచుమించుగ నూరేండ్ల నుండి అన్ని పాఠశాలల్లోను నియతముగా బఠనీయ గ్రంథములై పండిత లోకమున ప్రామాణికములైనవి. ఆంధ్ర దేశమంతటను నధిక వ్యాప్తినందినవి. అక్షరాస్యులైన తెలుగువారిలో నీతిచంద్రిక చదవని నేటి విద్యార్థి కాని, బాల వ్యాకరణమునెరుగని పండితుడు గాని లేడని చెప్పుట సత్యోక్తియే గాని అతిశయోక్తి కాదు. ప్రాచీనకాలమున వచన రచనకు వ్యాకరణ రచనకు నన్నయ్య వలె, నవీన కాలంలోనీ రెండింటికిని చిన్నయ సూరి మార్గదర్శకుడు.' ('తత్త్వబోధిని',1866)

# జాతిపై నీతి

తత్త్వబోధిని పత్రిక ఇచ్చిన ఇంకొన్ని విశేషాలు చిన్నయసూరి ఘనతను వెల్లడిస్తున్నాయి. చెన్నపురి పాఠశాలలో ఉపయుక్త గ్రంథకరణ సభ (The Madras School Book and Vernacular Society) కు సూరి అధ్యక్షుడయ్యాడని కూడా ఆ పత్రిక ప్రకటించింది. ఇంకా– పందొమ్మిదవ శతాబ్దం ఆరంభంలో ఆంగ్లేయుల పరిపాలనతో ఆంధ్రసారస్వతంలో నూతన అధ్యాయం ఒకటి ఏర్పడిందనీ, పాశ్చాత్యులు పరభాషను తెలుగును నేర్చుకొనడానికి సులభమైన పద్ధతులు అవలవంభించడం వల్ల వ్యవహారిక భాషకే గాని, గ్రాంథిక భాషకు ఆస్కారం లేకపోయిందని తత్త్వబోధిని విశ్లేషించింది. ఆంధ్ర వాఙ్మయ ప్రపంచంలో అజరామరం, ఆచంద్రార్కము అయిన యశస్సు సంపాదించిన నన్నయాదికవులతో సరితూగదగిన వాడు ఇతడొక్కడే అని చెప్పింది. చిన్నయసూరి దుందుభినామ సంవత్సరంలో కీర్తిశేషుడైనాడు. వాఙ్మయ ప్రపంచంలో ఆయన యశోదుందుభి నేటికిని, రేపటికిని మారుమోగుతూనే ఉంటుందని కూడా జోస్యం చెప్పింది. అదే నిజమైంది.

'నీతిచంద్రిక' కేవలం పంచతంత్రానికి అనువాదం కాదు. ఈ గ్రంథాన్ని బాగా అధ్యయనం చేస్తే నీతి కౌశలం, భాషాజ్ఞానం కూడా కలుగుతాయి. విద్యార్థులకు భాషాజ్ఞానం, నీతిని అందించారు సూరి. విష్ణుశర్మ లాగే సూరి కూడా కథకే ప్రాధాన్యమిచ్చాడు. మొదట చదువు ఆవశ్యకత చెప్పారు.

**"విద్య యొసగును వినయంబు! వినయంబునను**
**బడయుబాత్రత, బాత్రత వలన ధనము**
**ధనము వలనను ధర్మంబు దానివలన**
**నైహికాముష్మిక సుఖంబులందు నరుడు"**

ఓ ఎనభై ఏళ్లక్రితం జార్జ్ ఆర్వెల్ 'ఏనిమల్ ఫార్మ్' నవల రాశాడు. ఆ కథ–మిస్టర్ జోన్స్‌కి ఒక జంతువుల పెంపకం కేంద్రం (ఏనిమల్ ఫార్మ్) ఉంది. గుర్రాలు, ఆవులు, మేకలు, గాడిదలు, పందులు, కోళ్లు అన్నీ ఉన్నాయి. కానీ సరిగ్గా తిండి పెట్టకపోవడంతో తిరుగుబాటు చేద్దాం అనిపించి, జంతువులన్నీ ఉద్యమగీతం పాడతాయి. చదువు వచ్చిన పందులు మిగతా వాటికి చదువు చెప్పి తిరుగుబాటు చేసి విజయం సాధిస్తాయి.

ఈ రచన సోవియెట్ రష్యా రాజకీయాలపై ఎక్కుపెట్టిన ఆ వ్యంగ్యాస్త్రం. పంచతంత్ర కథల్లాగే ఆగకుండా చదివిస్తుంది. భారతదేశంలో 5వ శతాబ్దంలోనే 'పంచతంత్రం' పేరుతో విష్ణుశర్మ చక్కటి నీతి కథలను అందించారు. దూబగుంట నారాయణ రాసిన 'హితోపదేశం' ఆధారంగా పంచతంత్ర కథలను శబ్దబ్రహ్మ చిన్నయ సూరి చక్కగా తెనిగించారు. 'పద్యానికి ఆద్యుడు నన్నయ, గద్యానికి ఆద్యుడు చిన్నయ' అని ఖ్యాతి. వావిళ్ల వారు చిన్నయ్య సూరి గురించి ఇంగ్లీషులో రాయించడం వల్ల దేశమంతా తెలిశారు.

పుత్ర సంతానం కోసం పరవస్తు వేంకటరంగ రామానుజాచార్యులు, శ్రీనివాసమ్మ పుత్ర కామేష్టి చేయగా ప్రభవనామ సంవత్సరం, రేవతి చతుర్ధ పాదంలో ఓ పుత్రుడు జన్మించాడు (డిసెంబర్ 20, 1806). పుత్రునికి శ్రీనివాసులు అని పేరు పెట్టారు. అది శ్రీనివాసయ్య, శీనయ్య చివరికి చిన్నయగా మారింది. చిన్నయ మదరాసు ప్రెసిడెన్సీ కళాశాలలో పండితునిగా చేరాడు. నాటి ప్రిన్సిపల్ అర్బుతునాట్ స్వల్పకాలంలోనే సూరి పాండిత్యం, బోధనా పటిమకు ముగ్ధుడై, 'నీవు శాస్త్రి అని ఎందుకు పెట్టుకోలేదు' అని అడిగాడు. "నేను పుట్టు శాస్త్రిని కాదు, పెట్టు శాస్త్రిని కాదు' అని చెప్పాడట. మరి ఏ పేరైతే బాగుంటుందని అర్బుతునాట్ అడగ్గా 'సూరి' బాగుంటుంద న్నాడట. అలా చిన్నయ సూరి అయ్యాడు.

ఎ.జె.అర్బత్‌నాట్, సి.పి.బ్రౌన్, గాజుల లక్ష్మీనరసింహశెట్టి, కలవలపల్లి రంగనాథశాస్త్రి, కుమారస్వామి శాస్త్రులు, శ్రీనివాస మొదలియార్, శ్రీనివాస రాఘవాచార్యులు, రామచంద్రాచార్యులు, శిరోమణి అప్పలాచార్యులు, తిరుక్కోటియార్ సుందరాచార్యులు, తిరుమహేంద్రపురం వరదాచార్యులు, వైయాకరణి విజయరాఘవాచార్యులు, వింజమూరి రామానుజాచార్యులు, వేదం పట్టాభిరామశాస్త్రి, రావిపాటి గురుమూర్తి శాస్త్రి, పూదూరి సీతారామ శాస్త్రి, పురాణం హయగ్రీవశాస్త్రులు వంటివారు సూరికి ఆప్తులు.

పాటలీపుత్రాన్ని (పట్నా) సుదర్శనుడు పాలించేవాడు. విద్వాంసులతో మాటామంతీ జరుపుతూ ఉండగా ఒక బ్రాహ్మణుడు చదువు ఉపయోగాలను వివరిస్తూ పద్యాలు చెప్పాడు. చదువు లేక మూర్ఖులై సదా క్రీడా పారాయణులై తిరుగుతున్న తన నలుగురు కొడుకుల్ని తలచుకుని, వారికి విద్య నేర్పినవారికి అర్ధరాజ్యం ఇస్తానంటాడు. విష్ణుశర్మ అనే పండితుడు రాజు దగ్గరకు వెళతాడు. రాజపుత్రులను ఆరునెలల్లో విద్యావంతులుగా చేస్తానని రాజుకు ప్రమాణం చేశాడు. రాకుమారులకు విద్యపై ఆసక్తి కలగడానికి పశుపక్ష్యాదులను పాత్రలుగా తీసుకుని నీతికథలు చెప్పాడు. అవే 'పంచతంత్ర' కథలు.

నీతిచంద్రిక చదువు గురించి గొప్ప సత్యాలు ఆవిష్కరిస్తుంది. తల్లిదండ్రులు చెప్పినట్టు విని చదువుకొని లోకుల చేత మంచివాడనిపించు కొన్నవాడు బిడ్డడు గాని తక్కినవాడు బిడ్డడా? మూర్ఖుడు అంటుంది. కులానికి కీర్తి తెచ్చువాడు పుత్రుడుగాని



# వెన్నెల వెలుగు



తల్లి కడుపు చెరపబుట్టిన వాడు పుత్రుడు గాడు అని చెబుతుంది. గుణవంతులలో ప్రథమ గణ్యుడు గాని కొడుకును గన్న తల్లి కంటె వేరు గొడ్రాలు గలదా? అని ప్రశ్నిస్తుంది. గుణవంతుడైన పుత్రుడొకడు చాలును. మూర్ఖులు నూరుగురి వలన ఫలమేమి? ఒక రత్నంతో గులకరాళ్లు గంపెడైనా సరికావు. విద్యావంతుడైన, గుణవంతుడైన పుత్రులను చూసి సంతోషించడమనే సంపద మహాపుణ్యం చేసుకున్న వారికే గాని, అందరికీ లభించదు అని వ్యాఖ్యా నించింది. విష్ణుశర్మ కొంగను మాట్లాడించడం కష్టం గాని, చిలుకను పలికించడం కష్టం కాదు అన్నాడట. అయితే, ఎలాంటి రత్నమైనా సాన పెట్టకపోతే ప్రకాశించనట్టే, బాలుడెట్టివాడైనా గురుజన శిక్షలేక ప్రకాశింపడు అని కూడా చెబుతాడు.

చిన్నయ సూరి ఏ కథ చెప్పినా అందులో తప్పుని సరిగా సమాజానికి ఒక నీతిని తెలియజేయాలని అనుకున్నాడు. అందుకే ఈ గ్రంథానికి 'నీతిచంద్రిక' అని పేరు పెట్టారు. వీటిలో మొదటిది 'మిత్రలాభం'. ఈ కథలో ప్రధానంగా రెండు పాత్రలు–చిత్రగ్రీవుడు (కపోతాలకు రాజు) హిరణ్యకుడు (మూషికరాజు). నిర్మానుష్యమైన అడవిలో నూకలు ఉండడం చూసి, వాటికి ఆశపడవద్దని తన పావురాలన్నింటిని హెచ్చరిస్తాడు. సర్వవిధాల ఆలోచించకుండా ఎవరూ పని చేయరాదు అన్నాడు. చక్కగా ఆలోచించి చేసిన పనికి హాని ఎప్పటికి రాదని అంటాడు. అప్పుడు ఒక వృద్ధ పావురం, 'ఈర్ష్యాళువు, జుగుప్సావంతుడు, నిస్సంతోషి, క్రోధనుడు, నిత్య శంకితుడు, పరభా గ్యోపజీవి' అనే ఈ ఆరుగురు దుఃఖభాగులని నీతి కోవిదులు చెప్తుతారు అని ఆక్షేపిస్తుంది. అప్పుడు పావురాలన్నీ నూకల మీద వాలి, వాటి మాటున ఉన్న వలలో చిక్కుకుంటాయి. ముసలి పావురాన్ని నిందిస్తాయి. చిత్రగ్రీవుడు వాటన్నిటిని సంఘటిత పరచి మూకుమ్మడిగా వలతో సహా ఆకాశానికి ఎగిరి హిరణ్యకుడి దగ్గరకు వెళతారు.

హిరణ్యకుడు మొదట చిత్రగ్రీవుని బంధాలను త్రెంచాలని చూస్తాడు. కానీ చిత్రగ్రీవుడు ముందు తన పరివారం బంధాలు తెంచమని కోరతాడు. వెంటనే హిరణ్యకుడు తను మాలి పరుల రక్షింప మనుట నీతి కాదు అంటాడు. చిత్రగ్రీవుడు 'నా ప్రాణాల కంటే నా వారి ప్రాణాలు ముఖ్యం, వీరు జీతభత్యములు లేకున్నను సర్వకాలము విడువక నన్ను కొలుచుచున్నారు. నేను వీరి రుణము ఎప్పుడు తీర్చుకోగలనో కదా! శరీరమునకు గుణములకు మిక్కిలి యంతరము. శరీరము క్షణ భంగురము. గుణములా కల్పాంత స్థాయిలు. ఇట్టి శరీరమునుపేక్షించి కీర్తి పోగొట్టు కోవచ్చునా' అంటాడు. హిరణ్యకుడు సంతోషించి అందరి బంధాలను తెంచివేస్తాడు. కథలో చిత్రగ్రీవుడు రాజు ధర్మం నిర్వర్తిస్తాడు. పని చేసేటప్పుడు నిదానంగా ఆలోచించాలి అనే నీతి కన్పిస్తుంది. స్వార్థం విడిచి ఇతరుల క్షేమం కాంక్షించాలి రాజు. విపత్తు నుండి క్షేమంగా ఎలా బయటపడాలో మార్గం వెదకాలి.

జరద్గవం, మార్జాలం కథలో పిల్లి గ్రద్దను మచ్చిక చేసుకోవడానికి ఎన్నో నీతులు చెపుతుంది. జువ్విచెట్టు తొర్రలో ఒక ముసలి గ్రుడ్డి గ్రద్ద ఉంటుంది. ఆ చెట్టు మీదున్న పక్షులు దానికి రోజు కొంత ఆహారమిచ్చి పోషిస్తూ ఉంటాయి. అందుకు గ్రద్ద పక్షుల పిల్లలకు కాపలాగా ఉంటుంది. ఇది గమనించిన ఒక పిల్లి దానికి మాయమాటలు చెబు తుంది. గ్రద్ద నమ్ముతుంది. అయినా గ్రద్ద 'పిల్లులకు మాంసమందు రుచి మిక్కుటము' కాబట్టి మా దగ్గరకు రావద్దు అంటుంది. తాను చాంద్రాయణ వ్రతం చేస్తున్నానని చెప్పి 'అహింసా పరమో ధర్మః ఏ హింస గాని సర్వభూతములందు దయాళులయి వర్తించు వారికి స్వర్గము కరస్థము" అని దొంగ మాటలు చెప్తుతుంది. పిల్లి ధర్మపన్నాలని నమ్మి, గ్రద్ద దగ్గరకు రానిస్తుంది. పిల్లి మెల్లగా గుడ్డి గ్రద్దకు తెలియకుండా పక్షి పిల్లల్ని తింటుంది. రోజు రోజుకి పిల్లలు తగ్గిపోతున్నాయి. పక్షులు అంతా వెదికి తొర్రలో ఎముకల్ని చూసి, గ్రద్ద తిన్నదని భావిస్తాయి. గ్రద్దను చంపేస్తాయి. కొత్త వారిని ఎలాంటి పరిస్థితుల్లోనూ నమ్మరాదు. పిల్లి మారిపోయానని చెప్పినా దాని జాతి గుణం ఎక్కడికి పోతుంది? ఈ కథ దుష్టబుద్ధి కలవాళ్లు నయవంచన ఎలా చేస్తారో వివరించింది.



కాకి, తాబేలు, జింక, ఎలుక కథలో మిత్రలాభం గొప్పతనాన్ని వివరించారు, సూరి. జింక వేటగాని వలలో చిక్కుకొని ఉండగా కాకి వెళ్లి జింకను బంధాల నుండి విడిపిస్తుంది. వీటికోసం వెదుకుతూ వచ్చిన తాబేలును వేటగాడు బంధిస్తాడు. జింక, కాకి ఉపాయం చేత అన్నీ తప్పించుకుంటాయి. ఇలా నాలుగు కలిపి మైత్రితో పరస్పరం లాభం పొందు తాయి. కలిసి ఉంటే కలదు సుఖం.

మిత్రభేదం కథలో కరటక, దమనక అనే రెండు నక్కలు తమ రాజైన సింహానికీ, ఎద్దుకూ మధ్య తగాదా పెట్టగా సింహం ఎద్దును చంపేస్తుంది. అదే విధంగా ఇతరులు చేయాల్సిన పని జోలికి మరొకరు వెళ్లరాదని, ఎవరు చేయాల్సిన పని వారే చేయాలి అని అన్నాడు. కుక్కకు బదులు గాడిద ఓండ్ర పెట్టి యజమాని చేత దెబ్బలు తిని చావడాన్ని గూర్చి ఈ కథ చెబుతుంది.

ఆషాఢభూతి కథలో ఆషాడభూతి దేవవర్మ అనే పరివ్రాజకుని ధనాన్ని అపహరించాలని తలచి, సమీపించి, సేవించిన విధానాన్ని సూరి చాలా అందంగా వర్ణించాడు. మిత్రభేదంలో సూరి నక్క–బేరి అనే కథలో రమణీయ యుద్ధభూమి వర్ణన ఉంది. ఇందులో చతురంగ బలాలని చక్కగా వర్ణించాడు.

ఈ కథల ద్వారా నీతుల్ని ప్రబోధించాడు సూరి. మానవ జీవితాన్ని సన్మార్గంలో నడుపుకోవాలని కోరుకున్నాడు. నీతులకు నిలయం 'నీతి చంద్రిక'. మానవ జీవితం ఎలాంటి ఒడుదుడుకులు లేకుండా చల్లగా హాయిగా, వెన్నెలవలె సాగిపోవాలని చిన్నయ్య సూరి కాంక్షించాడు.


**మూలు:** *1. శ్రీ పరవస్తు చిన్నయసూరి జీవితము/ నిడదవోలు వెంకట్రావు.*

*2. నీతి చంద్రిక పూర్వార్ధము/పరవస్తు చిన్నయ్య సూరి కృతము పేజీ–4 టు 5 (వావిళ్ల వారి ముద్రణ).*

*3. శబ్దబ్రహ్మ చిన్నయసూరి/ప్రొ॥ వెలమల సిమ్మన్న, డా॥ గుమ్మా సాంబశివరావు.*





**డా. కాశింశెట్టి సత్యనారాయణ**

విశ్రాంత ఆచార్యుడు

**అమెరికా తన వ్యూహాత్మక మిత్రులతో విచిత్రంగా వ్యవహరించడం వలన భారత్‌ను కోల్పోతుంది. డీప్ స్టేట్, వామపక్ష మూకలు ఆడుతున్న మురికి ఆటతో ఇరుకున పడుతుంది.**

**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకోపాలు పెడుతూ, అసత్యాలు చెబుతున్నారనే ఒక తీవ్రమైన అభిప్రాయం మేధావుల్లో ఏర్పడిపోయింది. ఆయన వాషింగ్టన్ డీసీ, కననాస్కిస్‌లో జి-7 శిఖరాగ్ర సదస్సు, తదితర వేదికలపై అదేపనిగా చేస్తున్న వాదనలను అంతర్జాతీయ సమాజం నిశితంగా పరిశీలిస్తోంది. ట్రంప్ మొదటగా భారత్, పాకిస్తాన్ మధ్య నాలుగు రోజుల ఘర్షణ అనంతరం ఇరు దేశాల మధ్య అణు యుద్ధాన్ని నివారించడానికి తాను విజయవంతంగా మధ్యవర్తిత్వం వహించినట్టు చెప్పుకున్నారు.**




# ట్రంప్ అబద్ధాల ఆట

2025, ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పెహల్గావ్‌లో పాకిస్తాన్ నిఘా ఏజెన్సీ ఐఎస్ఐ ప్రేరేపిత ఉగ్రవాదులు పట్టపగలు 26 మంది పర్యాటకులను దారుణంగా హత్య చేయడంతో ఇరు దేశాలు పరిమిత కాలానికి ఘర్షణకు దిగాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శ్వేతసౌధం లోపలా బయటా చేసిన తప్పుడు వాదనలను ఇటీవల భారత ప్రధాని నరేంద్రమోదీ నిర్ద్వంద్వంగా ఖండించారు. అధ్యక్షుడు ట్రంప్ సాయుధ ఘర్షణను ఆపడానికి ఎటువంటి మధ్యవర్తిత్వం వహించలేదు. మంతనాలు జరపలేదు. జోక్యం చేసుకున్నదీ లేదు. బదులుగా, భారత్ తన వైమానిక స్థావరాలపైకి తీవ్రంగా దాడి చేసిన తర్వాత పాకిస్తాన్ సైన్యం నిరంతరం సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునే మార్గాల ద్వారా చేసుకున్న అభ్యర్థనతో మాత్రమే ఆపరేషన్ సిందూర్ ప్రస్తుతానికి నిలిచిపోయింది. నిజానికి, ట్రంప్ దక్షిణాసియా పొరుగుదేశాలు అతి పెద్ద అణు యుద్ధం వైపు వెళ్లకుండా నిరోధించడంలో తన నాయకత్వ పాత్రను పెద్దదిగా చూపడానికి ఒక అడుగు వేశారు. ఈ మేరకు ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు. ప్రధాన ప్రత్యర్థుల మధ్య శాంతిని నెలకొల్పడంలో తాను అద్భుతంగా పోషించిన పాత్ర గురించి రాయలేదంటూ అంతర్జాతీయ మీడియాను వేలెత్తి చూపారు. దీనికి విరుద్ధంగా మోదీ ట్రంప్‌తో 35 నిమిషాలపాటు టెలిఫోన్ ద్వారా జరిపిన సంభాషణలో ట్రంప్‌కు ఎటువంటి పాత్ర లేదని స్పష్టంగా పేర్కొన్నారు. ఇదే విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ చదివి మరీ వినిపించారు. చాలా కచ్చితంగా చెప్పాలంటే మోదీ అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తిత్వాన్ని తోసిపుచ్చారు.



**కె.ఎ.బదరీనాథ్**

**డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్, సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ అండ్ హోలిస్టిక్ స్టడీస్, న్యూఢిల్లీ.**

మోదీ చెవిలో ఇల్లు కట్టుకొని చెప్పినప్పటికీ డోనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధం నుంచి తాను యుద్ధాన్ని ఆపానంటూ అద్భుతమైన వాదనను పునరావృతం చేయడం హాస్యాస్పదంగా ఉంది.

తన మాటను ప్రధాని నరేంద్రమోదీ వినేలా చేసుకోవడానికి భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని తాను ఉపయోగించినట్టుగా ట్రంప్ తన రెండవ అతి పెద్ద వాదనను వినిపించారు. భారతదేశం ఈ వాదనను మరోసారి తోసిపుచ్చింది. ఓ పెద్ద యుద్ధాన్ని నివారించడంలో భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఉపయోగపడింది అంటూ ట్రంప్ చేసిన సూచన అర్థరహితం, అవాస్తవం అని తేలిపోయింది.

భారత ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో జరిపిన టెలిఫోన్ సంభాషణలో ఆయనకు నచ్చినా నచ్చకపోయినా కొన్ని విషయాలనైతే స్పష్టంగా చెప్పారు. వాటిలో మొదటిదిగా పాకిస్తాన్‌తో మధ్యవర్తిత్వాన్ని భారత్ ఎప్పటికీ అంగీకరించదు. తద్వారా దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి చట్రంలో భాగమైన విధానాన్ని గట్టిగా చెప్పారు. రెండవదిగా ఉగ్రవాదానికి నిధులు ఇవ్వడం, ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహించడాన్ని ఇకపై పరోక్ష యుద్ధంగా కాకుండా ప్రత్యక్ష యుద్ధంగా భారత్ భావిస్తుంది. ఆ కారణంగా మనదేశానికి తగినవిధంగా ప్రతిదాడి చేసే హక్కు ఉంటుంది. మూడవ అంశం భారత్ అంతర్భాగమైన జమ్ము కశ్మీర్‌పై చర్చకు తావులేదు. పాక్ ఆక్రమిత ప్రాంతాలపైన మాత్రమే చర్చ ఉంటుంది.

గత కొద్ది వారాలుగా, అధ్యక్షుడు ట్రంప్ వాదనను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎదుర్కోకుండా భారత్ భారత్ అత్యంత సంయమనాన్ని పాటించింది. ఇటీవల ఇద్దరు నాయకుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణ భారత్ వైఖరిని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. దీనికి సమాంతరంగా పాకిస్తాన్ జనరల్ అసిమ్ మునీర్ శ్వేతసౌధానికి సన్నిహితం కావడం, అధ్యక్షుడు ట్రంప్‌తో ఆంతరంగికంగా విందు చేయడం అనేది

రిపబ్లికన్ హయాంలో అమెరికా విదేశాంగ విధానం పూర్తిగా భ్రష్టు పట్టిన వైనాన్ని స్పష్టంగా సూచిస్తోంది.

అమెరికా ఇరాన్‌పై దాడి చేయడానికి తన భూభాగాన్ని ఉపయోగించుకోవడానికి పాకిస్తాన్ అనుమతించిందని, అందుకు ప్రతిగా ఇప్పటివరకు నిరాకరించిన రక్షణ సంబంధిత సాంకేతికతలను పాకిస్తాన్‌కు అందించడానికి అధ్యక్షుడు ట్రంప్ అంగీకరించారనే వార్తలు వచ్చాయి. అయితే ఈ ఇచ్చిపుచ్చుకోవడాల వెనుక కూడా అనేక సాదకబాదకాలు ఉంటాయి.

భారత విదేశాంగ కార్యదర్శి మిస్రీ సహా అమెరికా పాత విదేశాంగ విధానాన్ని సమర్థించేవారు గత కొద్దికాలంగా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్న మాటలను, చేస్తున్న పనులను తోసిపుచ్చారు. దేశాధ్యక్షులు, ప్రధానమంత్రులతో వ్యవహరించేటప్పుడు అనుసరించాల్సిన దౌత్యపరమైన నియమావళిని అధ్యక్షుడు ట్రంప్, కార్పొరేట్ ప్రపంచానికి చెందిన ఆయన సలహాదారుల బృందం చెత్తబుట్టలో పడేశారు. జనరల్ అసిమ్ మునిర్‌కు ఆతిథ్యం ఇవ్వడంతో దానికంటూ స్వంత సూక్ష్మభేదాలు, సందేశాలు కచ్చితంగా ఉంటాయి. ఆసియాలో అమెరికా ఎజెండాను ముందుకు తీసుకెళ్లడంలో జనరల్ మునిర్ ఉపయోగపడతాడని అధ్యక్షుడు ట్రంప్ గ్రహించినట్టు కనపడుతోంది. ఆ క్రమంలో పాకిస్తాన్ వైమానిక స్థావరాలను, ఇరాన్‌లోకి సైన్యం రాకపోకలకు ఉపకరించే 1,000 కి.మీ.ల పొడవైన సరిహద్దును ఉపయోగించడం వలన ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధ రంగం మరింత విస్తరిస్తుంది. గతంలో కూడా చాలా క్లిష్టమైన సమయాల్లో పాకిస్తాన్‌ను అమెరికా ఆశ్రయించింది. అందుచేత మునీర్‌కు ట్రంప్ విందు ఇవ్వడమనేది భారత భద్రతా వేగుల్లో కొందరికి అంతగా ఆశ్చర్యమనిపించదు.

అలాగే డోనాల్డ్ ట్రంప్ ఎందుకూ పనికిరాని, దారీతెన్నూ లేని పాకిస్తాన్‌ను వ్యాపార లావాదేవీల ఒప్పందాలను కుదిర్చే ఒక సామర్థ్యాన్ని సంతరించుకున్న విపణిగాను చూస్తున్నారు. అంతేకాకుండా తనకు నోబెల్ శాంతి పురస్కారం ఇవ్వాలంటూ సిఫార్సు చేయడం ద్వారా మానవ చరిత్రలో నిలిచిపోయే ఓ మహత్తర ఘట్టానికి పాకిస్తాన్ తోడ్పడుతుందని భావిస్తున్నారు.

అమెరికా డీప్‌స్టేట్ ప్రధానమంత్రిగా మోదీ వరుసగా మూడోసారి ఎన్నిక కావడాన్ని తిరస్కరించడం ద్వారా ఆయన నాయకత్వంపట్ల దుష్ట పన్నాగాలు పన్నుతున్నది అనేది ఒక పెద్ద అనుమానం.

ట్రంప్, చైనా కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు జి జింగ్‌పింగ్‌ల మధ్య ఒక వాణిజ్య ఒప్పందం విజయవంతంగా కుదిరిన తర్వాత పాకిస్తాన్ సైన్యంతో శ్వేతసౌధం చేతులు కలిపి ఉండవచ్చు. అంతిమంగా, అధ్యక్షుడు ట్రంప్ భారత్ సహా ఎవ్వరూ నమ్మలేని మిత్రుడిగా మిగిలిపోతారు. నిలకడలేని ట్రంప్ పాలనాయంత్రాంగం మిత్రులు, శత్రువులతో ఉన్న సమీకరణాల్లో ఒడుదొడుకులను ఒకే రకంగా చూడవచ్చు. అమెరికా సమాజంలో ప్రదర్శనలు, నిరసనలతో నానాటికి పెరిగిపోతున్న అశాంతి అమెరికా సంయుక్త రాష్ట్రాలు అన్న కీలకమైన భావనకు పెను ముప్పుగా మారే ప్రమాదం ఉంది. దశాబ్దాలుగా పాతుకుపోయిన అమెరికా డీప్‌స్టేట్, వామ పక్ష కూటమి ఈ గందరగోళాన్ని వాటికి అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంది. అధ్యక్షుడు ట్రంప్ ఈ ప్రక్రియలో ఇరుకునపడే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. ఇదే జరిగిన పక్షంలో ట్రంప్ భారత్‌ను కోల్పోవచ్చు. ★

**బేరసారాలు**

# పనులకుండు పర్సంటేజ్

## వెల్లడైన రేట్ల లిస్ట్



**రా**జకీయ నాయకులు అందరూ, అన్ని వేళలా అన్నీ అబద్ధాలే చెబుతారని అను కోవడం సరి కాదు. అందులో నిజం లేదు. సామాన్యుడికి ఈ విషయంలో ఎలాంటి అనుమానం లేదు. అంతేకాదు, అలా అనుకోవడం తప్పు, పొరపాటు, అని కూడా సామాన్యుడు, ఘ...ట్టిగా చెప్పగలడు.

ఉదాహరణకు మంత్రి కొండా సురేఖ నోట వెలువడిన మాటలనే తీసుకుంటే... మంత్రులు చేసే ప్రతి సంతకానికి ఒక రేటు ఉంటుందని, ఫైల్ ఫైలుకు పర్సెంటేజ్ 'ఫిక్స్'యి ఉంటుందంటూ సత్యాన్ని ఎంతో చక్కగా, నిర్భయంగా చెప్పారు. అఫ్కోర్స్, తాను మాత్రం ఎటీస్ట్ ఇన్ వన్ పర్టికులర్ కేసులో తనకు రావలసిన పర్సెంటేజ్' వదులుకుని, జూనియర్ కళాశాలలో అదనపు గదులు నిర్మాణానికి, సదరు 'కంపెనీ' ద్వారా విరాళం ఇప్పించానని చెప్పారు. ఆ సందర్భంలోనే ఆమె, 'టంగ్' జారడం వల్లనే, ఆ నిజాన్ని చెప్పి ఉండవచ్చును. కానీ, టంగ్ జారి చెప్పినా, మరోలా చెప్పినా, ఆమె చెప్పింది అయితే, నిజమే కదా? కాబట్టి... మంత్రి సురేఖను మనమందరం తప్పక అభినందించాలని, సామాన్యుడు సవినయంగా మనవి చేస్తున్నాడు.

ఒక్క మంత్రి సురేఖను మాత్రమే కాదు, ఆమె భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావును కూడా సామాన్యుడు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాడు. ఎందుకంటే. 'మేడ్ ఫర్ ఈచ్ ఆదర్' కదా! ఆమె చెప్పిన సత్యాన్ని , ఆయన సెకండ్ చేశారు. నిజానికి మంత్రిగా సురేఖమ్మ చెప్పలేని నిజాలను కూడా మురళీ చక్కగా చెప్పారు. అందుకే, రాష్ట్ర మంత్రి వర్గంలో సురేఖ చేతిలోని శాఖలు (పర్యావరణ, అటవీశాఖ, దేవదాయ ధర్మాదాయ) అస్సలు ఆదాయం లేనివని, పైసలే రావడం లేదని, తానే, ప్రతినెలా ఆమె ఖర్చులకు రూ.5 లక్షలు పంపిస్తున్నానని ఎలాంటి దాపరికం లేకుండా ఖుల్లం ఖుల్లా చెప్పుకొచ్చారు. ఇంత చక్కగా.. సర్కార్ లోగుట్లను, విప్పిన, చెప్పిన కొండా దంపతులను, సామాన్యుడు అభినందిస్తున్నాడు.

ఇన్ఫాక్ట్, మనం కొండా దంపతుల గురించి మాత్రమే గొప్పగా మాట్లాడు కుంటున్నాం కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కదా అందరికీ ఆదర్శం? అని సామాన్యుడికి కొంచెం చాలా లేటుగా.. 'బ్రెయిన్' వెలిగింది. ఎస్.. మంత్రి కొండా సురేఖ కానీ, ఆమెగారి శ్రీవారు కొండా మురళీ కానీ, ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వంలో పనులు జరిగే తీరును, ఫైల్స్‌ను కదిలించే 'ఇంధన' వనరుల వివరాలను, మంత్రుల సంతకాల రేటు కార్డు వివరాలను, సామాన్యుడికి చక్కగా అర్థమయ్యేలా వివరించారు. అదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారైతే, ప్రమాణస్వీకారానికి ముందే, ఒక్క సంవత్సరం కడుపు కట్టుకుంటే (అంటే లంచాలు ముట్టకుండా ఉంటే, అనేది కవి హృదయం కావచ్చును) రూ.40 వేల కోట్ల రుణ మాఫీని ఎడమ చేత్తో తీసేస్తానని సెలవిచ్చారు. సో.. కొండా దంపతులకంటే ముందు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని, వారికున్న ముందు చూపును ముందుగా అభినందించాలని.. వీలైతే... 'అవినీతి హరిచంద్ర' లాంటి బిరుదులతో గౌరవించాలని కూడా సామాన్యుడు సత్య ప్రమాణకంగా కోరుకుంటున్నాడు.

... సామాన్యుడు

ఒక మహా నాయకుడంటే ఆయన చింతన భవిష్యత్తుకు దారి చూపాలి. దేశభక్తుడు అంటే ఆయన జాడ చరిత్రలో దర్శనం ఇవ్వాలి. ఆయన భవిష్యద్దర్శనం, చరిత్ర మీద జాడ మనం చూడగలిగేది ఆయన చేసిన త్యాగంలోనే. డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జీవితంలో ఇవి దర్శనమిస్తాయి. ఆయన హిందూ మహాసభలో పనిచేశారు. తరువాత భారతీయ జనసంఘ్‌ను స్థాపించారు. స్వాతంత్ర్యోద్యమ ప్రస్థానం, అందులోని మంచి చెడు రెండూ ఎరిగిన నేతగా ఆయన చేసిన భవిష్యద్దర్శనం ఐక్య కశ్మీరం. భారత జాతీయ కాంగ్రెస్ నేతల తప్పటడుగుల కారణంగా భారతావనికి కిరీటం వంటి కశ్మీరం చిక్కులలో పడింది. ఆయన దృష్టి కారణంగానే తరువాత ఆయన చింతనకి వారసులు కశ్మీర్‌పై వాస్తవిక విధానం అనుసరించారు. దేశ ఐక్యతకు కట్టుబడ్డారు. అందుకే కశ్మీర్ కోసం ఆయన పోరాడుతూ నేలకొరిగిన జూన్ 23 ఏనాటికీ విస్మరించ వీలులేని రోజుగా మారింది. ఆయన బలిదానం రోజు దేశ సమైక్యతకు ఎదురవుతున్న సవాళ్లను చర్చించే సందర్భంగా మార్చుకోవాలి. జూన్ 23న ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన సందేశం ఇదే చెబుతున్నది. దేశ ఐక్యతకు మీరు చేసిన నిరుపమాన త్యాగం సదా స్మరణీయమైనది అని ప్రధాని చెప్పడంలోని ఆంతర్యం ఇదే. దేశమంతా ఆయనకు ఆరోజు ఘనంగా నివాళి ఘటించి, దేశ ఐక్యతామంత్రానికి అంతా కటిబద్ధులమని దేశభక్తులంతా ముక్తకంఠంతో పలికారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వ్యాసం.

# శ్యామాప్రసాద్ ముఖర్జీ జాతీయ సమైక్యతా



జులై 6,1901–జూన్ 23,1953

జూన్ 23ను డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌గా జరుపుకుంటూ ఉంటాం. సంకల్పంతో ఆశయ సిద్ధిని ఎలా సాధించగలమో వారి జీవితమే ఒక గొప్ప ఉదాహరణ. ఈ సందర్భం ఆ విషయాన్ని తెలియచేస్తున్నది. వారు జీవిత కాలంలో నమ్మిన, పోరాడిన సిద్ధాంతం 'ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు' వ్యవస్థ నడవదు, నడవదు అనే. దాని కోసమే కడవరకు పోరాడి తాను నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్ని అర్పించారు. శ్యామాప్రసాద్. ఆయన చింతన ఒక జ్వాల. ఆయన మార్గం దేశ సమైక్యతకు సూత్రం.

శ్యామాప్రసాద్ జులై 6, 1901న కలకత్తాలో జన్మించారు. భారత మేధో సంపదకు మహోన్నత తార్కాణంగా నిలిచిన సర్ అశుతోష్ ముఖర్జీ కుమారుడాయన. చిన్ననాటి నుంచే అసాధారణ మేధస్సు కలిగిన శ్యామాప్రసాద్, కలకత్తాలోని ప్రెసిడెన్సీ కళాశాల ఆంగ్ల సాహిత్యంలో బీఏ, ఆ తర్వాత ఎంఏ, బీఎల్ పూర్తి చేశారు. కేవలం 23 ఏళ్ల వయసులో, లండన్‌లోని లింకన్ ఇన్ విద్యాలయం నుంచి బారిస్టర్ పట్టా పొందారు. బ్రిటిష్ పాలనలో భారతీయుడిగా ఇది ఒక అరుదైన ఘనత.

**విద్యాలోకంలో అసాధారణ స్థానం**

కేవలం 33 ఏళ్ల వయసులో శ్యామాప్రసాద్ కలకత్తా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులయ్యారు (1934–1938). ఆయన పదవీ కాలం విద్యారంగానికి ఒక కొత్త బాట చూపింది. భారతీయ భాషలకు ప్రోత్సాహం, శాస్త్రీయ విద్యాభివృద్ధి, మహిళా విద్యకు ఆసక్తి, విద్య ద్వారా జాతీయ చైతన్యాన్ని ప్రేరేపించడం వంటి అంశాలను ఆయన పరిచయం చేశారు. 'విద్య అంటే కేవలం పాఠాలు కాదు. అది దేశానికి ఆత్మను నూరిపోసే సాధనం' అని వారి నమ్మకం.

**విభజన రాజకీయాలను ఎదిరించిన జాతీయవాది**

కాంగ్రెస్, హిందూ మహాసభ, జాతీయ చైతన్యం వారిలో ముప్పేరగొని కనిపిస్తాయి. అయితే కాంగ్రెస్‌పై అభిప్రాయం తర్వాత పలచబడింది. స్వాతంత్ర్యోద్యమం ఒక దశలో భారత జాతీయ కాంగ్రెస్ వెంట నడవని వారు దేశంలో తక్కువ. శ్యామాప్రసాద్ కూడా కాంగ్రెస్ పట్ల మానసిక అనురక్తితో రాజకీయ జీవితం ప్రారంభించారు. 1929లో బెంగాల్ శాసన మండలికి ఎన్నికయ్యారు. అయితే, ముస్లింలీగ్‌కు అండగా కాంగ్రెస్ వ్యవహరించడాన్ని చూసి ఆయన అసహనం వ్యక్తం చేశారు. తరువాత ఆయన దృష్టి అఖిల భారత హిందూ సభ వైపు మళ్లింది. 1943 నుండి 1946 వరకు హిందూ మహాసభ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన ప్రయత్నం హిందూ స్వాభిమానం పేరుతో విభజనకు వ్యతిరేకంగా జాతీయ ఐక్యతకు తన శక్తినంతా వినియోగించారు. ఒక రాజకీయ నాయకుడిగానే కాకుండా, సేవాతత్పరతతో బెంగాల్ కరవు (1943) సమయంలో పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టారు. బెంగాల్ కరవు బ్రిటిష్ జాతి సృష్టి. రెండో ప్రపంచ యుద్ధం కోసం బెంగాల్‌ను బలిపెట్టారు. అందుకే బ్రిటిష్ పాలనలోని క్షమార్హం కాని ఆ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా విమర్శించారు.

**ఒక దేశం, రెండు భిన్న అభిప్రాయాలు**

ఆగస్టు 15, 1947న, దేశానికి స్వాతంత్ర్యం లభించిన అనంతరం నెహ్రూ తొలి కేబినెట్‌లో పరిశ్రమలు, సరఫరా శాఖ మంత్రిగా నియమితులైన ముఖర్జీ, త్వరలోనే ఆలోచనాత్మక విభేదాలకు గురయ్యారు. నెహ్రూ విధానాలు దేశాన్ని బలహీన పరచడమే కాకుండా, ముమ్ముందు దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లుతుందని ముందే ఊహించారు. అనునిత్యం నెహ్రూతో ధార్మిక, జాతీయ, భారత భవిష్యత్తుపై శ్యామాప్రసాద్ వివాదం కొనసాగింది.

అసలు ఆ తరహా భారత విభజననే శ్యామా ప్రసాద్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆనాడు శ్యామా ప్రసాద్ వంటివారు మత పునాది మీద దేశాన్ని చీల్చడాన్ని ఎంత తీవ్రంగా వ్యతిరేకించినా చివరికి అదే జరిగింది.

రాజ్యాంగ రచన సమయంలో ఆర్టికల్ 370ను వ్యతిరేకిస్తూ, ఇది దేశాన్ని చీల్చుతుందని ముఖర్జీ

# దీపం

హెచ్చరించారు. అల్పసంఖ్యాక వర్గాల గొంతెమ్మ కోరికలను, దేశ శ్రేయస్సు విషయంలో వారి తీరుపై విమర్శలు కురిపించారు. పాకిస్తాన్‌పై నెహ్రూ అనుకూల వైఖరిపై ధ్వజమెత్తారు. నెహ్రూ–లియాకత్ ఒప్పందం (1950) విషయంలోను ఆయన విభేదించారు. ఈ ఒప్పందం ఫలితం తూర్పు పాకిస్తాన్‌లో హిందువుల హక్కులను (నేటి బాంగ్లాదేశ్) నిర్లక్ష్యం చేయడానికే ఉపయోగపడుతుందని విమర్శించారు. ఈ తీవ్ర విభేదాల మధ్య 1950 ఏప్రిల్‌లో మంత్రి పదవికి రాజీనామా చేసి ఇలా ప్రకటించారు: 'దేశాన్ని బలహీనపరిచే విధానాల్లో భాగస్వామిగా ఉండలేను' అని ప్రకటించారు.

**జనసంఘ్ - ఓ ఆశా దీపం**

1947 నాటి కాంగ్రెస్‌తో పాటు దేశంలో చాలా రాజకీయ పక్షాలు పనిచేస్తున్నాయి. కానీ వేటిలోను నిర్మాణాత్మక ఉద్దేశాలు లేవు. ఆశయాలు లేవు. ఆ నేపథ్యంలో దేశభక్తి, జాతీయవాదం, భారత మూలధర్మం ఆధారంగా భారత్‌ను నిర్మించే దిశగా భారతీయ జనసంఘ్ స్థాపించారు. ఆ పార్టీ తరువాతి అవతారమే ప్రపంచంలో అతి పెద్ద రాజకీయ పార్టీ 'భారతీయ జనతా పార్టీ'. జనసంఘ్‌ను 1951లో ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుతో ప్రారంభించారు.

**ఆయన ఆశయం**

దేశం మతం ప్రాతిపదికగా చీలిపోవడం ఎంత తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందో ఆనాడే ఊహించిన మేధావి శ్యామాప్రసాద్. బ్రిటిష్ పాలన కారణంగా దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల గురించి తీవ్రమైన ఆలోచనే దేశంలో, రాజకీయ నాయకత్వంలో లేదు. అలాంటి సమయంలో దేశమనే చింతనను బలపరిచే తీరులో ఒక దేశం–ఒక రాజ్యాంగం – ఒక జెండా అనే మౌలిక స్వరూపం కోసం ఆయన కలగన్నారు. దీనిని నిలబెట్టడానికి, కొనసాగించడానికి అవసరమైన సాంస్కృతిక జాతీయతను ఆయన ప్రతిపాదించారు. ఆర్థిక స్వేచ్ఛకు తోడు దేశ భద్రతకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రత్యేక హోదా అనే భావనను తిరస్కరించారు. 'ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు ప్రధానులు, రెండు జెండాలు కుదరదు! అన్నదే ఆయన నినాదం. అది కశ్మీర్‌కు సంబంధించినది.

**రాజ్యాంగంపై అవగాహన**

ఆయన రాజ్యాంగ రచనా కమిటీ సభ్యుడు కాకపోయినా, ఆ అంశం మీద శ్యామాప్రసాద్ చేసిన ప్రసంగాలు ఆలోచనాత్మకంగా, దూరదృష్టితో ఉండేవి. ఆయన హెచ్చరించిన విషయాలేమిటో ఒకసారి గమనించాలి. ఆర్టికల్ 370 వల్ల దేశ విభజన ప్రమాదం అన్నారాయన. నూటికి నూరుపాళ్లు అదే నిజమైంది. సెక్యులరిజం పేరిట ఓటు బ్యాంకు రాజకీయాలు కూడా దేశ మౌలిక స్వరూపాన్ని మార్చే స్తాయని ఆయన హెచ్చరించారు. అదీ నిజమైంది. ఆయన సూచించినది ఆధ్యాత్మిక ప్రజాస్వామ్యం, వికేంద్రీకరణతో కూడిన ఐక్యత.

**కశ్మీర్‌లో బలిదానం - మిగిలిన ప్రశ్నలు**

కశ్మీర్ కారణంగా భారతావని మీద రెండు జెండాలు ఎగిరాయి. రెండు రాజ్యాంగాలు అమల య్యాయి. ఇది చాలు, సార్వభౌమాధికారాన్ని కాంగ్రెస్ ఎంత అవహేళన చేసిందో తెలియడానికి. అప్పట్లో నెహ్రూ రాజ్యాంగంలోకి చొప్పించిన ఆర్టికల్ 370 కారణంగా భారతీయులందరికీ స్వేచ్ఛగా కశ్మీర్‌కు వెళ్లే అవకాశం ఉండేదే కాదు. అక్కడకి వెళ్లాలంటే పర్మిట్ (వీసా లాగ) తీసుకోవాలి. కానీ దేశభక్తి, దేశ ఐక్యతకు కట్టుబడిన శ్యామాప్రసాద్ పర్మిట్ అనే ఆ పదాన్ని వ్యతిరేకిస్తూ 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ?( జన్మనిచ్చిన తల్లి, మాతృ దేశం స్వర్గానికంటే గొప్పవి) అనే స్ఫూర్తితో 1953లో, ఆర్టికల్ 370ను వ్యతిరేకిస్తూ, కశ్మీర్‌లో అనుమతి లేకుండా ప్రవేశించేందుకు సత్యాగ్రహం చేపట్టారు. దేశానికి ఐక్యతా దీపంగా ఎదుగుతున్న శ్యామాప్రసాద్‌ను నాటి కశ్మీర్ ప్రధాని షేక్ అబ్దుల్లా ప్రభుత్వం మే 11న అరెస్ట్ చేసి, నిశాత్ గార్డెన్లో (శ్రీనగర్) నిర్బంధంలో ఉంచింది. జూన్ 23, 1953న సందేహాస్పద పరిస్థితుల్లో , నిర్బంధంలోనే వారు మృతి చెందారు. కేవలం 51 సంవత్సరాలకే వారు తన ప్రాణాన్ని భారత ఐక్యత కొరకు అర్పించారు. వారి మరణానికి కారణం విచారణ జరపాలని ఆయన తల్లి నెహ్రూని వేడుకున్న "మౌనమే" సమాధానం అయింది.



ఆర్టికల్ 370 రద్దు అనే శ్యామాప్రసాద్ సంకల్పాన్ని, సరిగ్గా 66 సంవత్సరాల తర్వాత, భారతీయ జనతా పార్టీ, ప్రధాన మంత్రి మోదీ నెరవేర్చారు. 2019 ఆర్టికల్ 370ని రద్దు చేసి వారి ఆత్మకు నివాళులు అర్పించారు. వారి జీవితం ఆశయ సాధనకు ఒక స్ఫూర్తి. ఆర్టికల్ 370 రద్దు అంటే ఆయన స్వప్నాన్ని సాకారం చేయడమే. సాంస్కృతిక జాతీయత అనే భావనకు ఆయన ఒక కొత్త సూర్యోదయం. ఇంతై, వటుడు ఇంతింతై అన్నట్టు బీజేపీ ఈ రోజు ప్రపంచంలో అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించటానికి శ్యామాప్రసాద్ బలిదానం బలమైన స్ఫూర్తి అంటే అతిశయోక్తి కాదు. డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ కేవలం రాజకీయ నాయకుడు కాదు. ఆయన ఒక దేశభక్తుడు, శాస్త్రవేత్త, విద్యావేత్త, సంస్థాపకుడు. జాతీయ ఐక్యత కోసం ప్రాణం అర్పించిన వీరుడు.

**జీవితం న తు కాలతః, కర్మణా ఏవ శోభతే**

అంటే మనం ఎన్ని రోజులు జీవించాం అన్నది కాదు, ఎలా జీవించాం అనేదే ముఖ్యం. శ్యామాప్రసాద్ ముఖర్జీ వంటి నాయకులు ఆ రోజులలో కొందరైనా ఉన్నారు కాబట్టే దేశంలో కొన్ని మంచి ఆలోచనలతో ఉద్యమాలు నడిచాయి. లేకుంటే కేవలం పదవీ రాజకీయాలు మిగిలేవి. జాతీయతతో సంబంధం లేని తరాలు పుట్టుకొచ్చేవి. దీనిని నివారించిన ఘనత శ్యామాప్రసాద్‌దే.



**డా. బూర నరసయ్య గౌడ్**
మాజీ ఎంపీ – భువనగిరి



# 'ఇది కదా భారతీయ ఆత్మ!'

మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో జరిగిన ఈ ఉదంతం సామాజిక మాధ్యమాలలో వైరల్ అయి చాలామంది భారతీయులను కదిలించింది. ఒక పేదరైతు భార్యతో సహా ఒక బంగారం దుకాణంలోకి వెళ్లాడు. లోపల ఉన్న వాళ్లంతా పదో పరకో అడిగి తీసుకోవడానికి వచ్చారనే అనుకున్నారు. కానీ ఆయన రూ.1,120 తీసి అక్కడ పెట్టి, తన భార్యకు మంగళ సూత్రం కావాలన్నాడు. ఆయనకు బంగారం ధర తెలియదు. తను దాచిపెట్టిన సొమ్మే అదంతా. దాంతో అంతా కదిలిపోయారు. గోపికా జ్యుయెలర్స్ యజమాని కూడా అబ్బా ఇంత డబ్బే అన్నాడు, సరదాగా. కానీ ఇంకా కావాలన్నాడు. ఆ పెద్దాయన తన చేతి సంచిలో నుంచి కొన్ని చిల్లర నాణేలు తీసి ఇచ్చాడు. ఇంతకీ ఆయన వయసు 93 ఏళ్లు. తెల్లధోవతి, కుర్తా ధరించి, నెత్తిన గాంధీ టోపీతో సంప్రదాయ మరాఠీ ఆయన. ఆయన ఆశయం ఆ దుకాణం యజమానిని కూడా కదిలించింది. ఆ పెద్దాయన దుకాణంలోకి వచ్చారు. నా చేతిలో రూ. 1,120 తన భార్యకు మంగళసూత్రం కావాలన్నాడు. ఆయన కోరిక నన్ను బాగా కదిలించింది. అందుకే ఆయనకు మంగళసూత్రం ఇచ్చాను. అందుకు ఆశీర్వాదం కోసం అన్నట్టు రూ. 20 మాత్రమే తీసుకున్నాను. వారిద్దరి గట్టి ప్రేమబంధానికి ఇదొక చిన్న కానుక అన్నారు యజమాని. ఆ రైతు పేరు నివృత్తి షిందే. ఆమె పేరు శాంతాబాయి. జాల్నా జిల్లా అంభోరా జహగీర్ గ్రామం నుంచి వచ్చారు. నిజానికి ఆ దంపతులిద్దరూ ఆషాఢ ఏకాదశి ఉత్సవం కోసం పండరిపుర పుణ్యక్షేత్రానికి వెళుతున్నారు. అంత వయసులోను వారు ఒకరిని ఒకరు విడిచి ఉండరని ఆ గ్రామం వారు చెప్పారు. ఎక్కడికి వెళ్లినా ఇద్దరూ కలసే వెళతారట. వారికి ఒక కుమారుడు ఉన్నా, అతడి మీద ఆధారపడకుండా నడిపించుకు వస్తున్నారు జీవితం. ఆయన మంగళసూత్రం ఉదంతం వైరల్ అయింది. రెండు కోట్ల మంది చూశారు. చాలామంది 'ఇది కదా భారతీయ ఆత్మ' అన్న భావం వచ్చే విధంగా వ్యాఖ్య రాశారు. ఆ దుకాణం యజమాని ఔదార్యానికి మరికొందరు మురిసిపోయారు. ఆయనను దేవుడు చల్లగా చూడాలంటూ వ్యాఖ్య పెట్టారు. ఆయనది నిజంగా ఔదార్యమే. కేవలం రూ. 20 తీసుకుంటున్నాను. నాకు మీ ఆశీర్వాదం చాలు అన్నారాయన. మెడలోకి మంగళసూత్రం చేతికి వచ్చిన తరువాత ఆ వృద్ధదంపతులు ఇద్దరూ కంట తడి ఆనందబాష్పాలు రాల్చడం నిజంగానే అందరినీ కదిలించింది.

# మంచిని మెచ్చుదాం...



అధికారపక్షం, దాని సారథిపై విమర్శలే కాదు. అది చేసే మంచినీ మెచ్చాలి. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌లో ఆ విజ్ఞత వెల్లడైందని అంటోంది భారతీయ జనతా పార్టీ. ప్రధానమంత్రి మోదీ సంకల్పం భారత్‌కు ప్రధాన ఆస్తిగా నిలిచిందని శశిథరూర్ తిరువనంతపురంలోని ఒక ఆంగ్ల పత్రికకు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. 'మోదీ దార్శనికత, చైతన్యం ప్రపంచ దేశాలను ఆకట్టుకునేదిగా ఉంది. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తన దృఢమైన వైఖరిని ప్రపంచానికి చాటిచెప్పింది. అది మన విదేశీ విధానానికి కీలక పరిణామం' అని అభిప్రాయపడ్డారు. ఒంటెత్తు పోకడలతో దేశం అంతర్జాతీయంగా ఏకాకిగా మిగులుతోందంటూ కాంగ్రెస్ తరచూ విమర్శలు ఎక్కుపెడుతున్న తరుణంలో శశిథరూర్ ప్రధాని వ్యూహాత్మక శైలిని ప్రశంసించడం గమనార్హం. ఆ ఎంపీ వ్యాసాన్ని ప్రధాని కార్యాలయం ఎక్స్ వేదికగా పంచుకుంది.

# మహిళా రిపోర్టర్‌పైకి రబ్బర్ బుల్లెట్



జూన్ 8, మధ్యాహ్నం.. అమెరికాలోని లాస్‌ఏంజెలెస్‌లో అక్రమవలసదారులకు మద్దతుగా, ట్రంప్ ఏలుబడికి వ్యతిరేకంగా నిరసనకారులు అల్లకల్లోలం సృష్టిస్తున్నారు. ఆందోళనకారులు ఒకవైపు, సాయుధ బలగాలు మరోవైపు ఎదురెదురుగా మోహరించి ఉన్నారు. ఈలోగా ఒక ఆస్ట్రేలియా టీవీ చానెల్ మహిళా రిపోర్టర్ కెమెరామెన్‌తో పాటుగా ఇరువర్గాల మధ్యకు వచ్చింది. వెనుక ఉన్న బలగాలవైపు మాటిమాటికి చూపిస్తూ లైవ్ కవరేజ్‌లో విశేషాలను వీక్షకులకు చెబుతోంది. ఈలోగా వెనకాల ఉన్న జవాన్లలో ఒకడు ఆమె కాలువైపు గురి చూసి రబ్బర్ తూటా పేల్చాడు. అనుకోకుండా తూటా తాకడంతో రిపోర్టర్ అక్కడ్నుంచి కుంటుకుంటూ వెళ్లిపోయింది. కెమెరామెన్ కూడా బతుకుజీవుడా అనుకుంటూ అక్కడ్నుంచి పారిపోయాడు.

# ఫ్రాన్స్ పాలకులకు తమిళ, ఒడిశా కళాఖండాలు





ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలే వినూత్నంగా ఉంటాయి. ఆయన ఏం చేసినా అందులో భారతీయ స్పర్శ ఉంటుంది. జి7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు మోదీ ఇచ్చిన కానుకే దీనికి రుజువు. తమిళనాడు డ్వాక్రా మహిళలు తయారుచేసిన లోహ నందిని మోదీ మాక్రాన్‌కు అందించారు. ఈ సమావేశం ఫ్రాన్స్‌లోనే జరిగింది. ఈ ఫోటోలో ఉన్నది ఆ నందే. ఇది నిజంగానే పురాతన కళాఖండాన్ని మరిపిస్తున్నది. గంటలు, మువ్వలతో అలంకరించిన నంది ఇది. ఆధ్యాత్మికతను ప్రతిబింబిస్తూ ఉన్న ఈ నంది తమిళనాడు సంప్రదాయక కళకు చెందినది. మైనం మూసల ద్వారా తయారు చేసే, అక్కడ అంతరించిపోతున్న ప్రక్రియకు చెందినది. ప్రపంచ దేశాలతో దౌత్య సంబంధాలను మెరుగుపరుచుకునే క్రమంలో ఆయా దేశాల నేతలకు భారతీయ హస్తకళా కృతులను బహూకరించడం కొత్తకాదు. ఈ కెనడా పర్యటనలోనే మోదీ ఆ దేశ గవర్నర్ జనరల్‌కు మరొక కానుక ఇచ్చారు. దానిని ఒడిశా చేతివృత్తుల వారు తయారు చేశారు. వెండితో చేసిన ఈ పర్సు తయారీని తరాకాశీ శైలి అంటారు. కేవలం సన్నటి వెండి తీగలతో దీనిని తయారు చేస్తారు. ఇది లేస్ పనిని మరిపిస్తూ, చాలా లలితంగా ఉంటుంది. ఈ కళ గడచిన ఐదు వందల ఏళ్లుగా ఆ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో పరిఢవిల్లుతున్నది. నిజమే, మన చేతివృత్తులు, హస్తకళా నైపుణ్యం ఎంత గొప్పవో ప్రపంచానికి చాటాలి.

ఆ పని మోదీ చిరకాలంగా చేస్తున్నారు.

# పెహల్గావ్ దుండగులు పాక్ ఉగ్రవాదులే



ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పెహల్గావ్‌లో జరిగిన దారుణ హత్యాకాండ పాకిస్తాన్ ఉగ్రవాదుల పనేనని తేలింది. ఆ ముగ్గురు లష్కరే తాయిబా సంస్థకు చెందినవారేనని, వారికి స్థానికంగా ఉన్నవారు ఆశ్రయం కల్పించారని కూడా బయటపడింది. ఆనాటి దుర్ఘటనలో 26 మంది దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే. తరువాత పరిస్థితులు కనీవినీ ఎరుగనంత ఉద్రిక్త స్థాయికి చేరాయి. జూన్ 21వ తేదీన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఇందుకు సంబంధించి ఇద్దరు కశ్మీరీలను అరెస్టు చేసింది. ఆ ముగ్గురు ఎవరో తెలిసి కూడా స్థానికులు ఆశ్రయం ఇచ్చారు. ఈ ముగ్గురిలో ఒకడి పేరు హాషీం మూసా/ సులేమాన్. మూసా 2024లో గగన్‌గిరి, గండెర్‌బాల్‌ల వద్ద జరిగిన దాడులతో కూడా ఇతడికి ప్రమేయం ఉంది. ఇతడు పాకిస్తాన్ ప్రత్యేక భద్రతా బలగంలో పనిచేసి పదవీ విరమణ చేశాడు. పెహల్గావ్ ప్రాంతంలోనే ఆశ్రయం ఇచ్చిన ఆ ఇద్దరు కశ్మీరీలు పర్వేజ్ అహ్మద్ జోహార్ (బాత్కోటే), బషీర్ అహ్మద్ జోహార్ (పెహల్గావ్‌లోని హిల్ పార్క్)లను అరెస్టు చేశారు. దీనితో ఈ కేసు దర్యాప్తులో పెద్ద విజయం సాధించినట్టయింది. ఈ ముగ్గురు దుండగులకు ఈ ఇద్దరు స్థానికులే అన్ని సదుపాయాలు కల్పించారు. వారిని హత్యాకాండ జరిగిన చోటికి తీసుకెళ్లినది కూడా ఈ ఇద్దరే. ఆ ముగ్గురు కూడా నిస్సందేహంగా లష్కరే తాయిబా సంస్థ సభ్యులేనని అరెస్టయిన స్థానికులు ఇద్దరూ వెల్లడించారు.

దుండగులను పట్టుకునే క్రమంలో జమ్ముకశ్మీర్ పోలీసులు వీరి ఊహా చిత్రాలను విడుదల చేశారు. ఈ ముగ్గురే కాకుండా, ఆలీభాయి అనే పాకిస్తాన్ ఉగ్రవాది, అదిల్ హుసేన్ థోకర్ అనే స్థానిక ఉగ్రవాది చిత్రాలను విడుదల చేశారు. థోకర్ పాకిస్తాన్‌లో ఉగ్రవాద శిక్షణ తీసుకుని వచ్చినవాడు. పెహల్గావ్ దుర్ఘటన జరగడానికి కొన్ని నెలల ముందే మూసా పాకిస్తాన్ వచ్చి రెక్కీలు నిర్వహించాడని అర్థమవుతుంది. అక్టోబర్ 2024లో జరిగిన రెండు దాడులతో కూడా ఇతడి ప్రమేయం ఉంది. గగన్‌గిరి, గండెర్‌బాల్‌లలో జరిగిన దుర్ఘటనలు అవే. ఆ దాడులలో ఆరుగురు స్థానికులు, ఒక డాక్టర్ చనిపోయారు. తరువాత బూటా పాత్రి అనే చోట జరిగిన దాడిలో ఇద్దరు భారత జవాన్లు మరణించారు.

పెహల్గావ్ దాడిలో ఈ ముగ్గురు పాకిస్తానీ ఉగ్రవాదులకి కశ్మీర్‌లో పని చేసే 15 మంది రహస్య సానుభూతిపరులు కూడా సహకరించారు. అయితే వీరికి ఈ కుట్ర మొత్తం తెలిసే అవకాశం లేదంటున్నారు. ముగ్గురు ముష్కరులు చైనా యాప్‌లను ఉపయోగించారు. కానీ ముగ్గురు ఉగ్రవాదులకు సాయం చేశారన్న ఆరోపణపై ప్రస్తుతం అరెస్టయిన ఇద్దరు స్థానికులకు గతంలో ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధం ఉన్నట్టే చెప్పే పోలీసు రికార్డులు లేవు.



# లాలూ ఓవరాక్షన్

రాష్ట్రీయ జనతాదళ్ – ఆర్‌జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ ఏ విషయంలోనైనా అహంకారంతో అతి చేయడంలో ముందుంటారు. ఆయన జూన్ 11న తన 78వ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా 78 కేజీల కేక్‌ను తెప్పించారు. కేక్ పక్కనే ఒక కుర్చీలో కూర్చొని కాలును ఎదురుగా ఉన్న బల్ల మీద పెట్టుకున్న లాలూ యుద్ధాల్లో వాడే అతి పెద్ద కత్తితో కేక్‌ను కట్ చేశారు. దీనికి సంబంధించిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆర్‌జేడీ అధినేతపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇదే విషయమై కేంద్ర మంత్రి జితిన్ రామ్ మాంఝీ ఒక పోస్టులో గొడవలు పెట్టి సమాజాన్ని చీల్చేవారి ప్రవర్తన ఎప్పటికీ మారదు. నేడు ఆయన అధికారంలో లేకపోయినప్పటికీ కేక్‌ను అతి పెద్ద కత్తితో కట్ చేశారు. పొరపాటున ఆయన కుమారుడు అధికారంలోకి వస్తే కేక్‌ను ఏకే–47తో కట్ చేస్తారు. కాదంటారా లాలూప్రసాద్ యాదవ్? ఏదెలాగున్నా జన్మదినశుభాకాంక్షలు అని వ్యాఖ్యానించారు.

బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అజయ్ అలోక్ ఒక పోస్టులో లాలూ ప్రసాద్ యాదవ్.. 78వ పుట్టినరోజు జరుపుకుంటున్న మీకు శుభాకాంక్షలు. కానీ మీ పాత అలవాట్లు మారలేదు. బిహార్ ప్రజల్లో దళితులు, వెనుకబడిన తరగతులపై కత్తికట్టిన మీరు చివరకు ఒక కేక్‌పైన కూడా కత్తిని ప్రయోగించారు. అదే విలువలను మీరు మీ పార్టీకి, మీ పిల్లలకు అందించారు. ఆర్‌జేడీలో ప్రతి ఒక్కరూ నేడు కత్తులు, ఈటెలు వాడుతున్నారు అని అన్నారు.

అయితే సరదా కోసమనే లాలూ కత్తితో కేక్ కట్ చేశారని ఆర్‌జేడీ మద్దతుదారులు తెలిపారు. ఎన్నికలు ముంచుకొస్తున్న బిహార్‌లో ప్రస్తుతం ఏది జరిగినా విశేషమే మరి.

# బాంగ్లాదేశ్‌లో రవీంద్రనాథ్ టాగూర్ నివాసం ధ్వంసం

బాంగ్లాదేశ్‌లోని సిరాజ్‌గంజ్ జిల్లాలో రబీంద్ర కచ్చరిబరి అని పిలిచే నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ టాగూర్ పూర్వికుల నివాసంపై జూన్ 10న గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. రబీంద్ర కచ్చరిబరి ప్రస్తుతం రబీంద్ర స్మారక మ్యూజియంగా ఉంది. స్థానిక మీడియా ప్రకారం కుటుంబసమేతంగా మ్యూజియాన్ని చూడటానికి ఒక సందర్శకుడు అక్కడకు వచ్చాడు. మోటర్‌సైకిల్ పార్కింగ్ ఫీజు విషయమై అతడికి, సిబ్బందికి మధ్య గొడవ జరిగింది. సిబ్బంది అతడిని ఒక గదిలో బంధించి, భౌతికంగా దాడి చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఘటనకు నిరసనగా స్థానికులు



మ్యూజియం వద్ద మానవ హారంగా నిలిచారు. అదే సమయంలో కొందరు దుండగులు కచ్చరిబరి ప్రాంగణంలోకి చొరబడ్డారు. ఆడిటోరియాన్ని ధ్వంసం చేశారు. మ్యూజియం డైరెక్టర్‌పై దాడి చేశారు. దాడిపై దర్యాప్తునకు ముగ్గురు సభ్యులతో కూడిన ఒక కమిటీని పురావస్తు శాఖ నియమించింది. ఐదు పని దినాల్లోగా నివేదికను సమర్పించాలని కమిటీని ఆదేశించింది. అవాంఛనీయ పరిస్థితుల కారణంగా కచ్చరిబరిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు కస్టోడియన్ ఎండీ హబీబుర్ రహ్మాన్ మీడియాతో అన్నారు. ప్రస్తుతం యావత్ ప్రాంగణం అధికారిక నిఘాలో ఉందని తెలిపారు.

రాజ్‌షాహి డివిజన్‌లోని షాహజాద్‌పూర్‌లో నిర్మితమైన కచ్చరిబరి టాగూర్ కుటుంబానికి ఒక చరిత్రాత్మక నివాసంగానూ, ఒకప్పటి రెవెన్యూ కార్యాలయంగానూ ఉన్నది. రవీంద్రనాథ్ టాగూర్ ఇక్కడ చాలా కాలం గడిపారు. అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించారు. దీనిని ఒక సాంస్కృతిక వారసత్వ కేంద్రంగా పరిరక్షిస్తున్నారు. ఈ మ్యూజియం విశ్వకవి జీవితానికి, వారసత్వ సంపదకు అంకితమైంది.

# సాగర గర్భంలో మ్యూజియం!

దేశంలో మరెక్కడా లేనివిధంగా సముద్ర గర్భంలో నావికాదళం మ్యూజియం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం, మహారాష్ట్ర సర్కారు పూనుకున్నాయి. ఇందుకోసమని భారత నావికాదళం ఉచితంగా అందజేసిన ఐఎన్‌ఎస్ గుల్దార్ యుద్ధనౌకను అరేబియా మహాసముద్రానికి చెందిన సింధుదుర్గ్ తీరం వెంబడి సముద్ర గర్భంలోకి చేర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సాగర పర్యాటకానికి ఊతమిచ్చే ఈ ప్రాజెక్టు కోసమని కేంద్రం రూ.46.91 కోట్ల గతేడాది మంజూరు చేసింది. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ఇటీవల ప్రాజెక్టు పనులను వర్చువల్‌గా ప్రారంభించారు.



# నిన్నటిదాకా శాంతిదూత, ఇప్పుడు యుద్ధోన్మాది

‘ఈ బుద్ధి బుధవారం దాకా ఉంటే బూరెలు వండి పెట్టొచ్చు!’ అని తెలుగు వారి నానుడి. ఆ బుద్ధి, అంటే ఆలోచన దేనికి సంబంధించినదైనా గురువారాని కల్లా సంపూర్ణంగా మారిపోవచ్చు. ఒకవేళ మారకుండా అలాగే నిలబడి ఉంటే మాత్రం బూరెలతో నోరు తీపి చేయవచ్చు. అదీ ఈ నానుడి వెనుక ఉన్న అర్థం. వాళ్ల బూరెల సంగతి తెలియక పోయినా, ఈ నానుడి ఇప్పుడు పాకిస్తాన్‌కి బాగా సరిపోతుంది. నిన్న జిందాబాద్ అన్నదే, ఇవాళ ముర్దాబాద్ అంటున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ శాంతిపురస్కారానికి ఎంపిక చేయాలని పాకిస్తాన్ ప్రభుత్వం జూన్ 20న ఘనంగా సిఫారసు చేసింది. కానీ రెండు రోజులకే ఇరాన్ మీద దాడులకు దిగినందుకు ట్రంప్ మీద పాకిస్తాన్ మండిపడుతున్నది. అంతర్జాతీయ నిబంధనలు ఉల్లంఘించి ఏమిటీ యుద్ధం అంటూ కన్నెర్ర చేస్తున్నది.

ఈ ఏప్రిల్ మాసం నుంచి జరిగిన పరిణామాల కారణంగా భారత్–పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను ‘నిర్దిష్ట దౌత్యపరమైన జోక్యం’తో నివారించినందుకు ఆ అత్యున్నత పురస్కారం అందుకోవడానికి ట్రంప్ కంటే వేరెవరు ఉన్నారు, కాబట్టి ఆయనకే ఆ వీరతాడు వేయండి అని కోరింది పాకిస్తాన్. ఇంతలోనే కెనడాలో జీ7 శిఖరాగ్ర సదస్సు జరగడం, తరువాత భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలను చల్లార్చడంలో ట్రంప్ ప్రమేయం కాస్త కూడా లేదని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడం జరిగిపోయాయి. అవును, ఆయన చెప్పిందే నిజం అంటూ ట్రంప్ కూడా ఎట్టకేలకు అంగీకరించాడు. ఇక్కడ ట్రంప్ తనకు రెండు నాలుకలని నిరూపించు కుంటే, మాకు కూడా రెండే అంటూ మరొకసారి నిరూపించుకుంది పాకిస్తాన్. సీమాంతర ఉగ్రవాదంతో రెండు అణ్వాయుధ దేశాల మధ్య 1971 తరువాత ఏనాడు కానరానంత తీవ్ర స్థాయి ఉద్రిక్తతలు చెలరేగాయని, అవి యుద్ధంగా ముదిరి పోకుండా తన ప్రతిభావంతమైన నాయకత్వంతో ట్రంప్ నివారించారని పాకిస్తాన్ ప్రభుత్వం నోబెల్ కమిటీ చెవిన పడడానికి వీలుగా గొంతు చించుకుంది కూడా. యథాప్రకారం పాత అబద్ధాన్ని కూడా మళ్లీ పాడింది. ఈ ఉద్రిక్తతలను చల్లార్చడంలో మధ్యవర్తిత్వం వహించడానికి ఈ సంవత్సరం మే 8న దాయాది దేశాలు రెండు కూడా అంగీకరించా యని పాకిస్తాన్ చెప్పేసింది. ఇలాంటి నేపథ్యంలో శాంతి కోసం ట్రంప్ గొప్ప వ్యూహాత్మక దూరదృష్టిని ప్రదర్శించారని వేనోళ్ల శ్లాఘించింది. ఇరు దేశాల మధ్య అతి పెద్ద దౌత్య ప్రక్రియకు దోహదం చేసి తన రాజనీతిజ్ఞతను కూడా ట్రంప్ ప్రదర్శించా రంటూ, అమెరికా అధ్యక్షుడు, అక్కడి పౌరులు సిగ్గుతో చచ్చిపోయే ప్రమాద స్థితి తెచ్చింది పాకిస్తాన్. ఒకవేళ ఈ రెండు అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధం జరిగి, అది కోట్లాది ప్రజలకి, ఆసియా అవతల ఉన్నవారికి కూడా మూడేదని, అలాంటి పెను విపత్తును అలవోకగా తప్పించినవాడు ట్రంప్ అని పాకిస్తాన్ పొగడ్తల తుపాను సృష్టించింది. ఇవన్నీ పరిశీలిస్తే నిజమైన శాంతి స్థాపకుడిగా, చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలన్న తపన కలిగిన



వానిగా ట్రంప్ కనిపించారని ఆ దేశం ఊదర గొట్టింది. శ్వేతసౌధం కృషిని భారత్ తక్కువ చేసి చూపిస్తున్నదని కానీ శ్వేతసౌధం పాత్ర అసాధారణ మైనదని పాకిస్తాన్ ఆనాడు చెప్పింది. 2026 శాంతి పురస్కారం అందుకోవడానికి ట్రంప్ మినహా మరొకరు లేరు అంటూ ఆయనకే దక్కాలంటూ నోబెల్ కమిటీకి పాకిస్తాన్ విదేశీ వ్యవహారాల డిప్యూటీ మంత్రి ఇషాక్ దార్ ప్రతిపాదనలు కూడా పంపేశారు.

సీన్ కట్ చేస్తే–

ఇరాన్‌కు చెందిన మూడు అణు కేంద్రాల మీద బాంబులు వేసిన అమెరికాకి నోబెల్ శాంతి బహుమతి ఏమిటి? అంటున్నారు, అదే పాకిస్తాన్‌కు చెందిన రాజకీయ నేతలు, ప్రముఖులు. 2026కు ట్రంప్‌కే నోబెల్ ఇవ్వాలంటూ పాకిస్తాన్ ప్రభుత్వం ఆగమేఘాల మీద పంపించిన ప్రతిపాదనల మీద ఆలస్యం లేకుండా పునరాలోచన చేయాలని కూడా వారు జూన్ 23న విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు వీరంతా ఇరాన్ అణు పాటవాన్ని నివారించేందుకు ఫోర్డో, ఇస్ఫహాన్, నతాంజ్ అణు పరిశోధక కేంద్రాల మీద అమెరికా బాంబులు వేసిందని ఘోషిస్తున్నారు.

పాకిస్తాన్ ప్రభుత్వం చేసిన సిఫారుసు వెంటనే రద్దు చేసుకోవాలని జమాత్ ఉలేమా ఇ ఇస్లాం నాయకుడు, ప్రముఖ రాజకీయవేత్త మౌలానా ఫజులుర్ రెహమాన్ ఇంకొక రోజు ముందే అంటే జూన్ 22నే, ప్రభుత్వాన్ని దాదాపు ఆదేశించారు. అమెరికా అధ్యక్షుడు ప్రవచిస్తున్న శాంతి అంతా ఒట్టి మోసమని కూడా ఆయన తేల్చిపారేశారు. ఇప్పుడొక దేవరహస్యం కూడా బయటపడింది. అమెరికా సర్వ సైన్యాధ్యక్షుడు, ఫీల్డ్ మార్షల్ ఆసీమ్ మునీర్‌ను అమెరికాకు ఆహ్వానించి, పాకిస్తాన్ రాజకీయ నాయకత్వం మెప్పు పొందడానికి ట్రంప్ ఇదంతా చేశాడు తప్ప, ట్రంప్‌కీ, శాంతికీ ఏమీ సంబంధం లేదని మౌలానా తేల్చి చెప్పేశారు. తమ సైన్యాధ్యక్షుడికి అంత పెద్ద పీట వేసినందుకు, వచ్చినా రాకపోయినా కనీసం అలాంటి పురస్కారానికి ట్రంప్ పేరు సిఫారసు చేయడం బాగుంటుందని పాకిస్తాన్ ప్రభుత్వ నేతలు కూడా ఆలోచించిన విషయాన్ని ఇక్కడ దాచిపెడుతున్నారు. ‘పాలస్తీనా మీద దాడి చేసిన ఇజ్రాయెల్‌ను ట్రంప్ వెనుకేసుకొచ్చాడు. సిరియా, లెబనాన్, ఇరాన్ మీద ఇజ్రాయెల్ దాడులకు దిగినా ఆయన ఇజ్రాయెల్‌నే వెనకేసుకొచ్చాడు. ఇదంతా చూస్తుంటే శాంతి స్థాపన లక్షణం ఒక్కటైనా ఉందని అనుకోగలమా?’ అని మౌలానా నిలదీస్తున్నాడు. ఇక్కడ స్పష్టంగా కనపడేది– ముస్లిం దేశాల మీద జరిగిన దాడులను సమర్థించిన ట్రంప్‌ను వారు సమర్థించరు, అంతే. అసలు అఫ్ఘనిస్తాన్, పాలస్తీనా పౌరుల రక్తంతో తడిసిన చేతులతో ట్రంప్ నోబెల్ శాంతి పురస్కారం ఎలా అందుకుంటాడు అని కూడా మౌలానా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడే కాదు, భవిష్యత్తులోను మనం ట్రంప్‌ని శాంతి స్థాపకుడిగా చూడరాదని, శాంతి పురస్కారం కోసం ఇప్పుడు చేసిన సిఫారసును రద్దు చేసుకోవాలని మాజీ సెనేటర్ ముషాహిద్ హుసేన్ తన ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు.

మత పెద్దలు, జర్నలిస్టులు, మత పెద్దలు/ రాజకీయ నాయకులు అంతా కూడా ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి తరువాత ట్రంప్‌ను అతి పెద్ద ప్రతినాయకుడిగా చూస్తున్నారు. రెండు రోజుల క్రితం ట్రంప్‌లో కనిపించిన శాంతిదూత ఇలా హఠాత్తుగా మాయమైపోయి, ఒక యుద్ధోన్మాదిని చూడడం ఎవరి తప్పు? ఇందుకు దోహదం చేసిన పరిస్థితులు ఏమిటి? ఆలోచించడం పెద్ద కష్టం కాదు. ★

## కథ

మధ్యాహ్నం మూడు గంటలు దాటింది. బయట ముసురుగా ఉంది. పట్టాభి ఇంట్లో అంతకంటే ఎక్కువ ముసురుగానే ఉంది.

"మీ ధర్మ పన్నాలతో బతుకంతా కష్టాలమయం చేసుకున్నారు. మీ ఉపేక్ష చట్రంలోనే మమ్మల్నీ ఇరికించి కాళ్లూ చేతులూ కట్టిపడేశారు" తండ్రిమీద కారాలూ, మిరియాలూ నూరుతున్నాడు మౌళి.

"నలభై ఏళ్లుగా మూడెకరాల పొలం ఫలసాయాన్నీ చక్కగా ఆరగిస్తున్నారు వాళ్లు. ఇవాళ అసలు పొలమే తమది అంటూ ఏవో తప్పుడు కాగితాలు సృష్టించి మనల్ని ఛీ కొడుతున్నారు. ఇదెక్కడి ధర్మమో మీకే తెలియాలి" రెండో కొడుకు రాజేశ్వర్ అగ్గికి గాలిని తోడుజేస్తున్నాడు.

"తాడో పేడో తేల్చుకుందామంటుంటే, ఆ వెన్నెల మీసాల మధ్య నుంచీ సన్నని నవ్వూ, 'పోనీండ్రా, వాళ్లేం పరాయివాళ్లు కారుగా' అని 'అమిత అపేక్ష!' శాంతమ్మ కొడుకులకి మద్దతుగా భర్త స్వభావానికి కినుకని జూపింది. క్రీగంట భార్యని చూసి చూపు మరల్చుకున్నాడు పట్టాభి.

"చింతగుంటపాలెంలో పాత ఇంటిని రెండంతస్తుల మేడ చేసుకున్నారు. వేరే స్థలాలు మాత్రం ఉండి ఉండవూ? అంతా ఆ అయివేజులోంచీ వచ్చిన వేగా? మీ తమ్ముడి పెద్దకొడుకు విశ్వం చదువుని గుంట పెట్టి గంట వాయించి రాజకీయప్పక్షి అయ్యాట్ట. వాడికి చాలా బలగంఉందిట. అదీ పొగరు. అందుకనే మరీ అడ్డగోలుగా మాట్లాడుతున్నాడు." మౌళి దిగ్గున లేచి నిలబడ్డాడు.

"బందరులో రేపోమాపో బీపీసియల్ వచ్చే అవకాశాలున్నైట. ఎటూ పోర్టు బాగుపడుతుంది. దాన్తో భూముల ధరలకు రెక్కలొస్తున్నయ్. మన పొలం మూడెకరాల ధర కోట్లల్లో పలుకుతుంది" అన్నాడు రాజేశ్వర్.

"శివగంగ దాటితే నాలుగు కిలోమీటర్లు. అందునా ఈ పొలం నుంచీ చల్లపల్లి రోడ్డు, కూతవేటు దూరంరా. నేను చూశానుగా. యాభై ఏళ్ల క్రితం అంటే – అంతా బురదమయం, లోయగా ఉండేది. ఇప్పుడు సుక్షేత్రంగా మాగాణి అయిందిట" శాంతమ్మ వివరాల్లోకి వెళ్లింది.

"ఈసారి మనమే పోయొద్దాం రా రాజూ" అన్నాడు మౌళి, హాలంతా అలంగం తిరుగుతూ. ముగ్గుర్నీ నిశితంగా చూశాడు పట్టాభి. తల్లీ కొడుకులు గతాన్ని తవ్వుతున్నారు.

అవును. అప్పుడు పరిచయమైన మిత్రుడు గురురాజన్. ఎల్ఐసీలో ఉద్యోగి. అతనిది ఒక ముందుచూపు ప్రణాళిక. ఊరికి దూరంగా ఉన్న భూమిని చవుకలో కొని తాను బదిలీ మీద వెళ్లేప్పుడు ఎక్కువధరకు అమ్మి సొమ్ము చేసుకుని పోవటం. ఆ దూరదృష్టిని శతపోరి తనకెక్కించి ఆ పొలాన్ని చాలా చవగ్గా కొనిపించాడు. ప్రైవేటు టీచరుగా పనిచేస్తున్నాడు తను. ఆ భూమిని ఒక దారికి తేవాలంటే చేయాల్సిన పనుల గురించీ, కావలసిన వనరుల గురించీ తెలుసుకునేసరికీ గుండె బేజారెత్తింది. ఆ అవస్థలకి పూనుకోకుండా వదిలేశాడు. ఈలోగా మౌళి చదువు పూర్తయింది. హైదరాబాద్ ఈసీఐఎల్‌లో ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాతి ఏడాదే రాజేశ్వర్ కూడా బీహెచ్ఇఎల్ లో ఉద్యోగి అయ్యాడు. దాన్తో, కుటుంబాన్ని భాగ్యనగరానికి మార్చటం, అక్కడే స్థిరపడటం జరిగింది. పట్టాభి మెడికల్ ల్యాబ్‌లో ఎకౌంటెంట్‌గా చేరాడు. అక్కడ కొత్తల్లో ఉమ్మడి కుటుంబమే. పిల్లల పెళ్లిళ్లు అయిన తర్వాత మూడు కుంపట్లయినై. ఏఎస్‌రావు నగర్‌లో ఒక అంటుమిద్దెలో సగభాగం కొనుక్కుని, దాన్లో తానూ శాంతా మిగిలేరు.

ఆ రోజుల్లోనే ఓసారి బందరునుంచీ తమ్ముడు ఈశ్వర్రావూ అతని భార్య శారదా



**భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది**

హైదరాబాద్ వచ్చారు. పొలం విషయం ప్రస్తావించారు. 'ఎటూ నేను బందరు వదల్లేని వాడినే. ఏదో ఆ బియ్యం వ్యాపారంతో భార్యా, ఇద్దరు కొడుకులూ, ఇద్దరు కూతుళ్ల సంసారాన్ని బరువుగా లాక్కొస్తున్నాను. విశ్వంకి సరైన

# ధర్మజ గీత

**విహారి**



చదువు అబ్బలేదు. ఎవరో ఒక మంచి రైతుని చూసి, నీ పొలాన్ని ఒక దారికి తెప్పిస్తాను. అక్కడ కొంత మంది పొలాల్లో పంటలు వేస్తున్నారు. నువ్ పెద్ద మనసుతో ఆ పొలాన్ని నన్ను సాగుచేసుకోనిస్తే నీకు ఋణపడి వుంటాం.' అని కళ్లనీళ్ల పర్యంత మైనాడు. 'బంధుత్వం సంగతి కంటే, ఓ పేద సంసారాన్ని ఆదుకుంటున్నా మనుకొని ఈ సహాయం చేయండి అక్కయ్యా' అన్నది శారదమ్మ కూడా, తోడికోడలు చేతులు పట్టుకుని.

తనకు ఇష్టం లేదని చెప్పింది శాంత. ఆ రాత్రి తానే ఆమెకు నచ్చచెప్పాడు. 'మన ఇద్దరు పిల్లలూ జీవితాల్లో స్థిరపడ్డారు. కోడళ్లిద్దరూ కూడా ఉద్యోగినులు. రేపోమాపో ఇళ్లు కొనుక్కుంటారు. మనకు పనికిరాని దానిని వాడు బాగు చేసుకుంటా నంటున్నాడు. బతుకంటే బాధ్యత తెలిసినవాడు. నిజం గానే ఆ భూమిని ఒక పద్ధతికి తెస్తే మంచిది గదా'– ఇదీ తన ఆలోచన. అర్ధాంగీకారంగానే మౌనం వహిం చింది శాంత. తన మనస్సు నిండా బంధుత్వపాశం కన్నా కారుణ్యం పాలు ఎక్కువేమో! శాంత, కొడుకులూ అంటున్నట్టు ఇతరుల కష్టాల్ని చూసి అతిగా స్పందించే గుణమేమో! మర్నాడు –'అలాగే చేసుకోండిరా' అని సంతోషంగానే పంపించాడు– తమ్ముడినీ, మరదలినీ. ఆ తర్వాత మౌళికీ, రాజేశ్వర్‌కీ చెప్పింది శాంత.

ఏళ్లు గడిచాయి. మా పొలంలో వరి పండు తోందని తెలిసింది. ఎవరో అన్నట్టు 'పిట్టలు వేసిన రెట్టలమీదే చిగుళ్లు మొలిపించాడు' ఈశ్వర్రావు. నాళు గడుస్తున్నాయి. విషయాలు వివరంగా తెలుస్తున్న కొద్దీ – శాంతకీ, కొడుకులకీ కడుపులో గలపరింత మొదలైంది. గుండెల్లో ఇరుకుతనం, మనసులో కుమ్మపొగలా సెగ మొదలైనై. పదిసార్లు గృహ పార్లమెంటు సమావేశాలు ఏర్పాటుచేయటం, పొలం చర్చనీయాంశంగా పెట్టి తనని విపక్షంగా మాటల పొల్జేయటం! తనలోని బలహీనతల పొరల్ని విడదీసి తన ముందే కుప్పపోయటం. తన ముఖ్యమైన అవాంఛనీయ లక్షణాలు –'ధర్మ పన్నాలు', 'మెతక తనం' 'డబ్బంటే తృణప్రాయమైన దృష్టి' అని ఉపసంహారం!!

– తన అంతరంగికాన్ని సమీక్షించుకున్నాడు పట్టాభి.

– ఇప్పుడు సాయంత్రం ఆరుదాటింది. బయట ఈదురుగాలీ, చిరుజల్లూ ఆగి, దడదడ వాన చినుకులు రాలుతున్నై.

"మేమిద్దరం బందరుపోయి ఈ వ్యవహారం తేల్చుకొస్తాం" అన్నాడు మౌళి. మాట కరుకుగా వచ్చింది. 'నా వరకూ నేను ఈ నలభై ఏళ్లల్లో వచ్చిన ఆదాయంలో భాగం కూడా ఇక్కడ పెట్టమని అడుగుతాను' రాజేశ్వర్ తాను మరో అడుగుముందే ఉన్నానన్నట్టు – మొహం చెండుకున్నాడు.

"అందులో తప్పేముందీ" సన్నగా రాగం తీసి, తలవంచి భర్తవైపు పక్క చూపు చూసింది శాంతమ్మ.

క్షణం విరామం కలిగింది. అప్పుడు పెదవి విప్పాడు పట్టాభి, "ఎదుటివారి దృష్టిలోనూ మీదే ధర్మమనీ, తమది తప్పనీ అనిపించి, జ్ఞానోదయం కలిగితే అప్పుడు మీది ధర్మ, న్యాయం అవుతుంది. ఇదీ ధర్మరాజు చెప్పిన ధర్మసూక్ష్మం. అందుకనే దీన్ని ధర్మజ గీత అంటారు".

"మీదంతా డొంకతిరుగుడు భాష. మా కర్థం కాదు లెండి" అని మూతివంకర్లు తిప్పింది శాంతమ్మ.

"అమ్మ మాటతో తామిద్దరూ ఏకీభవిస్తున్న భంగిమలతో 'అవును' అన్నారు కొడుకులు. మనుషుల స్వభావాలు ఇలాంటి భంగిమల్లోనూ, మాటల స్వరాల స్థాయిలోనూ వెల్లడవుతూనే ఉంటాయి– అనిపించింది పట్టాభికి. "ఆదాయంలో భాగం కూడా అన్న కొడుకు మాట" వలన తన హృదయోద్వేగంతో తాను సతమతం కాసాగేడు.

– సరిగ్గా ఇప్పుడు చినుకుల్ని విదుల్చుకుంటూ, వడివడి అడుగులతో లోపలికి వచ్చాడు నీలకంఠం. శాంతమ్మ తమ్ముడు. ముందు– వానా ముసురూ గురించీ, ఆ తర్వాత కూతురింటికి తన రాక గురించిన మాటలూ, ఆ తరువాత పరామర్శలూ అయినై. శాంతమ్మ లేచి వెళ్లి మంచినీళ్లు తెచ్చిచ్చి, మళ్లీ వంటింట్లోకి నడిచింది.

అందర్నీ చూస్తూ, "ఏదో చర్చల్లో ఉన్నట్టున్నారు" అని, ఆ మరుక్షణం విజయవాడలో మారిన రాజకీయ పరిస్థితుల్లోకీ, తన కాఫీ టీ పొడుల వ్యాపారంలోకీ దిగి పోయాడు నీలకంఠం. ఎదుటి ముగ్గురూ మౌన శ్రోతలైనారు.

శాంతమ్మ కాఫీలు తెచ్చింది. కూచుంది. నీలకంఠం తన ధోరణిని ఆపి, "చెప్పక్కయ్యా!' అన్నాడు ఆమె వైపు చూస్తూ. కాఫీ సేవిస్తూ, ఆమె సమాధానానికి ఆగేడు.

"ఏం ఉందిరా! మీ బావగారి అతి మంచితనం, మా మరిదిగారి అంతస్తుని పెంచుతోంది. అదే మాట్లాడుకుంటున్నాం" అని. "బందరు పొలం వ్యవహారం నీకూ తెలుసుగా" అన్నది. నీలకంఠం కాఫీ కప్పుని పక్కన పెట్టి– "అఁ తెలియకేం. ఆయన పెద్దకొడుకు విశ్వం పెద్ద బటాఫోరు. రాజకీయాల్లో తిరుగుతున్నాడు. నాకు తెలుసు– వాడే మీ పొలానికి అసలు కబ్జాదారుడు!" అని నవ్వేడు. మౌళీ, రాజేశ్వర్, శాంతమ్మ మొహమొహాలు చూసుకున్నారు. ఈ మాటలు పట్టాభికి ఇబ్బంది పెట్టాయి. కుర్చీలో ఉసురుసురనుకున్నాడు. "అందుకనే వీళ్లిద్దరూ బందరు వెళ్లి పొలం సంగతి తేల్చుకొద్దామనే ఆలోచనలో ఉన్నారు" శాంతమ్మ చెప్పింది.

బావగారేమైనా చెబుతాడా అని పట్టాభివైపు మెడ తిప్పాడు నీలకంఠం. ఆయనేమీ అనలేదు.

"విషయం తెలిసినవాడివి. నువ్వొకసారి వాళ్లతో మాట్లాడితే…" అని అర్థోక్తిలో ఆగేడు మౌళి.

"ఆ మాటమీద ఉండండి. నా దగ్గర ఆ పోకిరి రాయుడి ఆటలు సాగవు. బెదిరింపులూ, దబా యింపులూ పన్జెయ్యవు. వాడి వెనుక రాజకీయముంటే, నేనూ రాజకీయంగానే వెళ్తా. యుద్ధమంటే, యుద్ధానికీ సిద్ధమే. అసలెందుకూ, కోర్టులోనే తేల్చుకుందాం" నీలకంఠం మాటల్లో ఆవేశంతో పాటు ఆత్మోత్కర్షా పెల్లుబికాయి.

"అదీ మాట, అట్టా ఉంటేగానీ ఇట్టాంటి వాళ్ల



పదిహేను రోజుల తర్వాత- పట్టాభికి ఫోన్ చేశాడు నీలకంఠం. "నా రాయబారం ఫలించలేదు బావా" అని "ఫోన్ని అక్కకివ్వు" అన్నాడు. భార్యకి ఫోన్ని అందించాడు పట్టాభి. ఆమె స్పీకర్ పెట్టింది. "ఆ విశ్వం చాలా దారుణంగా మాట్లాడుతున్నాడే అక్కయ్యా. 'పొలం మాది. నీ మధ్యవర్తిత్వమేందయ్యా' అని ఈసడించేశాడు. నేను పెట్టాల్సిన గడ్డి పెట్టేవచ్చాన్లే. మీ మరిది ఓ సాధు జంతువులా కూచున్నాడు.

కుతంత్రాల్ని ఎదుర్కోలేం" అన్నాడు మౌళి. అవునన్నట్టు తల వూపేడు రాజేశ్వర్.

పట్టాభి ఇప్పుడు మాటకలిపేడు. "యుద్ధాలూ, దాష్టీకాలూ, కోర్టులూ ఎందుకయ్యా నీలకంఠం? వాళ్లూ మన వాళ్లేగా! ఎనభై ఏళ్లొచ్చి కోర్టు మెట్లెక్కుతానా?" అన్నాడు. శాంతమ్మ ఠక్కున అందుకుంది, "చూడరా తమ్ముడూ, ఇదీ ఈయనగారి అతి మంచితనం. కళ్లెదుట జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూనూ ఇట్టా నీళ్లు నములుతారురా ఈయన" అన్నది.

"ఇదంతా ఎందుగ్గానీ, నువ్ ఈ వ్యవహారాన్ని ఒక కొలిక్కి తీసుకురా మామయ్యా., మా శ్రేయస్సు కోరే వాడివి. నీకు చెప్పేదేముంది" అన్నాడు మౌళి. కొద్దిసేపు విషయాలు చర్వితచర్వణం అయ్యాయి.

శాంతమ్మ విషయం మారుస్తూ "ఎటూ వచ్చావు గదా. రాత్రికి ఉండి వెళ్లరా" అన్నది. "లేదు, లేదు వెళ్లాలి. మా మణీ, అల్లుడూ ఎల్లుండి అమెరికా పోతున్నారు. వాళ్లని చూద్దామని వచ్చాం. మీ మరదలు అక్కడ పనుల్లో ఉంది" అన్నాడు. "సరే... టిఫిన్ చేస్తాను" అంటూ లేచింది. మిగిలిన వాళ్ల సంభాషణ మళ్లీ మొదలైంది!

* * *

పదిహేను రోజుల తర్వాత- పట్టాభికి ఫోన్ చేశాడు నీలకంఠం. "నా రాయబారం ఫలించలేదు బావా" అని "ఫోన్ని అక్కకివ్వు" అన్నాడు. భార్యకి ఫోన్ని అందించాడు పట్టాభి. ఆమె స్పీకర్ పెట్టింది. "ఆ విశ్వం చాలా దారుణంగా మాట్లాడుతున్నాడే అక్కయ్యా. 'పొలం మాది. నీ మధ్యవర్తిత్వమేందయ్యా' అని ఈసడించేశాడు. నేను పెట్టాల్సిన గడ్డి పెట్టేవచ్చాన్లే. మీ మరిది ఓ సాధు జంతువులా కూచున్నాడు. రెండో కొడుకు రాంబాబుకి విజయవాడలో ఏదో చిన్న ఉద్యోగంట. ఇవేవీ పట్టవు. కోర్టులో తేల్చుకోవటమే మంచిది" అని "ముందు ఓ లాయర్ నోటీస్ పడేయించమని చెప్పు పిల్లలకి" అంటూ ముగించాడు. "అంతే... అంతే.... అట్టాగే" అంటూ పూర్తి చేసింది శాంతమ్మ.

పట్టాభి మ్లానంగా చూస్తూ ఉండిపోయాడు. "అప్పుడే వాళ్లకేదో జరిగిపోతున్నదని మీరేమీ కుంగిపోవఖ్ఖర్లేదు. అన్యాయం జరిగింది మనకూ" అంటూ విసవిసా లోపలికి వెళ్లిపోయింది భార్య.

పేలవంగా నవ్వుకున్నాడు పట్టాభి. తమ్ముడి కుటుంబం పొలం మీది ఆదాయం అనుభవించిన మాట వాస్తవం. కానీ, అది ఎంత? సేద్యం ఖర్చులూ, అతివృష్టీ, అనావృష్టీ నష్టాలూ... అంతా పోను చేతికందింది ఏ నాలుగు రాళ్లో! అందులోనే, పిల్లల పెళ్లిళ్లు, పేరంటాలూ... అన్నీ నిభాయించుకొచ్చారు గదా - అనిపించింది. ఈ తలపుతో పాటు, ఆ విశ్వం ప్రవర్తనే మరీ బాధిస్తోంది అనీ మనసు నొచ్చుకుంది. కానీ, 'కానున్నది కాక మానదు' అని ఆలోచననుంచీ తేరుకున్నాడు.

ఈశ్వర్రావుకి - లాయర్ నోటీసు వెళ్లింది. సమాధానం లేదు. నెల దాటింది.

మౌళీ, రాజేశ్వర్ లాయర్ని సంప్రదిస్తే, కేసు వెయ్యదలచుకుంటే అయ్యే కోర్టు ఖర్చులూ, తన ఫీజూ లెక్కలు చెప్పాడాయన. ఆలోచించుకోమన్నాడు. ఆ అంకెల భయం - ఆలోచనల్లో, తర్జనభర్జనలో మరో రెణ్నెల్లు వెనకబడ్డాయి. నీలకంఠంతో చెబితే, "అవును ఒకసారి అడుసు తొక్కితే... అంతే మరి..." అని లౌక్యంగా అనేశాడు.

* * *

ఈ శతాబ్దపు మానవాళి విషాదం - కరోనా - వచ్చింది, వెళ్లింది. బందరులో ఈశ్వరరావునీ, శారదమ్మనీ, విశ్వంనీ, ఈశ్వర్రావు పెద్దకూతుర్నీ కరోనా తీసుకుపోయింది. నీలకంఠం వాళ్లు కులాసా అని పట్టాభివాళ్లకు తెలిసింది. వ్యాపారాలూ, వ్యవహారాలూ కుదేలైనాయి. అసలే యుగలక్షణంగా పురి సడలిన మానవ సంబంధాలు మరీ పుటుక్కుమనే స్థితికి దిగజారేయి. పట్టాభి పొలం వ్యవహారం గొంగళి సామెతగానే ఉండిపోయింది. మౌళి, రాజేశ్వర్ కూడా ఉద్యోగాలూ, సంసారాల సమస్యలతో అవస్థ పడుతున్నారు. శాంతమ్మకి ఏ కలత నిద్రలోనో బందరు సంగతులు గుర్తుకొచ్చి కలత బెడుతున్నా 'నా చేతిలో ఏం ఉంది?' అని చెప్పుకుని సమాధాన పడే స్థితికి వచ్చిందామె. క్రమశిక్షణ, అలవాట్లూ, సదాలోచనా, అంతకుమించి స్థిత ప్రజ్ఞ పట్టాభిని ఏ అనారోగ్యం పాలు చేయకుండా కాపాడుతున్నాయి.

- ఏడాది తిరిగింది.

ఆ వేళ-

స్నానాదికాలూ, పూజా పూర్తిచేసుకుని హాల్లోకి చేరారు.. పట్టాభీ, భార్యా. ఆయన పత్రికను పట్టుకున్నాడు. ఆమె తనలో తాను నిదానంగా స్తోత్ర పాఠమేదో చదువుకుంటోంది.

గుమ్మం దగ్గర అలికిడైంది. చూశారు.

పట్టాభి గుర్తు పట్టాడు. ఈశ్వర్రావు రెండో కొడుకు రాంబాబు, పక్కన పాతికేళ్ల యువతి. "రా... రా.... రాంబాబూ... " అని స్వాగతించాడు పట్టాభి. "ఈమె నా భార్య రమణి" అని పరిచయం చేశాడా యువతిని. ఇద్దరూ లోపలికి వచ్చి పెద్దవాళ్లకి పాదాభివందనం చేశారు. కుర్చీల్లో కూచున్నారు. శాంతమ్మే మాట కలిపింది, "కరోనా చేసిన విలయం విన్నాం. ఎవరూ ఎక్కడికీ కదిలే పరిస్థితులు కావుగా నాయనా" అన్నది.

జరిగిన సంభవాలే కదిలేయి సంభాషణలో. తన వివాహం సంగతీ చెప్పాడు రాంబాబు. "మాది ప్రేమవివాహం. ఈమె టీచర్ గా పనిచేస్తున్నది. హైదరాబాద్ వాళ్లే. మీ దయ వలన నేనూ- చిన్న జెరాక్సూ, స్టేషనరీ, బుక్షాపు పెట్టుకున్నాను".

కాఫీలు తెచ్చిచ్చింది శాంతమ్మ. ఆమెను అనుసరిస్తూ, తమ సంగతులు చెబుతూ తిరిగింది రమణి. కాఫీ తాగటం అయిన తర్వాత నేల చూపులు చూస్తూ చెప్పసాగేడు రాంబాబు. "చివరి రోజుల్లో నాన్న మీ పొలం గురించి చాలా బాధపడ్డాడు. మీ మంచితనాన్ని చెప్పుకుని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. అన్నయ్య తప్పుడు ప్రవర్తనే అన్ని అనర్థాలకీ కారణం" అని ఆగి ఉద్విగ్నతతో కళ్లొత్తుకున్నాడు. తలవొంచుక్కూచున్నాడు. కొద్దిసేపటికి తలెత్తి పట్టాభి వైపు చూస్తూ అన్నాడు, "పొలం కాగితాలు చూశాను. కౌలు రైతుతోనూ, లాయర్ తోనూ కూడా మాట్లాడాను. మిగిలిన వాళ్లం నేనూ, అక్కాబావలిద్దరూ ..." అని ఆగేడు.

ఏ భావమూ వ్యక్తం చేయని మొహంతో అతను చెప్పేది వింటున్నాడు పట్టాభి. ఆ తర్వాత ఏం చెప్పబోతున్నాడా అనే ఉత్కంఠతో చూస్తున్నది శాంతమ్మ.

బిడియంతోనూ, సిగ్గుతోనూ ఇబ్బంది పడుతూ, "లోకంలో క్షమించాల్సిన దోషాలే కానీ, శిక్షించాల్సిన నేరాలు లేవు" అన్నార్ట ఎవరో మహాకవి. మీకు చెప్పేంతవాణ్ణి కాదు" అని చేతులు నలుపుకుంటూ, మళ్లీ తలవొంచుకుని కూచున్నాడు. నెమ్మదిగా "అన్నయ్యలతో చెప్పి ఆ రాత కోతల పని పూర్తి చేయించండి" అన్నాడు.

పట్టాభి శాంతమ్మ వైపు చూశాడు. ఆమె భర్త మొహంవైపే చూస్తున్నది. ఆయన నొసటి మడతల్లో ఆమెకు ధర్మజ గీతే కనిపిస్తున్నదిప్పుడు!!

వచ్చేవారం కథ..

**జననీ జన్మ భూమిశ్చ**

- కె.వి.సుమలత






భారత క్రికెట్ వెలిగిపోతోంది. ప్రపంచంలోనే అత్యంత భాగ్యవంతమైన, విజయవంతమైన క్రికెట్ బోర్డుగా భారత క్రికెట్ నియంత్రణ మండలి-బీసీసీఐ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకొంది. క్రికెట్ పరంగా వివిధ అంశాలలో పరిపూర్ణ వికాసం సాధించిన బోర్డుగా నిలిచింది.

# విశ్వక్రికెట్లో 'వికసిత' భారత్!

టెస్టు హోదా పొందిన మొత్తం 10 దేశాల క్రికెట్ బోర్డులకే తలమానికంగా నిలిచింది. తాజా గణాంకాల ప్రకారం 1905 కోట్ల రూపాయల నికర ఆస్తులతో ప్రపంచంలోనే అత్యంత భాగ్యవంతమైన క్రికెట్ బోర్డుగా అవతరించింది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డుల కంటే 28 రెట్లకు పైగా సంపదతో భారత్ అగ్రభాగాన నిలిచింది.

## ఆటలోనే కాదు.. ఆర్జనలోనూ....

ప్రపంచీకరణ, సంస్కరణలతో భారత క్రికెట్ దిశ, దశ ఒక్కసారిగా మారిపోయాయి. 2008లో ప్రారంభమైన ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) తో బీసీసీఐ ఆదాయం గత 18 సంవత్సరాల కాలంలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. క్రికెట్ ప్రసారహక్కులు, డిజిటల్ హక్కుల విక్రయంతో వేలకోట్ల రూపాయల ఆదాయం రావటం ప్రారంభమయ్యింది. దీనికితోడు అంతర్జాతీయ క్రికెట్ మండలి-ఐసీసీకి వచ్చే ఆదాయంలో భారత వాటా కూడా వచ్చి చేరింది. ఐసీసీ నిర్వహించే ప్రపంచ క్రికెట్ (వన్డే, టీ-20, చాంపియన్స్ ట్రోఫీ, టెస్టులీగ్ సిరీస్) పోటీలతో రాబడి మరింతగా పెరిగింది. ప్రపంచంలోనే అత్యధిక క్రికెట్ అభిమానులున్న దేశంగా భారత్ నిలవడంతో క్రికెట్‌కు అతిపెద్ద అంతర్జాతీయ మార్కెట్ రూపంలో 'బంగారు బాతు' గా అవతరించింది. ఐసీసీ నిర్వహించే ప్రతి మూడు ప్రపంచకప్ టోర్నీలలో విధిగా ఒక టోర్నీకి బీసీసీఐ ఆతిథ్యమిస్తూ వస్తోంది. స్టేడియాలలో హోర్డింగులు, ప్రకటనల హక్కులతో పాటు మ్యాచ్‌ల టికెట్ల విక్రయాలతోనూ వచ్చే రాబడితో బీసీసీఐ ఖజానా నిండుకుండలా మారింది.

## అగ్రస్థానంలో భారత్, అట్టడుగున న్యూజిలాండ్

టెస్టు హోదా పొందిన మొత్తం 10 దేశాల క్రికెట్ బోర్డుల నికర ఆస్తుల తాజా లెక్కల ప్రకారం భారత్ 1905 కోట్ల రూపాయలతో అగ్రస్థానంలో నిలిస్తే..684 కోట్లతో క్రికెట్ ఆస్ట్రేలియా రెండు, 510 కోట్లతో ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు మూడు, 470 కోట్లతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నాలుగు, 441 కోట్ల రూపాయలతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఐదు స్థానాలు దక్కించుకొన్నాయి.

406 కోట్ల రూపాయల విలువైన ఆస్తులతో దక్షిణాఫ్రికా ఆరు, 329 కోట్లతో జింబాబ్వే క్రికెట్ బోర్డు ఏడు, 173 కోట్లతో శ్రీలంక క్రికెట్ బోర్డు ఎనిమిది, 129 కోట్లతో వెస్టిండీస్ క్రికెట్ బోర్డు తొమ్మిది, కేవలం 77 కోట్ల రూపాయలతో న్యూజిలాండ్ క్రికెట్‌బోర్డు 10 స్థానాలలో కొనసాగుతున్నాయి.

భారత క్రికెట్ బోర్డు ఓవైపు సంపాదనలో అగ్రగామిగా నిలిస్తే, పురుషుల, మహిళల విభాగాలలో భారత సీనియర్ , జూనియర్ జట్లు ఏదో ఒక ప్రపంచ టైటిల్ నెగ్గుతూ ప్రమాణాలలోనూ తమకు తామే సాటిగా నిలుస్తూ వస్తున్నాయి.

## మూడు ఫార్మాట్లలోనూ నంబర్ వన్ ర్యాంక్

గతేడాది వరకూ పురుషుల వన్డే, టీ-20, టెస్టు మూడు విభాగాలలోనూ భారత్ ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ జట్టుగా నిలుస్తూ వచ్చింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి దిగ్గజ స్టార్ల నేతృత్వంలో భారత్ రెండుసార్లు ఐసీసీ టెస్టు లీగ్ రన్నరప్ ట్రోఫీలతో పాటు..వన్డే ప్రపంచకప్ రన్నరప్, టీ-20 ప్రపంచకప్, మినీ ప్రపంచకప్ ట్రోఫీలను సాధించింది. మహిళల జూనియర్, సీనియర్ ప్రపంచకప్ టోర్నీలలోనూ మేటిజట్లలో ఒకటిగా భారత్ గుర్తింపు సంపాదించింది.

## పురుషులతో సమానంగా మహిళలకూ

పురుషులతో సమానంగా మహిళా క్రికెటర్లకు సైతం మ్యాచ్ ఫీజులు, శిక్షణ సదుపాయాలు, బిజినెస్ క్లాస్ విమాన ప్రయాణాల సౌకర్యం కల్పిస్తున్న ఘనత బీసీసీఐకి దక్కుతుంది.

దేశవాళీ రంజీ క్రికెట్లో పాల్గొనే క్రికెటర్లు ప్రతిసీజన్ లోనూ మ్యాచ్ ఫీజులు, ఇతర భత్యాల ద్వారా లక్షల రూపాయలు ఆర్జిస్తుంటే..అంతర్జాతీయ క్రికెటర్లు ఐపీఎల్‌తో పాటు బీసీసీఐ వార్షిక కాంట్రాక్టులు, మ్యాచ్ ఫీజులు, ఎండార్స్ మెంట్ మొత్తాలతో కోట్ల రూపాయలు కళ్ల జూస్తున్నారు. మహిళా క్రికెటర్లు మిథాలీరాజ్, స్మృతి మంధన లాంటి వారు సైతం బిలియనీర్ క్లబ్‌లో చోటు సంపాదించిన వారే.

ఇటు క్రికెటర్లు, అటు భారత క్రికెట్ బోర్డు ఆటతో పాటు సంపాదనలోనూ కదంతొక్కుతూ దూసుకుపోతుంటే విశ్వక్రికెట్లో వికసిత భారత్‌గా చెప్పుకోవడం ఏమాత్రం అతిశయోక్తికాదు.



కృష్ణారావు చొప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# రానున్నది రోబోల రాజ్యం!

**అన్ని రంగాల్లోనూ కృత్రిమ మేధ-ఏఐ ఆధారిత రోబోల వినియోగం నానాటికి పెరిగిపోతుండటం సమాజంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. మనుష్యులు చేయాల్సిన పనుల్లో చాలావరకు రోబోలు చేస్తున్న కారణంగా ఉన్న ఉపాధిని కోల్పోవడమేకాకుండా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు కనుమరుగైపోయే ముప్పు అయితే ముంచుకొస్తోంది. చర్యలో పాల్గొనకుండా చర్యను ప్రభావితం చేసే ఉత్ప్రేరకాలు లాంటి ఏఐ పరిణామ క్రమంలో వేగం, అందుబాటులోకి శక్తిమంతమైన చిప్‌లు, ధరల్లో తగ్గుదల, నైపుణ్యాలు, ఉత్పాదకత ఆవశ్యకతల మేలు కలయిక రోబోల వాడకాన్ని విస్తృతం చేసింది.**

రోబోలు ప్రస్తుతం చాలా చోట్ల కనిపిస్తున్నాయి. అవి విమానాశ్రయాలలోని కొన్ని ఎయిర్‌లైన్ కౌంటర్ల వద్ద చెక్-ఇన్‌లను సులభతరం చేస్తున్నాయి. హోటల్ రిసెప్షన్ ప్రాంతాల్లో అతిథులకు వెల్‌కమ్ డ్రింక్‌లు అందిస్తున్నాయి. రెస్టారెంట్లలో ఆర్డర్లకు తగ్గట్టుగా కస్టమర్లకు ఆహార, పానీయాలను స్వయంగా తెచ్చి పెడుతున్నాయి. గిడ్డంగులు, కర్మాగారాలు, లాజిస్టిక్ హబ్‌ల వద్ద కాపాలా కాస్తున్నాయి. మధుశాలల్లోనూ మోహరిస్తున్నాయి. శస్త్ర చికిత్స చేయడంలో వైద్యులకు సాయపడుతున్నాయి. రోబోలు అన్ని చోట్ల కనిపించకపోయినప్పటికీ వాటి ఉనికిని గణనీయంగా చాటుకుంటున్నాయి. సాఫ్ట్ బ్యాంక్ సీఈవో మసయోషి సన్ టీఎస్‌ఎంసీతో కలిసి 1.3 ట్రిలియన్ డాలర్లతో రోబోలు, ఏఐ హబ్‌ల నిర్మాణం కోసమని ప్రాజెక్ట్ క్రిస్టల్ ల్యాండ్ చేపట్టారు. టెస్లా కంపెనీ టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో రోబో ట్యాక్సీని ఆవిష్కరించ డానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. విడియా, ఫాక్స్‌కాన్ హ్యూస్టన్ ఏఐ సర్వర్ ప్లాంట్‌లో హ్యూమ నాయిడ్ రోబోలను మోహరించడానికి చర్చలు జరుపుతున్నాయి. అమెజాన్ తన గిడ్డంగుల్లో ఏఐ ఆధారిత వుల్కాన్ రోబోలను నియమించింది. యావత్ లాజిస్టిక్ కార్యకలాపాలను యాంత్రీకరణ చేయడం కోసమని 200 బిలియన్ డాలర్లను ఖర్చు చేయడానికి ప్రణాళిక చేస్తోంది. ప్రణాళిక సాకారమైన పక్షంలో రానున్న రోజుల్లో డెలివరీ బాయ్‌లకు బదులుగా డెలివరీ రోబోలు మన ఇంటికి వచ్చి కాలింగ్ బెల్ కొట్టి మరీ సరకులు అందిస్తాయి. అచ్చం మానవ చెయ్యి లాగా పనిచేసే మొట్టమొదటి రోబో చేతిని ఒకానొక చైనా కంపెనీ తయారు చేసింది. హెక్సగాన్ కంపెనీ పరిశ్రమల్లో తూనికలు, కొలతలకు సంబంధించిన పనులను చేయడానికి అయెాన్ అనే హ్యూమనాయిడ్‌ను ఆవిష్కరించింది.

ఉత్పాదకతను పెంచుకోవడంలో పరస్పరం పోటీపడుతున్న భారతీయ కంపెనీలు సైతం తమ వ్యాపారాల్లో రోబోటిక్స్‌ను వినియోగించుకోవడానికి ఉవ్విళ్లూరుతున్నాయి. రిలయన్స్ అండదండలు ఉన్న ఏడ్‌వెర్బ్ కంపెనీ '3డీ ఉద్యోగాలు' లేకుండా చేయడానికి హ్యూమనాయిడ్ రోబోలను రంగంలోకి దించుతోంది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఇన్వెంటో కంపెనీ రిటైల్, ఆతిథ్య రంగాల్లో సేవలందించడానికి తోడు వయోవృద్ధుల సంరక్షణ కోసమని మిత్రా రోబోలను అభివృద్ధి చేస్తోంది. కోచికి చెందిన అసిమోవ్ రోబోటిక్స్ అత్యంత ప్రమాదకరమైన వాతావరణంలో పనులు చేసే రోబోలను తయారు చేస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న స్వయ రోబోటిక్స్ తయారీ, లాజిస్టిక్స్ రంగాల్లో పనుల్లో సాయపడటానికి పారిశ్రామిక రోబోలను అభివృద్ధి చేస్తోంది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న జెనోబోటిక్స్ అనే స్టార్టప్ కంపెనీ మురికి కాలువలను శుభ్రం చేయడానికి బాండికూట్ రోబోను అభివృద్ధి చేస్తోంది. అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న కోది అనే కంపెనీ నిఘా, కార్యాలయసేవలు, పారిశ్రామిక అవసరాల కోసమని రోబోలను తయారు చేస్తోంది.

రోబో అనే మాట జెక్ భాషలో రోబోటా అనే పదం నుంచి వచ్చింది. ఆశ పదానికి వెట్టి చాకిరి అనే అర్థం వస్తుంది. 1921లో జెక్ రచయిత కరెల్ కాపెక్ ఇదే పదంతో రొస్సుమ్స్ యూనివర్శల్ రోబోస్ అనే సైన్స్ ఫిక్షన్ నాటకాన్ని రచించారు. సినిమాల విషయానికి వస్తే 1927లో విడుదలైన మెట్రోపోలిస్ సినిమాతో రోబోలు తెరంగేట్రం చేశాయి. భవిష్యత్తులో రెండుగా చీలిపోయిన నగరంలో రకరకాలుగా చెదిరిపోయిన సమాజం గురించి ఈ సినిమా చెబుతుంది. 2007లో బొమ్మలు తయారుచేసే హాస్‌బ్రో గ్రహాంతర రోబోలు ఇతివృత్తంగా నిర్మించి, విడుదల చేసిన ట్రాన్స్‌ఫార్మర్స్, అంతకుముందు వచ్చిన టెర్మినేటర్ సినిమాలు రోబోలకు ఎక్కడ లేని పేరు, ప్రతిష్టలను తీసుకొచ్చాయి.

ఎప్పుడో శతాబ్దం క్రితం నాటక రచయిత కాపెక్ పుట్టించిన రోబో అనే పదం నేడు అనితర సాధ్యంకాని





విధంగా సాగుతున్న రోబో పరిణామ క్రమానికి బీజం వేసింది. ఈ విషయంలో సాంకేతికత, జ్ఞానం ఏకమై పెట్టుబడులను పట్టుకొస్తున్నాయి.

కేవలం 10 రోజుల వ్యవధిలోనే రోబోలను అభివృద్ధి చేస్తున్న అనేక స్టార్టప్ కంపెనీలకు కోట్లాది డాలర్లు పెట్టుబడుల రూపేణా వెల్లువెత్తాయి. రోబో శునకాలు, హ్యూమనాయిడ్ రోబోలకు పర్యాయ పదంగా మారిన చైనాకు చెందిన యూనిట్రీ రోబోటిక్స్ కంపెనీ 140 కోట్ల డాలర్ల విలువైన పెట్టుబడులను దక్కించుకుంది. పీట్స్‌బర్గ్ కేంద్రంగా పనిచేస్తున్న గెకో రోబోటిక్స్ స్టార్టప్ కంపెనీ పెట్టుబడుల రూపేణా 125 కోట్ల డాలర్లను రాబట్టింది. పారిశ్రామిక రోబోలను తయారుచేసే స్లోవెనియాకు చెందిన సన్‌రైజ్ రోబోటిక్స్‌కు 85 లక్షల డాలర్ల విలువైన పెట్టుబడులు వచ్చాయి. విహంగ రోబోలకు పేరొందిన జ్యూరిష్ కేంద్రంగా పనిచేస్తున్న వోలిరా కంపెనీ 2 కోట్ల 30 లక్షల డాలర్ల మేరకు పెట్టుబడులను పొందింది. రోబోల ద్వారా మొబైల్ ఫోన్లను ప్యాకింగ్ చేయడంపైన దృష్టి పెట్టిన ఐరోపాకు చెందిన సోజో ఇండస్ట్రీస్ నాలుగు కోట్ల డాలర్లను పొందింది. న్యూయార్క్‌లో డెలివరీ స్టార్టప్‌గా పేరొందిన కోకో రోబోస్ డెలివరీ రోబోలను రంగంలోకి దించడానికి పెట్టుబడుల రూపేణా 8 కోట్ల డాలర్లను సమీకరించ గలిగింది. చర్యలో పాల్గొనకుండా చర్యను ప్రభావితం చేసే ఉత్ప్రేరకాలు లాంటి ఏఐ పరిణామ క్రమంలో వేగం, అందుబాటులోకి శక్తిమంతమైన చిప్‌లు, ధరల్లో తగ్గుదల, నైపుణ్యాలు, ఉత్పాదకత ఆవశ్యకతల మేలు కలయిక రోబోలో వాడకాన్ని విస్తృతం చేసింది. ఏఐ అల్గోరిథమ్‌లు ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పటికీ అప్పటికప్పుడు అందివచ్చిన డేటాను విశ్లేషించడంలోనూ, సత్వరం స్పందించడంలోనూ, క్లిష్టమైన పనులను సైతం సులువుగా చక్కబెట్టడం లోనూ రోబోలకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. మెషిన్ లెర్నింగ్ రోబోలకు సమర్థవంతంగా పనిచేయడంలో తోడ్పడుతోంది.

అయితే పెద్ద ఎత్తున రోబోలను అభివృద్ధి చేసి వాటిని విస్తృతంగా వాడటానికి అడ్డుపడే పెద్ద అవాంతరంగా నైపుణ్యంతో కూడుకున్న మానవ వనరుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. కోర్న్ ఫెర్రీ నివేదిక ప్రకారం రోబోల ఉత్పాదకతకు సంబంధించి 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యంతో కూడుకున్న 8.5కోట్ల ఉద్యోగాలు భర్తీ కాకుండా ఖాళీగా పడి ఉంటాయి. వయోవృద్ధుల జనాభా అంతకంతకు పెరిగిపోతున్న దేశాల్లో ప్రతీ 10 వేల ఉద్యోగుల్లో రోబోల సంఖ్య అంతకంతకూ పెరిగి పోతోంది. ఆ లెక్కన దక్షిణ కొరియాలో ప్రతీ 10 వేల ఉద్యోగుల్లో రోబోల సంఖ్య 1,102 ఉండగా, అదే నిష్పత్తిలో సింగపూర్‌లో 770, చైనాలో 470, జర్మనీలో 429, జపాన్‌లో 419 రోబోలుగా ఉంది. గడిచిన ఏడేళ్లలో అంతర్జాతీయంగా పరిశ్రమల్లో పనిచేస్తున్న రోబోల సంఖ్య రెండింతలు అయ్యింది. రోబోల ప్రస్తుత మార్కెట్ విలువ 64.8 బిలియన్ డాలర్లు కాగా 2035నాటికి అది 375.82 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఓ అంచనా.

అన్ని రంగాల్లోనూ కృత్రిమ మేధ–ఏఐ ఆధారిత రోబోల వినియోగం నానాటికి పెరిగిపోతుండటం సమాజంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. మనుష్యులు చేయాల్సిన పనుల్లో చాలావరకు రోబోలు చేస్తున్న కారణంగా ఉన్న ఉపాధిని కోల్పోవడమే కాకుండా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు కనుమరుగైపోయే ముప్పు అయితే ముంచుకొస్తోంది. టెస్లా, ఫాక్స్‌కాన్ కంపెనీలు ఇటీవలి సంవత్సరాల్లో సిబ్బందిని తగ్గించుకున్నాయి. క్లార్నా, యూపీఎస్, డూలింగో, ఇన్ట్యూట్, సిస్కో లాంటి కార్పొరేట్ కంపెనీలు ఉద్యోగుల స్థానాన్ని ఏఐ యాంత్రీకరణతో భర్తీ చేస్తున్నాయి. రానున్న సంవత్సరాల్లో కంపెనీలో ఉద్యోగుల సంఖ్యపై కోత విధిస్తామని అమెజాన్ సీయీవో ఆండీ జస్సీ ఈమధ్యనే సెలవిచ్చారు. ఏఐ ఆధారిత రోబోలను కేవలం వయోవృద్ధుల జనాభా అధికంగా ఉన్న దేశాలు మాత్రమే విస్తారంగా వినియోగించుకుంటున్నాయని అంటే పొరపాటు అవుతుంది. ఎందుకంటే యువతతో పాటుగా 30 ఏళ్ల లోపు వయస్సున్న వారి జనాభా అత్యధికంగా ఉన్న భారత్, మెక్సికో లాంటి దేశాలు రోబోలను విరివిగా వాడుకోవడంలో ఏ మాత్రం తగ్గడంలేదు కాబట్టి. ప్రపంచ బ్యాంకు చేపట్టిన ఒక అధ్యయనం ప్రకారం ఏఐ ఆధారిత సాంకేతికత ఆర్థికంగా పురోగమించిన దేశాల్లో 60 శాతం ఉద్యోగాలను, ఆర్థికంగా ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నవి దేశాల్లో 40 శాతం ఉద్యోగాలపై పెను ప్రభావం చూపిస్తాయి. సాంకేతికత ఉద్యోగాలను సైతం సృష్టిస్తుంది అన్న మాటే నిజమే కానీ అదే సమయంలో అందుకోసమని అది సంప్రదాయ ఉద్యోగాలను పణంగా పెడుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**– జాగృతి డెస్క్**



# బాల జాగృతి

## భక్తాగ్రేసరులు



## తరిగొండ వెంగమాంబ

తిరులేశుని కొలిచి తరించిన భక్త ప్రముఖుల్లో తరిగొండ వెంగమాంబ ఒకరు. సా.శ.1730 ప్రాంతంలో తిరుపతి సమీపంలోని తరిగొండలో జన్మించిన ఆమెకు బాల్యం నుంచే వేంకటేశ్వరుని పట్ల భక్తి భావం ఎక్కువ. పెళ్లయినా కొన్నాళ్లకే భర్త కాలం చేశాడు. అదేమి పట్టని ఆమె, తనకు జరిగినది వివాహమే కాదని, శ్రీమన్నారాయణుడే తన భర్త అని భావించేది. ఒకనాడు ఇంట్లో ఎవరికి చెప్పకుండా తిరుమల చేరుకుంది. శ్రీనివాసుడిని సేవిస్తూ, కొండపై తులసి వనాన్ని పెంచి, దానితో అల్లిన మాలలను స్వామికి సమర్పించేది. 'విష్ణు పారిజాతం' అనే యక్షగానాన్ని రాసి స్వామికి అంకితమిచ్చారు. శ్రీ వేంకటాచల మహాత్మ్యం, అష్టాంగ రాజయోగం, శ్రీకృష్ణ మంజరి, రుక్మిణీ కల్యాణం, జలక్రీడా విలాసం, గోపికా నాటకం తదితర గ్రంథాలు రాశారు. నేటికీ స్వామి వారి పవళింపు సేవకు ముందు ఆమె పేరిట ముత్యాలహారతి ఇస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఈమె పేరిట భారీగా నిత్యాన్నదానం నిర్వహిస్తోంది.

## కథ | ప్రాణం కాపాడిన పీత



అనగనగా ఒక ఊరిలో ఓ కుర్రాడు. అతను ఒకసారి పట్టణంలో జరిగే వేడుకలు చూడడానికి వెళ్లాలనుకున్నాడు.

ఆ విషయాన్ని వాళ్ల అమ్మ దగ్గరికి వెళ్లి చెప్పాడు. కానీ.. అప్పుడు ఆమెకు బాగా పని ఉండడం వల్ల తన కొడుకుతో వెళ్లే పరిస్థితి లేదు. అందుకే 'నువ్వు ఒక్కడివే వెళ్లడం నాకు ఇష్టం లేదు. ఎవరినైనా తోడుగా తీసుకెళ్లు నాయనా" అని చెప్పింది.

దానికి బదులుగా ఆ కుర్రాడు 'తోడు రావడానికి ఎవరూ లేరమ్మా. నేను ఒక్కడినే వెళ్తాను ఏం పరవాలేదు' అన్నాడు. ఒక్కడినే పంపడం ఇష్టంలేని వాళ్ల అమ్మ కొడుకు ఎంత చెప్పినా ఒప్పుకోలేదు. చివరకు 'కనీసం ఈ పీతను అయినా తీసుకుపో నాయనా. నీకు తోడుగా ఉంటుంది' అని ఇంటి పక్కన ఉన్న నీటి గుంటలో నుంచి ఒక పీతను తీసి ఇచ్చింది.

పీతను వెంట తీసుకెళ్లడం వృథా అని తెలిసినా అమ్మ మాట కాదనలేక దాన్ని బుట్టలో పెట్టుకొని బయలుదేరాడు. అలా కొంతదూరం వెళ్లిన తర్వాత అలిసిపోయి అడవిలో ఒక చెట్టు కింద పడుకున్నాడు.

అంతలోనే ఆ చెట్టు తొర్రలోనుంచి ఒక పాము వచ్చింది. అది కుర్రాడిని కాటేయడానికి

## పద్యం

బంగారు కుదువ బెట్టకు
సంగరమున బాఱిపోకు సరసుడవైనన్
అంగడి వెచ్చము లాడకు
వెంగలితో జెలిమి వలదు వినరా సుమతీ!

**భావం :** అవసరానికి బంగారం తాకట్టు పెట్టకు. యుద్ధరంగం నుంచి పారిపోవద్దు. నిత్యావసరాలను దుకాణంలో అప్పుపెట్టి తీసుకోవద్దు. మంచి, చెడు విచక్షణ లేనివానితో స్నేహం చేయవద్దు.

## శ్లోకం

'గురు మధ్యే స్థితం విశ్వం
విశ్వమధ్యే స్థితో గురుః
విశ్వరూపో విరూపోసౌ
తస్మై శ్రీ గురవే నమః

**భావం :** విశ్వమంతా గురువులో ఉంది. గురువు విశ్వమంతటా ఉన్నాడు. సాకార విశ్వరూపుడు, నిరాకర పరబ్రహ్మ అయిన గురువుకు వందనం.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| భారతదేశం | విక్టరీ మెడల్ |
| బ్రిటన్ | మిలటరీ క్రాస్ |
| యూఎస్ఏ | పరం వీరచక్ర |
| బెల్జియం | ఐరన్ క్రాస్ |
| జర్మనీ | విక్టోరియా క్రాస్ |

సమాధానాలు : భారతదేశం-పరం వీరచక్ర; బ్రిటన్-విక్టోరియా క్రాస్; యూఎస్ఏ-విక్టరీ మెడల్; బెల్జియం-మిలటరీ క్రాస్; జర్మనీ-ఐరన్ క్రాస్.

## శాస్త్రవేత్తలు



### బీర్బల్ సాహ్ని (1891-1949)

ఈయన వృక్ష శాస్త్రవేత్త. శిలాజ మొక్కలు (Fossil Plants), వాటి పరిణామక్రమం (Evolution) పై పరిశోధనలు చేశారు. లఖ్‌నవూలోని బీర్బల్ సాహ్ని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలియోసైన్సెస్‌ను ఈయనే స్థాపించారు. భూగర్భశాస్త్రం, పురావస్తుశాస్త్రంలోనూ ఈయన పరిశోధనలు చేశారు. సాహ్నికి లండన్ రాయల్ సొసైటీలో సభ్యత్వం ఉంది. ఇంటర్నేషనల్ బొటానికల్ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా, భారత సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్‌కు ఉపాధ్యక్షుడిగా పని చేశారు.

## జనరల్ నాలెడ్జ్

1. ఏ రంగంలో ప్రతిభ కనబరిచిన వారికి 'ఆస్కార్' అవార్డును అందజేస్తారు?
2. మనదేశంలో ప్రభుత్వ ఉద్యోగులు అత్యధిక సంఖ్యలో పనిచేస్తున్న సంస్థ ఏది?
3. స్వరాన్ని లేదా ధ్వనిని కొలిచే సాధనాన్ని ఏమంటారు?

జవాబులు : 1. సినిమా; 2. భారతీయ రైల్వేలు; 3. సోనో మీటర్.



వస్తూ అనుకోకుండా బుట్టలోకి దూరింది. దాంతో పీత పాముతో పోరాడి, తన కోరల్లాంటి కొండ్లతో పాము మెడ కత్తిరించేసింది.

నిద్రలేచిన కుర్రాడు ఆ దృశ్యాన్ని చూసి, జరిగిందంతా అంచనా వేశాడు. తన ప్రాణం కాపాడిన పీతకు కృతజ్ఞతలు చెప్పాడు.

అమ్మను గుర్తు తెచ్చుకుని మనసులో నమస్కరించుకున్నాడు. "నేను అమ్మ మాట వినకుండా పీతను వెంట తీసుకురాకుంటే ప్రాణాలు పోయేవి' అనుకుని అమ్మ మాట వింటే ఎప్పుడూ మంచే జరుగుతుంది అని మనసులో తలుచుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తెల్లవారే సరికి పట్నం చేరుకుని వేడుకలు చూసి, తిరిగి ఇంటికి వచ్చి జరిగిందంతా అమ్మతో చెప్పాడు. ★

## మెదడుకు మేత

ఆకు చిటికెడు.
కాయ మూరెడు?

జవాబు : ములగకాయ

## మంచిమాట

వంద మాటలు
చెప్పేకంటే ఒక్క మంచి
పని చేసి చూపటమే
మేలు

– కందుకూరి వీరేశలింగం




# వారఫలాలు

30 జూన్,- 6 జులై 2025



సింహంభట్ల సుబ్బారావు
6300674054



**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

పలుకుబడి, హోదాలు కలిగిన వ్యక్తుల పరిచయం. శుభకార్యాలలో పాల్గొంటారు. ఆదాయం ఆశాజనకం. ముఖ్య కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. స్థిరాస్తి కొనుగోలు యత్నాలు సఫలం. వ్యాపారులకు తగినంత లాభాలు. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, కళాకారులకు అనూహ్యమైన అవకాశాలు. 30,1 తేదీలలో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.



**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఇంతకాలం పడిన కష్టం ఫలిస్తుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు. ఆదాయం గతంకంటే మెరుగు. సన్నిహితులు సహాయసహకారాలు అందిస్తారు. వ్యాపారులు లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు దక్కుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. 2,3 తేదీల్లో వృథా ఖర్చులు. ఆరోగ్యసమస్యలు. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.



**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

అనుకున్న కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేస్తారు. కొన్ని వివాదాలు పరిష్కరించుకుంటారు. కొత్త కాంట్రాక్టులు. వాహనాలు, భూములు కొంటారు. చిన్ననాటి స్నేహితులతో ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాలు పూర్తి చేస్తారు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు గందరగోళం తొలగుతుంది. 3,4 తేదీల్లో దుబారా వ్యయం. శివాష్టకం పఠించండి.



**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

సన్నిహితులతో విభేదాలు నెలకొనే అవకాశం. విద్యార్థులు, నిరుద్యోగులకు అవకాశాలు నిరాశ పరుస్తాయి. ఆలోచనలు స్థిరంగా సాగవు. ఆస్తి వివాదాలు కొంత ఇబ్బందికరం. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారులు ఆచితూచి ముందుకు సాగాలి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు మీదపడవచ్చు. పారిశ్రామికవేత్తలు, రచయితలు, క్రీడాకారులకు విదేశీపర్యటనలు వాయిదా. 4,5తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.



**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి. కొన్ని సమస్యలు తీరి ఊరట. ఆస్తుల వ్యవహారాలలో చికాకులు తొలగుతాయి. ప్రముఖులతో పరిచయాలు. గత సంఘటనలు గుర్తుకు వస్తాయి. వ్యాపారులకు తగినంత లాభాలు. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితల యత్నాలు సఫలం. 5,6 తేదీల్లో వ్యయప్రయాసలు. ఆంజనేయ దండకం పఠించండి.



**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. వివాహయత్నాలు కలసివస్తాయి. భూములు, వాహనాలు కొనుగోలు చేసేవీలుంది. వ్యాపారులకు పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఒడిదుడుకులు తొలగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకులకు శుభవార్తలు. 1,2 తేదీల్లో బంధు విరోధాలు. ఆరోగ్య సమస్యలు. అంగారక స్తోత్రాలు పఠించండి.



**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ముఖ్య కార్యక్రమాలను పట్టుదలతో పూర్తి చేస్తారు. విద్యార్థులకు విదేశీ విద్యావకాశాలు లభించవచ్చు. ఆస్తి వ్యవహారాలలో ఒప్పందాలు. వ్యాపారులకు క్రమేపీ లాభాలు అందుతాయి. ఉద్యోగస్తులకు విధుల్లో మరింత అనుకూలస్థితి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు అనుకున్న అవకాశాలు దక్కుతాయి. 3,4 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. ఆదిత్య హృదయం పఠించండి.



**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

బంధుమిత్రులతో మరింత సఖ్యత నెలకొంటుంది. ఓర్పుతో కొన్ని సమస్యలను అధిగమిస్తారు. విచిత్ర సంఘటనలు ఎదురు కావచ్చు. రావలసిన బాకీలు అందుతాయి. వ్యాపారులు లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తులకు కొత్త బాధ్యతలు దక్కే అవకాశం. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు లక్ష్యాలు నెరవేరే సమయం. 5,6 తేదీల్లో ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. శివపంచాక్షరి పఠించండి.



**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

దూరప్రాంతాల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. విద్యార్థులకు విదేశీ ఛాన్స్ ఉండవచ్చు. వ్యాపారులు మరింత లాభదాయకంగా ఉంటాయి. ఉద్యోగస్తులకు ఒక సమాచారం ఊరట. రాజకీయ వేత్తలు, కళాకారులు, రచయితలకు మరింత ప్రగతి ఉంటుంది. 30,1 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.



**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

సమాజంలో విశేష గౌరవం పొందుతారు. ఆశించినంత ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. ఉద్యోగావకాశాలు దక్కుతాయి. పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులకు లాభాలు మరింత దక్కుతాయి. ఉద్యోగస్తులకు అనుకూల మార్పులు ఉండవచ్చు. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు నూతనోత్సాహం. 1,2 తేదీల్లో మానసిక ఆందోళన. గాయత్రీ ధ్యానం చేయండి.



**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

బంధువులతో ఉత్తరప్రత్యుత్తరాలు సాగిస్తారు. స్థిరాస్తి విషయంలో కొత్త అగ్రిమెంట్లు చేసుకుంటారు. ఇంటి నిర్మాణాలు ముమ్మరం చేస్తారు. నిరుద్యోగులు అవకాశాలు. వ్యాపారులకు పెట్టుబడులు ఊరట నిస్తాయి. ఉద్యోగస్తులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, పరిశోధకులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. 3,4 తేదీల్లో ఖర్చులు. శారీరక రుగ్మతలు బాధిస్తాయి.



**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. బంధువుల నుంచి ఒక ముఖ్య సమాచారం. ఇంటి నిర్మాణాలు, కొనుగోలు ప్రయత్నాలు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. విద్యార్థులు సత్తా చాటుకుంటారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగస్తులకు విధి నిర్వహణలో ఒత్తిడులు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు ఊహించని అభివృద్ధి. 4,5 తేదీల్లో శారీరక రుగ్మతలు. ఆకస్మిక ప్రయాణాలు. గణేశ్‌స్తోత్రాలు పఠించండి.

# పదరసం - 520

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ■ | 3 | 4 | | ■ | 5 | |
| | ■ | 6 | | ■ | | ■ | 7 | | ■ |
| ■ | 8 | | ■ | 9 | | 10 | ■ | 11 | 12 |
| 13 | | ■ | 14 | | ■ | 15 | | ■ | |
| | ■ | 16 | | ■ | 17 | | ■ | 18 | |
| ■ | 19 | ■ | 20 | 21 | | ■ | 22 | | ■ |
| 23 | | | ■ | | ■ | 24 | | ■ | 25 |
| ■ | | ■ | 26 | | ■ | 27 | | 28 | |
| 29 | | 30 | ■ | ■ | 31 | | ■ | | ■ |
| | ■ | 32 | | ■ | | ■ | 33 | | |

## ఆధారాలు

**అడ్డం**

1. చెట్టు (3)
3. కాలంకాని కాలం (3)
5. వానరం (2)
6. ధైర్యశాలి, సమర్థుడు (2)
7. నవనీతం (2)
8. స్వామికి వికృతి (2)
9. మధుర దేవత అటుఇటుగా(3)
11. నాయనే...అటు నుంచి (2)
13. ఒడ్డు, దరి (2)
14. కాళీపట్నం రామారావు సంక్షిప్తంగా (2)
15. కొండ, పర్వతం (2)
16. శరీరం (2)
17. కీడు (2)
18. శ్రేష్ఠం, గొప్ప (2)
20. తక్కువలో తక్కువ (3)
22. పుష్పాలే (2)
23. జ్యేష్ఠ సోదరుడు (3)
24. నిలువు 24 సోదరి (2)
26. కాలు... పద్యంలో భాగం (2)
27. మనస్ఫూర్తిగా...(4)
29. రుచిని చెప్పేది (3)
31. దీనికి బారెడు మీసాలు (2)
32. గురి, ఉద్దేశం (2)
33. అంజనం (3)

**నిలువు**

1. తోడేలు (2)
2. ముసలితనం (3)
4. కంచిలోని అమ్మవారు (3)
5. కృష్ణుడి ముద్దుపేరు (3)
8. చేవ, శక్తి (2)
9. కృష్ణ భక్తురాలు (2)
10. నాగకన్య (3)
12. కదళీ (3)
13. మధురం (2)
14. బహుమతి (3)
17. నవ్వు (2)
18. అడ్డం 17కి వ్యతిరేకం (2)
19. విజ్ఞప్తులు (4)
21. మేఘం (3)
22. పాలీయ వచ్చి ప్రాణం పోగొట్టుకుంది (3)
24. అడ్డం 24 సోదరుడు (3)
25. సగం, రెండు పావులు (2)
28. తమిళ భోజనం (3)
29. మహిళకు మరో పర్యాయపదం (2)
30. స్వప్నం (2)
31. కలకలం, ధ్వని (2)

## పదరసం - 519 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 సు | 2 ప్ర | భా | 3 తం | ■ | 4 భా | 5 ర | త | 6 ర | త్న |
| ■ | తి | ■ | 7 గే | యం | ■ | హ | ■ | మ | ■ |
| 8 ఆ | జ్ఞ | ■ | డు | ■ | 9 కాం | స్యం | ■ | ణీ | ■ |
| కా | ■ | 10 క | ■ | 11 లి | చ | ■ | 12 సా | యం | త్రం |
| 13 శం | 14 పా | ల | 15 త | ■ | 16 న | గ | ము | ■ | ■ |
| ■ | 17 క | త | లు | ■ | ము | ■ | ■ | 18 చే | 19 మ |
| 20 గం | ■ | ■ | 21 పు | 22 రం | ■ | 20 శం | 24 త | ను | డు |
| గి | ■ | 25 టి | ■ | 26 భ | 27 వ | భూ | తి | ■ | గు |
| 28 గో | | ■ | 29 నా | ■ | శం | ■ | 30 మా | 31 త | ■ |
| వు | ■ | 32 బో | నా | లు | ■ | 33 మే | ■ | ల | క్నో |

సి ని మా

దర్శకుడు శేఖర్ కమ్ములది చిత్రసీమలో పాతికేళ్ల ప్రస్థానం. 2000 సంవత్సరంలో 'డాలర్ డ్రీమ్స్' సినిమాతో దర్శకుడయ్యాడు. సినిమా రూపకల్పన మీద బలమైన కోరికతో స్వదేశానికి వచ్చి, మిత్రులతో కలిసి అమిగోస్ క్రియేషన్స్ అనే సంస్థను స్థాపించి స్వీయ దర్శకత్వంలో ఆ చిత్రాన్ని నిర్మించాడు. ఆ చిత్రం ఉత్తమ నూతన చిత్ర దర్శకుడిగా జాతీయ పురస్కారం అందుకున్నాడు. భారత్ నుండి డాలర్ల వేట కోసం అమెరికా వెళ్లిన ఓ యువకుడు ఒకానొక సందర్భంలో 'ఓ మై జీసస్' అనగానే... 'ఏరా... దేశం వదలగానే దేవుడిని కూడా మార్చేశావా?' అని ఆ చిత్రంలోని ఓ పాత్ర వ్యంగ్యంగా ప్రశ్నిస్తుంది. శేఖర్ కమ్ములకు ఈ దేశం పట్ల, ధర్మం పట్ల ఉన్న అభిమానానికి ఆ సంభాషణ ఒక ఉదాహరణ. అలాంటి ఆయన ఇప్పుడు నిదానంగా పంథాను మార్చుకున్నారేమో అనిపిస్తోంది. సమాజంలోని లోటు పాట్లను ఎత్తి చూపుతూనే, దీన్ని ఎలా బాగు చేయాలో చెప్పకుండా... వ్యవస్థను దుమ్మెత్తిపోసే కార్యక్రమం చేపట్టారనిపిస్తోంది. తాజాగా విడుదలైన ఆయన పదో చిత్రం 'కుబేర' ఆ కోవకు చెందిందే.



# ఎటు నుంచి ఎటో వెళ్లిన కుబేర!

నీరజ్ మిత్ర (జిమ్ సార్బ్)భారతదేశంలోనే అత్యధిక ధనవంతుడు. అతనికున్న ధనదాహం ఒక పట్టాన తీరేది కాదు. వరల్డ్ రిచ్చెస్ట్ మ్యాన్ కావాలనే కాంక్షతో ప్రభుత్వాలను తన హస్తగతం చేసుకోవాలని చూస్తాడు. బంగాళా ఖాతంలో ప్రభుత్వ నిర్వహణలో ఉన్న ఓ ఆయిల్ రిజర్వ్‌ను ఆక్రమించుకుంటాడు. అందుకోసం వందలాది మందిని చంపేస్తాడు. దీని కోసం కేంద్ర మంత్రి సిద్ధప్ప (హరీశ్ పేరడి)తో రూ.లక్షల కోట్ల డీల్ పెట్టుకుంటాడు. ఆ భారీ మొత్తాన్ని చేతులు మార్చడం కోసం నిజాయతీపరుడు, కొందరి కుట్ర కారణంగా జైలు పాలైన సీబీఐ ఆఫీసర్ దీపక్ తేజ్ (నాగార్జున) సాయం తీసుకుంటాడు. రూ.కోట్లు నేరుగా కార్పొరేట్ కంపెనీ ట్రాన్స్‌ఫర్ చేయడం కరెక్ట్ కాదు కాబట్టి నలుగురు బిచ్చగాళ్లను దీపక్ ఎంపిక చేసుకుంటాడు. వారితో షెల్ కంపెనీస్ తెరిపించి, స్విస్ బ్యాంక్‌లో ఖాతాలు ఓపెన్ చేయించి, వాటిలో డబ్బులు జమ చేసి, ఆపైన వాటిని సంబంధిత అవినీతిపరులకు అందచేయాలన్నది అతని ప్లాన్. ఇందులో ఒక బిచ్చగాడైన దేవా (ధనుష్) తన ఖాతాలో రూ.పదివేల కోట్లు పడిన తర్వాత ఎస్కేప్ అయిపోతాడు. అతన్ని ఎలా పట్టుకున్నారు? అతని ఖాతాలోని మొత్తాన్ని నీరజ్ మిత్ర తిరిగి పొందగలిగాడా? దీపక్ తేజ్ ఈ వ్యవహారంలో ఎలా బలిపశువు అయ్యాడు? అనేది మిగతా కథ.

మన దేశంలోని కార్పొరేట్ కంపెనీలు అన్నీ శుద్ధపూసలు అని చెప్పలేం. ప్రభుత్వాలను మభ్యపెట్టి, అక్రమంగా అనుమతులు పొందుతూ, హద్దు మీరి ప్రజాసంపదను కొల్లగొడుతున్నాయి. కొన్ని దశాబ్దాలుగా ఈ తంతు సాగుతోంది. అలాంటి ఓ కార్పొరేట్ టైకూన్ కథే ఇది. అత్యంత ధనికుడైన ఓ వ్యాపారవేత్తకు ఓ బిచ్చగాడు ఎలాంటి సవాల్ విసిరాడు? అనేది 'కుబేర' థీమ్. నథింగ్ అనుకున్న బెగ్గర్ చేతిలో చివరకు ఆ కార్పొరేట్ టైకూన్ ఎలా కుక్క చావు చచ్చాడు? అనేది క్లయిమాక్స్. అయితే... ఈ కథను తెలియచెప్పే ప్రయత్నంలో శేఖర్ కమ్ముల టీమ్ అండర్ కరెంట్‌గా ఓ హిడెన్ ఎజెండాను భుజానికెత్తుకుంది.

గత కొంతకాలంగా ఈ దేశంలోని కమ్యూనిస్టు పార్టీలు, వాటి అనుబంధ సంస్థలు కార్పొరేట్ కంపెనీల మీద కక్ష కట్టాయి. ఏదో రకంగా వారిని బద్నాం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. వాటికి అనుకూలంగా కేంద్రంలోని పార్టీ వ్యవహరిస్తోందనే ప్రచారం చేస్తున్నాయి. ఇలాంటి కార్పొరేట్ కంపెనీల అధినేతలు భక్తితోనో, భయంతోనో లేక అపరాధ భావంతోనో దేవుళ్లకు బంగారు కిరీటాలు, వజ్రాల ఆభరణాలు చేయించడం చూస్తున్నాం. ఇలా అక్రమార్జన చేసే కార్పొరేట్ కంపెనీలను విమర్శించే నెపంతో సాటి మనుషుల మీద కంటే కూడా వీరికి దేవుడి మీదనే భక్తి అనే పాయింట్‌ను ఈ చిత్రంలో అవకాశం దొరికినప్పుడల్లా నొక్కి నొక్కి చెప్పే ప్రయత్నం చేశారు. తిరుపతిలో రోడ్డు దాటుతున్న బిచ్చగాడిని గుద్దేసి, పట్టించుకోకుండా దైవదర్శనానికి వెళ్లే భక్తులను చూపించారు. అడుక్కునే వాడికి ఈ దేశంలో విలువలేదని, అలాంటి వాడిని హీనాతిహీనంగా ఈ సమాజం చూస్తుందని, మానవత్వం మరిచిన భక్తి తత్త్వంలో జనాలు మునిగిపోతున్నారని ఎద్దేవా చేయడం కూడా ఉంది. చిత్రం ఏమంటే... ఈ చిత్ర కథానాయకుడు... అదే బిచ్చగాడు... సెక్యులర్ బెగ్గర్! అతను ఉండేది పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలోనే అయినా... యాచన సమయంలో శుక్రవారం వస్తే మసీదుకు, ఆదివారం చర్చికూ వెళ్లి అడుక్కుంటాడన్నమాట. అలాంటి ఓ బిచ్చగాడు తన ఖాతాలో రూ. పదివేల కోట్లు పడేసరికీ తనలా ఈ దేశంలోని ప్రధాన నగరాల్లో అడుక్కునే వారికి నివాసం, చదువు, ఆరోగ్యం అందించాలనే ధృక్పథంతో ఆ మొత్తాన్ని దక్కించుకోవడం కోసం కార్పొరేట్ టైకూన్‌ను గొంతుకోసి చంపేస్తాడు. నిజానికి ఆ కార్పొరేట్ టైకూన్‌ను చట్టానికి పట్టించే ఆధారాలు ఆ బిచ్చగాడి దగ్గర ఉంటాయి. ప్రాణాలను పణంగా పెట్టి దీపక్ వాటిని బిచ్చగాడికి ఇస్తాడు. 'నీ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడంతో పాటు నీరజ్ మిత్రాను జైలుకు పంపే ఆధారాలు ఇవి' అని చెబుతాడు. కానీ బిచ్చగాడు ఈ వ్యవస్థను విశ్వసించకుండా, చట్టాన్ని తన చేతిల్లోకి తీసుకుని నీరజ్‌ను చంపేస్తాడు. అక్కడితో శుభం కార్డు పడుతుంది. అయితే... పదివేల కోట్లు పొందిన ఈ బిచ్చగాడు తన తోటి బిచ్చగాళ్ల జీవితంలో ఎలా వెలుగులు నింపాడనేది మాత్రం చూపకుండా ప్రేక్షకులకు వదిలేశాడు. నిత్యం పత్రికల పతాక శీర్షికల్లో కనిపించే ఆ బిజినెస్ టైకూన్ నడి రోడ్డు మీద అడుక్కుంటుంటే... ఏ ఒక్కరూ అతన్ని గుర్తు పట్టరు!

శేఖర్ కమ్ముల 'ఆనంద్'ను ఇష్టపడని వారు లేరంటే అతిశయోక్తి కాదు. ఆ సినిమా విడుదలైన రోజునే చిరంజీవి 'శంకర్ దాదా ఎంబీబీయస్' విడుదలైంది. చిరంజీవి సినిమా కంటే 'ఆనంద్' మూవీకే ఎక్కువ పేరొచ్చింది. శేఖర్ కమ్ముల ఆ తర్వాత తెరకెక్కించిన 'గోదావరి, హ్యాపీడేస్, లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్, ఫిదా' వంటి సినిమాలను జనాలు బాగానే ఆదరించారు. ఆయన తీసిన 'లీడర్' వీటికి భిన్నమైంది. అవినీతి పాలనకు స్వస్తి చెప్పి, ప్రభుత్వాన్ని రద్దు చేసి ప్రజల సహకారంతో మళ్లీ గెలిచి సత్ పాలన అందించాలని తపించే యువకుడి కథ అది. అలాంటి సినిమాలు తీసిన శేఖర్ కమ్ముల గత చిత్రం 'లవ్ స్టోరీ' నుండి తప్పటడుగులు వేస్తున్నట్టు అనిపిస్తోంది. 'కుబేర'కు మంచి ఆదరణ లభిస్తున్నా దర్శకుడు ఏం చెప్పదల్చుకున్నాడు అని తరచి చూస్తే, ఇది సోఫెస్టికేటెడ్ ఆర్. నారాయణ మూర్తి మార్క్ సినిమా అనిపిస్తుంది.

**– అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు
















| | | | | |
|---|---|---|---|---|
| వెల : ₹.300/- | వెల : ₹.100/- | వెల : ₹.400/- | వెల : ₹.200/- | వెల : ₹.200/- |















| | | | | |
|---|---|---|---|---|
| వెల : ₹.499/- | వెల : ₹.200/- | వెల : ₹.250/- | వెల : ₹.300/- | వెల : ₹.525/- |
















| | | | | |
|---|---|---|---|---|
| వెల : ₹.499/- | వెల: PB ₹.549/- | వెల :₹.450/- | వెల : ₹.399/- | వెల : ₹.125/- |

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 36

# G. PULLA REDDY
## DEGREE & P.G. COLLEGE

**(Affiliated to Osmania University)**

**MEHDIPATNAM,** HYDERABAD - 28

**Ph : 23513154**

**English Medium** **Estd 1994** **Co-Education**

**(A College Striving for Excellence in Quality Education)**

### COURSES OFFERED

- **B.Sc** (M.S.Cs) (M.P.Cs) (M.E.Cs)
- **B.B.A**
- **B.Com** (Computers Applications) (General)
- **M.Sc** (Mathematics) (Physics)

**WE HAVE :** ✦ Well Equipped Labs & Library ✦ Qualified & Experienced Faculty ✦ Well Furnished Classrooms ✦ Campus Placements

**For Details contact office between *10.00 A.M. & 5.00 P.M***

**PRINCIPAL**